www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



మంగళవారం | 7-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 21 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం, తిథి: చతుర్దశి ఉ. 11.41 తదుపరి అమావాస్య నక్షత్రం: అశ్విని మ. 3.32 తదుపరి భరణి; వర్జ్యం: ఉ.11.53-1.21, రా.12.20-1.48, దుర్ముహూర్తం: ఉ.8.22-9.13, రా.10.14-10.58, అమృతఘడియలు: ఉ.8.59-10.26; రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 5.49, సూర్యాస్తమయం: 6.33 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



రికార్డు స్థాయికి ఎంఎఫ్‌ల పెట్టుబడులు

మార్చి త్రైమాసికంలో రూ.81,539 కోట్లు ఇన్వెస్ట్

11 నెలల కనిష్ఠ స్థాయికి ఎఫ్‌పీఐల వాటా



న్యూఢిల్లీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్ఈ)లో నమోదైన కంపెనీల షేర్లలో మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పెట్టుబడులు రికార్డు స్థాయికి చేరాయి. 2024 మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఈ కంపెనీల ఈక్విటీలో ఎంఎఫ్‌ల పెట్టుబడులు గతంలో ఎన్నడూ లేని విధంగా 8.92 శాతానికి చేరాయి. 2023 డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఇది 0.11 శాతం ఎక్కువ. మార్చి త్రైమాసికంలో ఎంఎఫ్‌లు.. ఈక్విటీ మార్కెట్‌లో రూ.81,539 కోట్లు పెట్టుబడి పెట్టాయి.

ఎల్ఐసీదే అగ్రస్థానం

ఎన్‌ఎస్ఈ లిస్టెడ్ కంపెనీల షేర్లలో సంస్థాగత మదుపరుల పెట్టుబడుల విషయంలో ఎల్ఐసీదే అగ్రస్థానం. ఈ ఏడాది మార్చి నెలాఖరుకు ఎన్‌ఎస్ఈలో లిస్టయిన దాదాపు 280 కంపెనీల ఈక్విటీలో ఎల్ఐసీ ఒక శాతానికి పైగా వాటా కలిగి ఉంది. మొత్తం పెట్టుబడులను పరిగణనలోకి తీసుకుంటే 2023 డిసెంబరు త్రైమాసికానికి ఈ కంపెనీల ఈక్విటీలో ఎల్ఐసీకి సగటున 3.64 శాతం వాటా ఉంది. మార్చి త్రైమాసికానికి ఇది 3.75 శాతానికి పెరిగింది.

తగ్గిన ఎఫ్‌పీఐల వాటా

అయితే ఈ ఏడాది మార్చి త్రైమాసికంలో ఎన్‌ఎస్ఈ లిస్టెడ్ కంపెనీల ఈక్విటీలో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) పెట్టుబడులు 18.19 శాతం నుంచి 17.68 శాతానికి పడిపోయాయి. గత 11 ఏళ్లలో ఎఫ్‌పీఐల పెట్టుబడులు ఈ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. ఇదే సమయంలో ఎంఎఫ్‌లు, బీమా కంపెనీలు, బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ వంటి దేశీయ సంస్థాగత మదుపరుల (డీఐఐ) పెట్టుబడుల వాటా 15.96 శాతం నుంచి 16.05 శాతానికి పెరిగాయి.

మార్చి త్రైమాసికంలో ఈ సంస్థలన్నీ కలిసి దేశీయ స్టాక్ మార్కెట్లో రూ.1.08 లక్షల కోట్లు మదుపు చేయడం ఇందుకు ప్రధాన కారణం. పెట్టుబడుల జోరు ఇదే స్థాయిలో కొనసాగితే వచ్చే కొద్ది త్రైమాసికాల్లో డీఐఐల పెట్టుబడులు ఎఫ్‌పీఐలను మించి పోతాయని ప్రైమ్‌డేటా బేస్ గ్రూప్ ఎండీ ప్రణవ్ హల్దియా అంటున్నారు.

నెఫ్రోప్లస్‌లో క్వాడ్రియా క్యాపిటల్ రూ.850 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్: ప్రైవేట్ ఈక్విటీ సంస్థ క్వాడ్రియా క్యాపిటల్ నుంచి సీరిస్ ఎఫ్ రౌండ్‌లో రూ.850 కోట్లు సమీకరించినట్లు డయాలసిస్ నెట్‌వర్క్ సంస్థ నెఫ్రోప్లస్ వెల్లడించింది. లావాదేవీలో భాగంగా నెఫ్రోప్లస్‌లోని ప్రస్తుత వాటాదారుల నుంచి షేర్లు కొనుగోలు చేయటంతో పాటు కంపెనీలో మైనారిటీ వాటాను క్వాడ్రియా క్యాపిటల్ దక్కించుకోనుంది. కాగా భారతీయ నెఫ్రాలజీ రంగంలో ఇంత పెద్దమొత్తంలో నిధులు సమీకరించటం ఇదే తొలిసారి. గడిచిన కొన్నేళ్లుగా కంపెనీ వ్యాపారం గణనీయంగా పుంజుకుంటూ వస్తోందని, దాదాపు 30,000 మంది రోగులకు నాణ్యమైన డయాలసిస్ సేవలను అందిస్తున్నట్లు నెఫ్రోప్లస్ వ్యవస్థాపకుడు, సీఈఓ విక్రమ్ ఉప్పల తెలిపారు. క్వాడ్రియా పెట్టుబడులతో భారత్ సహా ఆసియా వ్యాప్తంగా కంపెనీ కార్యకలాపాలను మరింతగా విస్తరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2010లో కార్యకలాపాలు ప్రారంభించిన నెఫ్రోప్లస్ ప్రస్తుతం భారత్, ఫిలిప్పీన్స్, ఉజ్బెకిస్థాన్‌లలోని 250కి పైగా పట్టణాలు, నగరాల్లో 450 డయాలసిస్ కేంద్రాలను నిర్వహిస్తోంది.

'ఎన్ఆర్ఐ'లకూ యూపీఐ చెల్లింపుల సౌకర్యం

ఐసీఐసీఐ బ్యాంక్

దుబాయ్: ఐసీఐసీఐ బ్యాంక్ తన ఎన్ఆర్ఐ ఖాతాదారుల కోసం మరో ప్రత్యేక సౌలభ్యం కల్పించింది. వీరు ఇక తమ ఎన్ఆర్ఈ/ఎన్ఆర్ఓ ఖాతాలతో అనుసంధానమైన అంతర్జాతీయ మొబైల్ ఫోన్ నంబర్ల ద్వారా దేశంలో యూపీఐ చెల్లింపులను అప్పటికప్పుడు చేయవచ్చు. దీంతో తమ ఎన్ఆర్ఐ ఖాతాదారులు రోజువారీ చేసే యుటిలిటీ బిల్లుల చెల్లింపులు, మర్చంట్ అండ్ ఈ-కామర్స్ లావాదేవీలు అత్యంత సౌకర్యవంతంగా మారతాయని బ్యాంక్ తెలిపింది. తమ 'ఐమొబైల్ పే' యాప్ ద్వారా ఎన్ఆర్ఐ ఖాతాదారులకు ఈ సౌకర్యం కల్పిస్తున్నట్టు పేర్కొంది. అమెరికా, బ్రిటన్, యూఏఈ, కెనడా, సింగపూర్, ఆస్ట్రేలియా, హాంకాంగ్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియాలోని ఎన్ఆర్ఐ ఖాతాదారులకు మాత్రమే ఈ సౌకర్యం లభిస్తుందని బ్యాంక్ తెలిపింది.

జూన్ 6 నుంచి స్పెక్ట్రమ్ వేలం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పెక్ట్రమ్ వేలానికి సిద్ధమవుతోంది. జూన్ 6 నుంచి ఈ వేలం ప్రారంభం కానుంది. దాదాపు రూ.96,317 కోట్ల కనీస ధరతో ప్రభుత్వం ఈ స్పెక్ట్రమ్‌ను వేలం వేయనుంది. ఈ వేలంలో పాల్గొనేందుకు రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కంపెనీలు ఇప్పటికే ఆసక్తి వ్యక్తం చేశాయి. గతంలోలా అదానీ గ్రూప్ నుంచి మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు. 800, 900, 1800, 2,100, 2,300, 2,500, 3,300 మెగాహెట్జ్ బ్యాండ్స్‌తో పాటు 26 గిగా హెట్జ్ బ్యాండ్ స్పెక్ట్రాన్ని ప్రభుత్వం వేలం వేయనుంది. ఈ వేలంలో అత్యధిక ధర చెల్లించిన కంపెనీ ఆయా స్పెక్ట్రమ్‌ను 20 ఏళ్ల పాటు వినియోగించుకోవచ్చు. ఈ చెల్లింపులను 20 వార్షిక వాయిదాల్లో చెల్లించాలి.

నరేశ్ గోయల్‌కు బెయిల్

ముంబై: జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్‌కు బాంబే హైకోర్టులో కొద్దిగా ఊరట లభించింది. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయనకు కోర్టు రెండు నెలల తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. అయితే ఇందుకోసం ఆయన తన పాస్‌పోర్టును ఈడీ అధికారులకు అప్పగించడంతో పాటు రూ.లక్షకు పూచీకత్తు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. అలాగే ట్రయల్ కోర్టు అనుమతి లేకుండా ముంబై దాటిపోవద్దని కోరింది. అక్రమ నగదు లావాదేవీల చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈడీ గత ఏడాది సెప్టెంబరులో గోయల్‌ను అరెస్టు చేసింది.

ఆగస్టు నుంచి బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు !

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఎట్టకేలకు 4జీ సేవల్లోకి ప్రవేశిస్తోంది. ఆగస్టులో దేశవ్యాప్తంగా ఈ సేవలు ప్రారంభించనున్నట్టు పేరు చెప్పేందుకు ఇష్టపడని బీఎస్ఎన్ఎల్ అధికార వర్గాలు చెప్పాయి. ఇందుకు అవసరమైన టెక్నాలజీని బీఎస్ఎన్ఎల్ పూర్తిగా దేశీయంగా సమకూర్చుకుంటోంది. సీ-డాట్, టీసీఎస్, ఐటీఐ సమకూర్చిన సాఫ్ట్‌వేర్, పరికరాలతో కంపెనీ గత ఏడాది కాలంగా పంజాబ్ సర్కిల్‌తో పాటు మరికొన్ని సర్కిళ్లలో 4జీ సేవలు అందిస్తోంది. ఈ పరీక్షలు విజయవంతం కావడంతో ఆగస్టులో దేశవ్యాప్తంగా ఈ సేవలు ప్రారంభించాలని యోచిస్తోంది. ఈ 4జీ పరికరాలను అవసరమైతే 5జీ సేవలకు కూడా అప్‌గ్రేడ్ చేయవచ్చని బీఎస్ఎన్ఎల్ వర్గాలు చెప్పాయి.

బీఏఎస్ఎఫ్ నుంచి 'ఎఫికాన్' కీటక నాశిని

280 ఎంఎల్ బాటిల్ ధర రూ.1,830



హైదరాబాద్: ప్రముఖ పురుగు మందుల తయారీ కంపెనీ బీఏఎస్ఎఫ్ 'ఎఫికాన్' పేరుతో ప్రత్యేక క్రిమిసంహారక మందును భారత మార్కెట్లోకి విడుదల చేసింది. పత్తి వంటి వాణిజ్య పంటలతో పాటు కూరగాయల మొక్కలను నాశనం చేసే పేను బంక, తెల్ల దోమ, పచ్చ దోమలను ఈ మందు సమర్థవంతంగా అడ్డుకుంటుందని కంపెనీ ఆసియా పసిఫిక్ ప్రాంత అగ్రికల్చరల్ సొల్యూషన్స్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సైమన్ బర్గ్ విలేకరులతో చెప్పారు. భారత్‌తో పాటు అనేక దేశాల్లో ఈ క్రిముల కారణంగా పంటల ఉత్పాదకత 35 నుంచి 40 శాతం పడిపోతోంది. ఎఫికాన్ ఈ బెడదను సమర్థవంతంగా ఎదుర్కొంటుందని బర్గ్ తెలిపారు. ఇప్పటికే ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా దేశాల రైతులు ఈ క్రిమినాశిని మందును ఉపయోగిస్తున్నట్టు చెప్పారు. రూ.1,830 ధరతో 280 ఎంఎల్ బాటిల్స్‌లో ఇది లభిస్తుందని బీఏఎస్ఎఫ్ అగ్రికల్చరల్ సొల్యూషన్స్ బిజినెస్ డైరెక్టర్ గిరిధర్ రణువ చెప్పారు. ఎకరా పైరుకు ఒక 280 బాటిల్ ఎఫికాన్ సరిపోతుందన్నారు. పిచికారీ చేసిన తర్వాత పంటలపై దీని ప్రభావం చాలా కాలం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఈ క్రిమినాశిని మందుకు అవసరమైన ఫార్ములేషన్‌ను సింగపూర్ నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు చెప్పారు. త్వరలోనే ఈ ఫార్ములేషన్‌ను భారత్‌లో తయారు చేస్తామన్నారు. వచ్చే ఏడాది వరి పంటకు సోకే క్రిమి కీటకాలను నాశనం చేసే ప్రత్యేక క్రిమిసంహారక మందును మార్కెట్లోకి విడుదల చేయబోతున్నట్టు గిరిధర్ చెప్పారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,050 ▲	66,050 ▲	87,500 ▲
ముంబై	71,816 ▲	65,784 ▲	81,892 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7వ తేదీ



హైదరాబాద్	480
వరంగల్	482
చిత్తూరు	563
విజయవాడ	460
గోదావరి	460
విశాఖపట్నం	470

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	138
వరంగల్	138
కరీంనగర్	138
మహబూబ్‌నగర్	138
కర్నూలు	138
విశాఖపట్నం	138
గోదావరి	146
విజయవాడ	146
గుంటూరు	146
ఒంగోలు	146
చిత్తూరు	145

హైదరాబాద్‌లో 48 ఎకరాలు కొనుగోలు చేసిన మైక్రోసాఫ్ట్

హైదరాబాద్: సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలంలోని ఎలికట్ట గ్రామంలో రూ.267 కోట్లతో 48 ఎకరాలు కొనుగోలు చేసింది. గత నెల 18న దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. ఈ డాక్యుమెంట్ల ప్రకారం మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ (ఇండియా) ఒక్కో ఎకరానికి రూ.5.56 కోట్లు చెల్లించింది. డేటా సెంటర్ల ఏర్పాటు కోసం 2022లోనూ మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌లో రూ.275 కోట్లతో మూడు చోట్ల భూమి కొనుగోలు చేసింది.

విదేశీ విమానయాన ట్రాఫిక్‌లో సగం వాటా భారత సంస్థలదే

న్యూఢిల్లీ: మన దేశం నుంచి విదేశీ సందర్శనలకు వెళ్లే ప్రయాణికుల్లో సగం మందిని 2027-28 నాటికి భారత విమానయాన సంస్థలు వారి గమ్యాలకు తరలిస్తాయని క్రిసిల్ రేటింగ్స్ తాజా అధ్యయనంలో తేలింది. ప్రస్తుతం ఈ వాటా 43 శాతం ఉంది. భారత విమానయాన సంస్థలు అదనంగా విమానాలు, కొత్త రూట్లు ప్రవేశపెట్టడం, విదేశీ విమానయాన సంస్థలతో పోల్చితే మెరుగైన కనెక్టివిటీ కలిగి ఉండడం భారత విమానయాన రంగం బలమని క్రిసిల్ పేర్కొంది. గత 15 నెలల కాలంలో భారత విమానయాన సంస్థలు 55 కొత్త అంతర్జాతీయ రూట్లకు విమాన సర్వీసులను విస్తరించాయి.

జోరు లేని మార్కెట్

17 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: భారత షేర్లు అధిక విలువల్లో ట్రేడవుతున్నాయన్న ఆందోళనల కారణంగా దిగ్గజ కంపెనీల్లో ఇన్వెస్టర్లు లాభాల స్వీకారానికి దిగడంతో సోమవారం మార్కెట్ పరిమిత పరిధిలోనే కదలాడి చివరికి ఫ్లాట్‌గా ముగిసింది. ఇంట్రాడేలో 74,359.69 నుంచి 73,786.29 పాయింట్ల మధ్యన కదలాడిన సెన్సెక్స్ చివరికి 17.39 పాయింట్ల లాభంతో 73,895.54 వద్ద ముగిసింది. అయితే నిఫ్టీ మాత్రం 33.15 పాయింట్ల నష్టంతో 22,442.70 వద్ద క్లోజైంది. సెన్సెక్స్ షేర్లలో కోటక్ మహీంద్రా బ్యాంక్ 5 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలవగా టీసీఎస్, హెచ్‌యూఎల్, ఎం అండ్ ఎం, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంక్ లాభపడిన షేర్లలో ఉన్నాయి.

9 నుంచి ఎనర్జీ మిషన్ మెషనరీస్ ఐపీఓ: వచ్చే గురువారం ప్రారంభం కానున్న ఎనర్జీ మిషన్ మెషినరీస్ ఐపీఓలో షేరు ధర శ్రేణిని రూ.131-138గా నిర్ణయించారు. రూ.41 కోట్ల సమీకరణ లక్ష్యంతో కంపెనీ మార్కెట్లోకి వస్తోంది. ఈ ఇష్యూ మే 13న ముగుస్తుంది. షేర్లు ఎన్‌ఎస్ఈ ఎస్ఎంఈ ఎమర్జ్‌లో లిస్టింగ్ అవుతాయి. ఇష్యూలో భాగంగా ఒక్కోటి రూ.10 ముఖ విలువ గల 29.82 లక్షల ఈక్విటీ షేర్లు జారీ చేస్తారు.

ఐపీఓకు బ్రెయిన్ బీస్ తిరిగి దరఖాస్తు: ఆన్‌లైన్ ఈ-కామర్స్ వేదిక ఫస్ట్ క్రై మాతృసంస్థ బ్రెయిన్ బీస్ సొల్యూషన్స్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి తిరిగి దరఖాస్తు చేసింది. కంపెనీ కీలక సమాచారం అసంపూర్తిగా ఇచ్చిన కారణంగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తూ సెబీ గతంలో చేసిన దరఖాస్తును తిప్పి పంపింది. కొత్తగా చేసిన దరఖాస్తులో కూడా కంపెనీ నిధుల సమీకరణ లక్ష్యంలో ఎలాంటి మార్పు చేయలేదు.

పీ నోట్ పెట్టుబడులు ఆరేళ్ల గరిష్ఠం: భారత మార్కెట్లో పార్టిసిపేటరీ నోట్ల (పీ నోట్) ద్వారా పెట్టుబడులు ఫిబ్రవరి చివరి నాటికి రూ.1,49,517 కోట్లకు చేరాయి. ఇది ఆరేళ్ల గరిష్ఠ స్థాయి. దేశీయ ఆర్థిక వ్యవస్థలో బలం ఇందుకు మద్దతు ఇచ్చింది. భారత ఈక్విటీ, డెట్, హైబ్రిడ్ సెక్యూరిటీల్లో పెట్టుబడులన్నింటినీ ఇందులో పరిగణనలోకి తీసుకున్నారు. జనవరిలో పీ నోట్ పెట్టుబడుల విలువ రూ.1,43,011 కోట్లుంది. 2017 జూన్ తర్వాత పీ నోట్ పెట్టుబడులు ఇంత గరిష్ఠంగా రావడం ఇదే ప్రథమం. ఫిబ్రవరిలో వచ్చిన పీ నోట్ పెట్టుబడుల్లో 1.27 లక్షల కోట్లు ఈక్విటీల్లోకి, రూ.21,303 కోట్లు డెట్ సెక్యూరిటీల్లోకి, రూ.541 కోట్లు హైబ్రిడ్ సెక్యూరిటీల్లోకి వచ్చాయి.

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: ఢిల్లీ
ఢిల్లీ X రాజస్థాన్



ఒలింపిక్స్‌కు 4X400 రిలే జట్లు

నసౌ (బహమాస్): భారత పురుషుల, మహిళల 4x400 రిలే జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి. వరల్డ్ అథ్లెటిక్స్ రిలేలో సోమవారం జరిగిన రెండో రౌండ్ హీట్స్‌లో తెలుగమ్మాయి దండి జ్యోతికశ్రీ, రూపల్, పూవమ్మ, శుభా వెంకటేశన్‌లతో కూడిన జట్టు 3 నిమిషాల 29.35 సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచి పారిస్‌కు క్వాలిఫై అయింది. అనాస్, అజ్మల్, రాజీవ్, జాకబ్‌లతో కూడిన పురుషుల రిలే జట్టు 3 నిమిషాల 3.23 సెకన్లలో రేస్ పూర్తి చేసింది. అమెరికా తర్వాత రెండో స్థానంలో నిలిచి పారిస్ బెర్త్‌ను పట్టేసింది.

విజయంలో తెలుగమ్మాయి


జ్యోతికశ్రీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): రిలేలో భారత్‌కు పారిస్ ఒలింపిక్ బెర్త్ అందించిన క్రీడాకారిణుల బృందంలో తెలుగమ్మాయి దండి జ్యోతికశ్రీ కూడా సభ్యురాలు. జ్యోతిక స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా తణుకు. దిగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన జ్యోతిక తండ్రి శ్రీనివాసరావు ఇనుప బీరువాలు తయారు చేసి, కుటుంబాన్ని పోషిస్తాడు. తల్లి లక్ష్మీ నాగ వెంకటేశ్వరి గృహిణి. శ్రీనివాసరావుకు క్రీడలపై ఉన్న ఆసక్తితో జ్యోతికను ఐదేళ్ల వయస్సు నుంచి ఆ దిశగా నడిపించాడు. 2021 వరకు విజయవాడ 'సాయ్' కేంద్రంలో శిక్షణ తీసుకున్న జ్యోతిక, అక్కడి కోచ్ వినయ్ సహకారంతో హైదరాబాద్ సాయ్ సెంటర్‌కు మారింది. అక్కడి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ గత రెండేళ్లగా జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న జ్యోతిక, అనతి

ఈ కప్పులో ఇతడే పెద్దోడు



కంపాల (ఉగాండా): ఉగాండా జట్టు ఆఫ్ స్పిన్నర్ ఫ్రాంక్ ఎన్‌సుబుగా (43 ఏళ్ల 252 రోజులు) ఈ వరల్డ్ కప్‌లో ఆడుతున్న అతి పెద్ద వయస్సు క్రికెటర్‌గా రికార్డు సృష్టించనున్నాడు. ఇక బ్రయాన్ మసాబా సారథ్యంలోని 15 మంది సభ్యుల జట్టును ఉగాండా బోర్డు సోమవారం ప్రకటించింది. కాగా న్యూజిలాండ్, వెస్టిండీస్ తదితర జట్లతో కలిసి ఉగాండా టీమ్ గ్రూప్-సిలో ఉంది.

ప్రపంచకప్‌నకు ఉగ్ర ముప్పు



పోర్ట్ ఆఫ్ స్పెయిన్: వెస్టిండీస్, యూఎస్ఏలో జరిగే టీ20 ప్రపంచకప్‌నకు ఉగ్రవాదుల నుంచి ముప్పు ఉన్నట్టు కథనాలు వెలువడుతున్నాయి. వీటిని ట్రినిడాడ్ అండ్ టుబాగో ప్రధాని కీత్ రోలీ కూడా ధ్రువీకరించారు. ఉత్తర పాకిస్థాన్‌కు చెందిన ఇస్లామిక్ స్టేట్ సంస్థ తమ మీడియా ద్వారా ఇలాంటి హెచ్చరికలను జారీ చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే పరిస్థితిని ఐసీసీ కూడా నిశితంగా గమనిస్తోందని ట్రినిడాడ్ ప్రధాని స్పష్టం చేశారు.

నాలుగో టీ20 కూడా మనదే

సిల్హెట్: బంగ్లాదేశ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భారత మహిళల జైత్రయాత్ర కొనసాగుతోంది. సోమవారం జరిగిన నాలుగో మ్యాచ్‌లోనూ హర్మన్‌ప్రీత్ కౌర్ సేన 56 పరుగుల తేడాతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో నెగ్గింది. వర్షం వల్ల మ్యాచ్‌ను 14 ఓవర్లకు కుదించగా తొలుత భారత్ 122/6 స్కోరు చేసింది. ఇక..డక్‌వర్త్ నిబంధన ప్రకారం బంగ్లాదేశ్ లక్ష్యాన్ని 125 పరుగులుగా నిర్ధారించారు. అయితే ఛేదనలో బంగ్లా 14 ఓవర్లలో 68/7 స్కోరుకే పరిమితమై ఓడింది.

సరీన్ ఓ చీటర్!


భారత యువ జీఎంపై క్రామ్నిక్ ఆరోపణ

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ పోటీల్లో భారత యువ గ్రాండ్ మాస్టర్, 19 ఏళ్ల నిహాల్ సరీన్ మోసానికి పాల్పడుతున్నాడంటూ మాజీ వరల్డ్ చాంపియన్ వ్లాదిమిర్ క్రామ్నిక్ (రష్యా) ఎక్స్‌లో సంచలన ఆరోపణలు చేశాడు. అయితే, అతడు ఇలాంటి నిందలు వేయడం ఇదే తొలిసారి కాదు. గతంలో అమెరికా జీఎం నకమురా కూడా గేమ్‌లో మోసం చేస్తున్నాడంటూ గందరగోళం సృష్టించాడు. కాగా, క్రామ్నిక్ ఆరోపణల నేపథ్యంలో చెస్ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌గా కూడా పనిచేస్తున్న 'చెస్.కామ్' అతడి బ్లాగ్‌ను నిలిపేసింది. టాప్-10 ప్లేయర్లపై సరీన్ విజయాలు 99.99 శాతం అసాధ్యమనేది క్రామ్నిక్ వాదన. ఈ నేపథ్యంలో సరీన్‌తో ముఖాముఖిగా తలపడాలని అతడి మేనేజర్ సవాల్ విసిరాడు.

మీ 'ఇంటి గోల' భరించలేకున్నాం

సచిన్‌పై పొరుగింటి వ్యక్తి ఫిర్యాదు

ముంబై: సచిన్ టెండూల్కర్ ఇంటి నిర్మాణం పురస్కరించుకొని వస్తున్న శబ్దాలను భరించలేకున్నామని అతడి పొరుగింటి వ్యక్తి ఒకరు సోషల్ మీడియాలో ఫిర్యాదు చేశాడు. బాంద్రాలో సచిన్ ఇంటి పక్కన ఉండే దిలీప్ డిసౌజా 'ఎక్స్'లో చేసిన ఫిర్యాదు విపరీతంగా వైరల్ అవుతోంది. 'రాత్రి 9 అయ్యింది. ఉదయం నుంచి మీ ఇంటివద్ద వున్న కాంక్రీట్ మిక్సర్ వాహనం పెద్ద శబ్దం చేస్తోంది. సచిన్.. సరైన వేళలు పాటించాలని మీ ఇంటిలో పని చేస్తున్న వారికి సూచిస్తారా' అని డిసౌజా కోరాడు. అయితే ఈ పోస్ట్‌పై టెండూల్కర్ మాత్రం స్పందించలేదు.

హైబ్రిడ్ పిచ్‌లు వచ్చేశాయి

బౌలర్లకు ఉపశమనం



న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో పూర్తిగా బ్యాటర్లే ఆధిపత్యం చెలాయిస్తుండడంతో..బౌలర్లకు ఏమాత్రం ప్రాధాన్యం లేకుండా పోయింది. దాంతో మాజీలు, క్రికెట్ విశ్లేషకులనుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో మ్యాచ్‌లలో బౌలర్లు, బ్యాటర్లకు నడుమ సమతూకం సాధించేందుకు బీసీసీఐ హైబ్రిడ్ పిచ్‌లవైపు మొగ్గుచూపింది. ధర్మశాలలో వీటిని ఏర్పాటు చేసింది. ఈసారి ఐపీఎల్‌లో రెండు మ్యాచ్‌ల్లో దీనిని ఉపయోగించాలని నిర్ణయించింది. చెన్నై సూపర్ కింగ్స్-పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్ ద్వారా దేశంలో మొదటిసారి హైబ్రిడ్ వికెట్‌ను ఆవిష్కరించారు. 9న జరిగే రెండో మ్యాచ్‌లో బెంగళూరుతో పంజాబ్ ఈ హైబ్రిడ్ పిచ్‌పైనే తలపడనుంది. సహజ సిద్ధమైన పచ్చిక, సింథటిక్ ఫైబర్ మిశ్రమాలతో తయారు చేసిన వికెట్‌నే హైబ్రిడ్ పిచ్ అంటారు. చాలాసేపు ఈ పిచ్ తాజాగా ఉంటుంది. బౌలర్లు ఎక్కువ బౌన్స్ రాబట్టగలుగుతారు. క్రికెట్ పిచ్‌ల సహజ లక్షణాలను పరిరక్షించే క్రమంలో ఈ వికెట్లలో ఐదు శాతం మాత్రమే ఫైబర్ వినియోగిస్తున్నారు.

మరో ఐదుగురు బాక్సర్లకు స్వర్ణాలు

అస్తానా (కజకిస్థాన్): ఆసియా అండర్-22, యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మరో ఐదుగురు భారత బాక్సర్లు సత్తా చాటారు. సోమవారం జరిగిన పోటీల్లో బ్రిజేశ్ తమ్టా (48 కిలోలు), ఆర్యన్ (51 కి), యశ్వర్ధన్ (63.5 కి), లక్ష్మి (50 కి), నిషా (52 కి) స్వర్ణాలు సాధించారు. మరో తొమ్మిది మంది బాక్సర్లు రజతాలు అందుకున్నారు.

సూర్య ప్రతాపం

51 బంతుల్లో అజేయ శతకం

ముంబై ఘనవిజయం ● సన్‌రైజర్స్‌కు నిరాశ


సూర్యకుమార్ (51 బంతుల్లో 102 నాటౌట్)

3
టీ20ల్లో ఎక్కువ శతకాలు (6) బాదిన మూడో భారత బ్యాటర్‌గా రుతురాజ్, రాహుల్‌తో సమంగా నిలిచిన సూర్య. విరాట్ (9), రోహిత్ (8) ముందున్నారు.

ముంబై: టీ20ల్లో వరల్డ్ నెంబర్‌వన్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ (51 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్సర్లతో 102 నాటౌట్) స్థాయికి తగ్గ ప్రదర్శనతో చెలరేగాడు. స్వల్ప ఛేదనలో ముంబై ఇండియన్స్ కాస్త తడబడినా.. తన అజేయ శతకంతో అద్భుతంగా పుంజుకుంది. దీంతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. పట్టికలోనూ తమ ఆఖరి స్థానాన్ని కాస్త మెరుగుపర్చుకుంది. అటు కమిన్స్ సేన మాత్రం బ్యాటింగ్, బౌలింగ్‌లోనూ విఫలమైంది. ముందుగా సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 173 పరుగులు చేసింది. హెడ్ (48), కమిన్స్ (17 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 35 నాటౌట్) రాణించారు. హార్దిక్ పాండ్యా పీయూష్ చావ్లాలకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ముంబై 17.2 ఓవర్లలో 3 వికెట్లకు 174 పరుగులు చేసి గెలిచింది. తిలక్ వర్మ (37 నాటౌట్) అండగా నిలిచాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సూర్య నిలిచాడు.

సూర్య-తిలక్ శతక భాగస్వామ్యం: ఓ మాదిరి ఛేదనలో ముంబై ఇన్నింగ్స్ సైతం రైజర్స్ మాదిరే సాగింది. తొలి ఐదు ఓవర్లలోనే ఇషాన్ (9), రోహిత్ (4), నమన్ ధిర్ (0)ల వికెట్లను కోల్పోయింది. అప్పటికి స్కోరు 31 మాత్రమే. గత 12 మ్యాచ్‌ల్లో కేవలం రెండుసార్లు మాత్రమే ముంబై ఓపెనర్లు పవర్‌ప్లే దాటడం గమనార్హం. అయితే సూర్యకుమార్ తన స్ట్రోక్‌ప్లేతో అదరగొట్టగా.. అతడికి తిలక్ చక్కటి సహకారం అందించాడు. ఆరో ఓవర్‌లో తిలక్ 4,4 సూర్య 6తో 16 రన్స్ రాగా.. తర్వాతి ఓవర్‌లోనే సూర్య మరింత చెలరేగి 4,4,6,6తో 22 రన్స్ రాబట్టాడు. దీంతో స్కోరు గాడిన పడింది. అటు రైజర్స్ బౌలర్లు కూడా ఈ జోడీని విడదీసేందుకు చెమటోడ్చాల్సి వచ్చింది. వరుస ఫోర్లతో ఆకట్టుకున్న సూర్య 30 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. 17వ ఓవర్‌లోనైతే వరుసగా 4,4,6తో 18 రన్స్ రాబట్టి సెంచరీ ముంగిట నిలిచాడు. చివర్లో జట్టు విజయానికి ఏడు.. సూర్య శతకానికి ఆరు పరుగులు అవసరమైన దశలో తిలక్ సింగిల్ తీయగా, సూర్య సిక్స్‌తో మ్యాచ్‌ను ముగించాడు. నాలుగో వికెట్‌కు ఇద్దరూ అజేయంగా 143 పరుగులు అందించడం విశేషం.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర.రే
కోల్‌కతా	11	8	3	0	16	1.453
రాజస్థాన్	10	8	2	0	16	0.622
చెన్నై	11	6	5	0	12	0.700
హైదరాబాద్	11	6	5	0	12	-0.065
లఖ్‌నవూ	11	6	5	0	12	-0.371
ఢిల్లీ	11	5	6	0	10	-0.442
బెంగళూరు	11	4	7	0	8	-0.049
పంజాబ్	11	4	7	0	8	-0.187
ముంబై	12	4	8	0	8	-0.212
గుజరాత్	11	4	7	0	8	-1.320

ఆఖర్లో కోలుకుని..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ తన సహజశైలిలో దూకుడు కనబర్చలేకపోయింది. ఓపెనర్ హెడ్ బ్యాట్ నుంచి పెద్దగా మెరుపులు కనిపించలేదు. అయితే ఆఖర్లో కెప్టెన్ కమిన్స్ పుణ్యమా అని కాస్త పరుగులు జత చేరడంతో స్కోరు 170 దాటగలిగింది. పవర్‌ప్లేలో 56/1తో సన్‌రైజర్స్ ఫర్వాలేదనిపించినా.. ఆ తర్వాత ముంబై బౌలర్లు వికెట్లతో పాటు రన్స్‌ను కట్టడి చేశారు. దీంతో హెడ్ 11వ ఓవర్ వరకు ఉన్నా స్కోరు వంద పరుగులు కూడా దాటలేకపోయింది. ఐదో ఓవర్‌లోనే హెడ్‌ను అరంగేట్ర పేసర్ అన్షుల్ అవుట్ చేసినా అది నోబ్‌గా తేలింది. అటు 6,4,4తో అతను ఆ ఓవర్‌లో 19 రన్స్ రాబట్టాడు. మరో ఓపెనర్ అభిషేక్ (11)ను ఆరో ఓవర్‌లో బుమ్రా పెవిలియన్ చేర్చాడు. ఇక, అన్షుల్ ఇన్నింగ్స్ ఎనిమిదో ఓవర్‌లోనూ హెడ్ క్యాచ్‌ను తుషార వదిలేశాడు. అదే ఓవర్‌లో మయాంక్ అగర్వాల్ (5)ను అవుట్ చేసిన అన్షుల్ కెరీర్‌లో తొలి వికెట్‌తో సంతృప్తి చెందాడు. ఆ తర్వాత నితీశ్ వచ్చీ రాగానే రెండు ఫోర్లతో ఆకట్టుకున్నాడు. కానీ స్పిన్నర్ పీయూష్ చావ్లా తన వరుస ఓవర్లలో హెడ్, క్లాసెన్ (2)లను అవుట్ చేయగా.. నితీశ్‌ను హార్దిక్ వెనక్కిపంపడంతో 96/5 స్కోరుతో జట్టు కష్టాల్లో పడింది. ఈ దశలో మార్కో జాన్సెన్ (17) 6,4తో జోరు ప్రదర్శించాడు. అయితే ఆ వెంటనే 16వ ఓవర్‌లో షాబాజ్ (10), జాన్సెన్‌ల వికెట్లతో హార్దిక్ ఝలక్ ఇచ్చాడు. ఇక అబ్దుల్ సమద్ (3)ను చావ్లా ఎల్బీ చేయడంతో రైజర్స్ 150 స్కోరు కూడా కష్టమే అనిపించింది. కానీ కెప్టెన్ కమిన్స్ ఆఖర్లో అదరగొట్టాడు. బుమ్రా ఓవర్‌లో ఫోర్ బాదిన అతను తుషారను లక్ష్యంగా చేసుకుని చివరి ఓవర్‌లో 6,4తో 17 రన్స్ రాబట్టడంతో జట్టు మెరుగ్గానే కోలుకుంది.

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: హెడ్ (సి) తిలక్ (బి) చావ్లా 48, అభిషేక్ (సి) ఇషాన్ (బి) బుమ్రా 11, మయాంక్ (బి) అన్షుల్ 5, నితీశ్ (సి) అన్షుల్ (బి) హార్దిక్ 20, క్లాసెన్ (బి) చావ్లా 2, జాన్సెన్ (బి) హార్దిక్ 17, షాబాజ్ (సి) సూర్య (బి) హార్దిక్ 10, అబ్దుల్ (ఎల్బీ) చావ్లా 3, కమిన్స్ (నాటౌట్) 35, సన్వీర్ (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 20 ఓవర్లలో 173/8; వికెట్ల పతనం:** 1-56, 2-68, 3-90, 4-92, 5-96, 6-120, 7-124, 8-136; **బౌలింగ్:** నువాన్ తుషార 4-0-42-0, అన్షుల్ కాంబోజ్ 4-0-42-1, బుమ్రా 4-0-23-1, హార్దిక్ 4-0-31-3, పీయూష్ చావ్లా 4-0-33-3.

ముంబై: ఇషాన్ (సి) మయాంక్ (బి) జాన్సెన్ 9, రోహిత్ (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 4, నమన్ ధిర్ (సి) జాన్సెన్ (బి) భువనేశ్వర్ 0, సూర్యకుమార్ (నాటౌట్) 102, తిలక్ (నాటౌట్) 37, **ఎక్స్‌ట్రాలు: 22; మొత్తం: 17.2 ఓవర్లలో 174/3; వికెట్ల పతనం:** 1-26, 2-31, 3-31; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-1-22-1, జాన్సెన్ 3-0-45-1, కమిన్స్ 4-1-35-1, నటరాజన్ 3.2-0-31-0, నితీశ్ 2-0-16-0, షాబాజ్ 1-0-11-0.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 7-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 21 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ

ఎండలకు కాస్త బ్రేక్.. మూడ్రోజుల పాటు వానలు!

నేడు కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు

రేపు, ఎల్లుండి ఓ మోస్తరు వానలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చాలా చోట్ల 46 డిగ్రీలపైనే నమోదు

వడదెబ్బతో ముగ్గురి మృతి

3



రంగారెడ్డి జిల్లా కాముని చెరువులో చనిపోయిన చేపలు



హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నిర్వహించిన రోడ్‌షోలో అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

బై బై మోదీ!

బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఆయన్ను గద్దె దించనున్నారు

ఆయన పదేళ్ల పాలనలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ కన్నా భారత్ అధ్వానం

బీఆర్ఎస్ సచ్చినపాము.. దాని గురించి మాట్లాడుడే దండగ

ఈటల, కేసీఆర్ బొమ్మా బొరుసులు

పంపకాల్లో తేడాలొచ్చి విడిపోయారు

హైదరాబాద్‌లో రోడ్‌షోల్లో రేవంత్

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): 'బీజేపోళ్లు మోదీ గ్యారంటీ అని అంటున్నారు కానీ, మోదీ గ్యారంటీకి వారంటీ అయిపోయింది. మోదీ ఇంటికిపోతున్నాడు. బై బై మోదీ' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే అత్యధిక నిరుద్యోగ సమస్య భారత్‌లో ఉందని, 125 దేశాల్లో ఆకలి కేకల లెక్కలు తీస్తే భారత్ 111వ స్థానంలో నిలిచి చెడ్డ పేరు తెచ్చుకుందని, పక్కనే ఉన్న పాకిస్థాన్, బంగ్లాదేశ్ కంటే మన దేశంలోనే ఆకలి ఎక్కువ ఉందని సీఎం తెలిపారు. ఇదంతా పదేళ్ల

మిగతా 10వ పేజీలో...

ఆ మూడు స్థానాలపై కాంగ్రెస్ దృష్టి

సికింద్రాబాద్, మల్కాజిగిరి, పాలమూరు స్థానాల బాధ్యత సీఎం సన్నిహితుడికి

నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయం

బూత్‌ల వారీగా పరిస్థితులపై ఆరా

విజయమే లక్ష్యంగా వ్యూహరచన

అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తర తెలంగాణ, రాజధాని శివారు జిల్లాల్లో పార్టీ గెలుపునకు ఆయన కృషి

11

రైతుభరోసా డబ్బులొచ్చాయ్!

రైతుల ఖాతాల్లో రూ.2,423 కోట్లు



కవితకు బెయిల్ రాలే

ఈడీ, సీబీఐ కేసుల్లో మళ్లీ కోర్టు తిరస్కరణ

ఢిల్లీ మద్యం కేసులో ఆమెది కీలక పాత్ర

డబ్బు సేకరించి ఆప్‌కు ఇచ్చినట్లు తెలుస్తోంది

న్యాయమూర్తి కావేరీ బవేజా వ్యాఖ్యలు

ఆదేశాల్లో ఏపీ సీఎం జగన్, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం బెయిల్ పిటిషన్ల ప్రస్తావన

నేటితో ముగియనున్న కవిత జ్యుడీషియల్ కస్టడీ

న్యూఢిల్లీ, మే 6 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం పాలసీలో అనుచిత లబ్ధి పొందటం కోసం డబ్బులు సేకరించి ఆమ్‌ఆద్మీపార్టీకి ఇచ్చిన వ్యవహారంలో కవిత కీలక పాత్రధారిగా కనిపిస్తున్నారని ఢిల్లీలోని రౌస్‌ఎవెన్యూ జిల్లా కోర్టు పేర్కొంది. ఈ కేసు తాలూకు ఆర్థిక నేరం ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతుందని, ఇక్కడ వ్యక్తిగత స్వేచ్ఛ కన్నా ప్రజాప్రయోజనం ముఖ్యమైనదని స్పష్టం చేసింది. కేసు దర్యాప్తు

మిగతా 3వ పేజీలో...

కేజ్రీవాల్‌పై ఎన్ఐఏ దర్యాప్తు చేయించండి

సిఫారసు చేసిన ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్

ఉగ్రవాది విడుదలకు ఖలిస్థాన్ సంస్థ నుంచి నిధులు తీసుకున్నట్టు ఆరోపణలున్నాయి

కేంద్ర హోం శాఖకు లేఖ రాసిన ఎల్‌జీ

2

మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

- ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చింది కాంగ్రెస్సే
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లలో కోత పెట్టింది
- రాముడికి, సనాతన ధర్మానికి కాంగ్రెస్ వ్యతిరేకం
- ప్రధాని మోదీ పాలనలో అగ్రగామిగా భారత్: జేపీ నడ్డా



పెద్దపల్లిలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు నాగలిని బహూకరిస్తున్న పార్టీ నాయకులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లలో కోత విధించి.. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. 'దొడ్డి దారిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు గండి కొట్టలేదని రాతపూర్వకంగా రాసిస్తారా..?' అని ప్రధాని మోదీ కాంగ్రెస్‌కు సవాల్ విసిరితే.. ఆ పార్టీ నోరు మెదపడం లేదన్నారు. రిజర్వేషన్ల విషయంలో రాహుల్ గాంధీ తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని.. దళిత, ఆదివాసీ, బీసీలను దగా చేస్తున్నారని విమర్శించారు. సోమవారం పెద్దపల్లి, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్, నల్లగొండలో జరిగిన జనసభల్లో నడ్డా మాట్లాడారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వకూడదని అంబేడ్కర్ రాజ్యాంగంలో స్పష్టం చేశారని తెలిపారు. బడుగు, బలహీనవర్గాల రిజర్వేషన్లు వారికే చెందాలనే సంకల్పంతో

మిగతా 12వ పేజీలో...

దేశ భవిత కోసం మోదీ పోరాటం

ప్రధాని కావాలని రాహుల్ ఆరాటం

బీజేపీ ఏలుబడిలో ఉగ్రవాదులపై ఉక్కుపాదం

మోదీ సుపరిపాలన వల్లే సాధ్యం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

కాంగ్రెస్, బీఆర్ఎస్ తోడు దొంగలు

ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్

12



బండి సంజయ్, అన్నామలైని గజమాలతో సత్కరిస్తున్న బీజేవైఎం కార్యకర్తలు

సంజయ్ యూత్ ఐకాన్

మోదీ మదిలో ఆయనకు ప్రత్యేక స్థానం.. బండి స్ఫూర్తితోనే పాదయాత్ర చేశా


తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై.. రిజర్వేషన్లను రద్దు చేయబోం

బ్యాలెట్‌లో గాడిద గుడ్డు గుర్తు ఉంటేనే కాంగ్రెస్‌కు ఓటేయండి: బండి సంజయ్

జమ్మికుంట, మే 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ యూత్ ఐకాన్ అని బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి అన్నామలై ప్రశంసించారు. ప్రధాని మోదీ మదిలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. సంజయ్ పోరాటాలు ఆదర్శంగా నిలిచాయని, ఆయన స్ఫూర్తితోనే తాను తమిళనాడులో పాదయాత్ర చేశానని తెలిపారు. ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసి.. లాఠీ దెబ్బలు, కేసులకు భయపడకుండా ప్రజల కోసం జైలుకెళ్లిన చరిత్ర బండి సంజయ్‌దని ప్రశంసించారు. సంజయ్ గెలిస్తే సామాన్యుడు గెలిచినట్లేనని స్పష్టం చేశారు. సోమవారం కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలోని జమ్మికుంటలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సమ్మేళనానికి అన్నామలై ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత ఆలోచనలకు అనుగుణంగా సంజయ్ స్పందిస్తున్నారని, వారికి

మిగతా 12వ పేజీలో...

మేడిగడ్డ వైఫల్యానికి నిర్మాణ సంస్థే కారణం!



మేడిగడ్డ పిల్లర్లకు పగుళ్లు (ఫైల్)

బ్యారేజీ పునరుద్ధరణ బాధ్యత ఆ సంస్థదే

తేల్చి చెప్పిన జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కమిటీ

డిజైన్ల ప్రకారం బ్యారేజీల నిర్మాణం జరగలేదని వెల్లడి

తెలంగాణ సర్కారుకు నివేదిక

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ వైఫల్యానికి నిర్మాణ సంస్థే కారణమని, బ్యారేజీ పునరుద్ధరణ బాధ్యత ఆ సంస్థదేనని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) కమిటీ తేల్చిచెప్పింది. 2019 వరదల సమయంలోనే బ్యారేజీ దెబ్బతిన్నదని, ఆ సమయంలో బ్యారేజీ డిఫెక్ట్ లయబిలిటీ కాలంలో ఉన్నందున పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థే తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వానికి జె.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఎన్‌డీఎస్ఏ కమిటీ సోమవారం నివేదిక ఇచ్చినట్టు తెలిసింది. డిజైన్ల ప్రకారం బ్యారేజీల నిర్మాణం జరగలేదని తేల్చిచెప్పింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను కూడా మేడిగడ్డ డిజైన్లతో నిర్మించడం వల్ల వాటిలోనూ వైఫల్యాలున్నాయని, ఆయా బ్యారేజీల్లో సీపేజీల నివారణకు ప్రత్యేక కాంక్రీట్‌తో ట్రీట్‌మెంట్ చేయాలని సూచించింది. ఇక వర్షాకాలంలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల

మిగతా 3వ పేజీలో...



నిజామాబాద్ రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ప్రాంతీయ పార్టీల సంకీర్ణమే

కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్‌లో ఏ పార్టీకీ పూర్తిస్థాయి మెజారిటీ రాదు

కమలనాథులకు 210 సీట్లు కూడా దాటవు

సబ్‌కా వికాస్ కాదు.. దేశం సత్తెనాశనమైంది

ఏ గ్యారెంటీనీ కాంగ్రెస్ అమలుచేయలేదు

14 సీట్లలో గెలిపిస్తే ప్రజలకు అండగా ఉంటాం

నిజామాబాద్ రోడ్‌షోలో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్

నిజామాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు జాతీయస్థాయిలో పూర్తి మెజారిటీ రాదని.. కేంద్రంలో ప్రాంతీయ పార్టీల సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడడానికే అవకాశం ఉందని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. సోమవారం రాత్రి నిజామాబాద్ కేంద్రంలో

మిగతా 10వ పేజీలో...



సీటీవోల అధికారాలకు కత్తెర

రూ.లక్షలోపు జీఎస్టీ రిఫండ్ పరిశీలనకే పరిమితం

రూ.కోటిపైన బాధ్యతలు కమిషనర్‌కు

'ఐటీసీ'లలో అక్రమాల నేపథ్యంలో వాణిజ్య పన్నుల శాఖ దిద్దుబాటు చర్యలు

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): వస్తుసేవల పన్ను(జీఎస్టీ) రిఫండ్ విషయంలో అవకతవకలు చోటు చేసుకున్న నేపథ్యంలో వాణిజ్య పన్నుల కమిషనరేట్ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్స్(సీటీవో)కు ఉన్న అపరిమిత అధికారాలకు కత్తెర వేసింది. రిఫండ్‌పై వారికున్న స్క్రూటినీ పరిమితిని తగ్గించింది. నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి వివర్ధ ఆటోమొబైల్స్ ఎండీ వేమిరెడ్డి రాజా రమేశ్‌రెడ్డి రూ.23.78కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ)ను క్లెయిమ్ చేసినట్లు స్టేట్ ట్యాక్స్ అధికారులు గుర్తించారు. ఈమేరకు ఆయనపై

మిగతా 3వ పేజీలో...



అనకాపల్లి సభలో ప్రధాని మోదీ, చంద్రబాబు, సీఎం రమేశ్, గీత, గంటా, నాగబాబు, శ్రీభరత్ అభివాదం

మాఫియా రాజ్.. కరప్షన్ కింగ్

జగన్ ప్రభుత్వంపై ప్రధాని ఫైర్

ఏపీలో ఇసుక, లిక్కర్, భూ మాఫియా

మద్య నిషేధమని చెప్పి.. మద్యం వ్యాపారం

అవినీతి తప్ప మరేమీ తెలియని జగన్

మేలు చేయరు.. డబ్బులు వచ్చే పనులే చేస్తారు

ఐదేళ్లు అధికారం అప్పగిస్తే వృథా చేశారు

చంద్రబాబు హయాంలో అభివృద్ధిలో అగ్రస్థానం

వైసీపీ వచ్చాక గాడి తప్పిన పురోగతి

మోదీ గ్యారెంటీ, బాబు నాయకత్వం, పవన్ విశ్వాసం.. రాజమండ్రి, అనకాపల్లి సభల్లో మోదీ

9

ఎన్నికలు సక్రమంగా జరుగుతాయనే నమ్మకం సన్నగిల్లుతోంది

రాష్ట్రంలో ఇష్టానుసారంగా అధికారులను మార్చేస్తున్నారు

ఏపీ సీఎం జగన్ బేల మాటలు!

ఎన్నికల సంఘం చర్యలపై ఆక్రోశం

ఎన్నికల కోడ్ దాటొద్దు!

సంయమనంతో మాట్లాడండి

జగన్, చంద్రబాబుకు ఈసీ ఆదేశం

9

పనిమనిషి ఇంట్లో రూ.34 కోట్లు!



ఝార్ఖండ్ రాజధాని రాంచీలో నోట్ల కలకలం

మంత్రి ఆలంగిర్ పీఎస్ పనిమనిషి ఇంట్లో ఈడీ సోదాలు

గుట్టలుగా బయటపడ్డ నోట్ల కట్టలు

నిరుడు 10 వేలు లంచం కేసులో పట్టుబడ్డ చీఫ్ ఇంజనీర్

అతడు ఇచ్చిన సమాచారంతో పలుచోట్ల ఈడీ దాడులు

పనిమనిషి ఇంటినే అవినీతి గోడౌన్‌గా మార్చేశారు

కాంగ్రెస్ యువరాజు సమాధానం చెప్పాలి: ప్రధాని మోదీ

2



అసోంలోని కామ్‌రూప్ జిల్లాలో ఎన్నికల సామగ్రిని తీసుకొని ట్రాక్టర్‌లో వెళ్తున్న సిబ్బంది

నేడు మూడో దశ

దేశవ్యాప్తంగా 93 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓటింగ్

గుజరాత్‌లోని అన్ని సీట్లకూ ఒకేసారి

మహారాష్ట్రలో 11, ఉత్తరప్రదేశ్‌లో 10, మధ్యప్రదేశ్‌లో 8, కర్ణాటక 14, అసోంలో 4 స్థానాలకు..

నేటితో 283 స్థానాల్లో పోలింగ్ పూర్తి

అహ్మదాబాద్‌లో ఓటేయనున్న మోదీ

బరిలో షా, పలువురు ప్రముఖులు

2



అబ్ కీ బార్?

రిజర్వేషన్లపై పరిమితి ఎత్తేస్తాం



ఇండియా కూటమి అధికారంలోకి వచ్చాక రిజర్వేషన్లపై ఉన్న 50% పరిమితిని ఎత్తివేస్తాం. దళితులకు, గిరిజనులకు, వెనుకబడిన వర్గాలకు అవసరమైన మేర రిజర్వేషన్లను పెంచుతాం. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 150 సీట్లు కూడా గెలవదు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే రైతుల రుణాలను మాఫీ చేస్తాం. అలాగే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీని రూ.250 నుంచి రూ.400లకు పెంచుతాం.

- మధ్యప్రదేశ్‌లో రాహుల్ గాంధీ

హిట్లర్‌తో నాకు పోలికా!



జర్మన్ నియంత అడాల్ఫ్ హిట్లర్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రతిపక్షాలు నన్ను పోలుస్తున్నాయి. కానీ, అసలైన నియంతలెవరో దేశ ప్రజలకు తెలుసు. ఎమర్జెన్సీని ప్రవేశపెట్టింది, కళాకారులపై సెన్సార్‌షిప్‌ను విధించింది, ప్రభుత్వ అధికారాలను దుర్వినియోగం చేసిందెవరో అందరికీ తెలుసు. వారు నియంతలని నిరూపించేందుకు మా వద్ద 100 ఆధారాలున్నాయి.

- ఓ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ

నా డ్యాన్స్ చూసి ఎంజాయ్ చేశా!

న్యూఢిల్లీ, మే 6: ప్రధాని మోదీ డ్యాన్స్ చేస్తున్నట్టున్న ఓ యానిమేటెడ్ వీడియో ఆకట్టుకుంటుండగా.. దానిపై మోదీ కూడా స్పందించారు. 'కాన్సెర్ట్ మీమ్ టెంప్లెట్ ఆధారంగా రూపొందించిన ఈ వీడియోను కృష్ణ అనే వ్యక్తి 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'డిక్టేటర్ తనను అరెస్టు చేయించరని తెలుసు కాబట్టే ఈ వీడియో పోస్టు చేస్తున్నానని వ్యాఖ్య జోడించాడు. దీనికి మోదీ స్పందిస్తూ 'నా డ్యాన్స్ చూసి నేను కూడా సంతోషించాను. ఎన్నికల వేళ ఇలాంటి సృజనాత్మకత ఉత్సాహాన్నిస్తుంద'ని పేర్కొన్నారు.



మోదీ డ్యాన్స్ స్క్రీన్ షాట్

'ప్రజ్వల్' ప్రభావమెంతో?

కర్ణాటకలో నేడు 14 స్థానాల్లో పోలింగ్.. వీటిలో లింగాయత్‌ల ప్రాబల్యం అధికం

- అన్నిచోట్లా కాంగ్రెస్-బీజేపీ ముఖాముఖి
- జేడీఎస్ పోటీలో లేకున్నా ఇబ్బందికరమే?
- పైచేయి సాధించేందుకు కాంగ్రెస్ యత్నం

(సెంట్రల్ డెస్క్)

దక్షిణాదిన టార్గెట్-50 అంటున్న బీజేపీకి కర్ణాటక అత్యంత కీలకం. మిగతా ఏ రాష్ట్రంలోనూ రెండంకెల స్కోరు దాటే పరిస్థితి లేని నేపథ్యంలో ఇక్కడ గెలిచే స్థానాలే ముఖ్యం. అయితే, ఇటీవల జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల అంశం దేశాన్ని కుదిపేయడంతో పాటు కాంగ్రెస్‌కు ప్రచారాస్త్రంగా మారింది. జేడీఎస్‌తో పొత్తులో ఉండటంతో ఈ వ్యవహారం బీజేపీకి తలనొప్పిగా మారింది. కాంగ్రెస్ వ్యూహాత్మకంగా.. జేడీఎస్‌కు పూర్తి అండగా నిలిచే ఒక్కళిగలు అధికంగా ఉండే దక్షిణ కర్ణాటకలో పోలింగ్ పూర్తయిన తర్వాత ప్రజ్వల్ వ్యవహారాన్ని బయటపెట్టింది. రాష్ట్రంలో మొత్తం 28 సీట్లకు గాను తొలి దశలో 14 స్థానాలకు ఏప్రిల్ 26న పోలింగ్ జరిగింది. మిగిలినవాటికి మంగళవారం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ స్థానాల్లో జేడీఎస్ పోటీలో లేకపోయినప్పటికీ, 'ప్రజ్వల్ ప్రభావం బీజేపీపై తప్పక ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జేడీఎస్ పోటీ చేస్తున్న 3 సీట్లకు గత నెలలోనే పోలింగ్ ముగిసింది. రెండో దశ పోలింగ్ జరిగే స్థానాల్లో ఎక్కువ శాతం ఉత్తర, సెంట్రల్ కర్ణాటకలో.. ప్రభావవంతమైన సామాజిక వర్గం లింగాయత్‌ల ప్రాబల్యంలోనివే. వీటిలోని కిట్టూర్ కర్ణాటక (ముంబై-కర్ణాటక)లో 30 ఏళ్లుగా బీజేపీకి గట్టి పట్టుంది. వెనుకబడిన కల్యాణ్ కర్ణాటక (హైదరాబాద్ కర్ణాటక)లో కాంగ్రెస్-బీజేపీ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. సెంట్రల్ కర్ణాటకలో కాంగ్రెస్‌దే పైచేయి అయినా, రెండు దశాబ్దాలుగా బీజేపీ పుంజుకొంటోంది.

బీజేపీ నష్ట నివారణ చర్యలు

ప్రజ్వల్ ఉదంతం వెలుగులోకి వచ్చిన వెంటనే తీవ్రంగా ఖండించడం ద్వారా బీజేపీ నష్ట నివారణకు దిగింది. కాగా, ప్రత్యర్థిని దెబ్బతీసేందుకు రేవణ్ణ సెక్స్ కుంభకోణాన్ని కాంగ్రెస్ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లింది. ఇది ఏమేరకు ఫలితాన్ని ఇస్తుందో చూడాలి. వాస్తవానికి ఎన్నికల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పడిపోతుందని బీజేపీ, జేడీఎస్ నేతలు ప్రచారం చేశారు. ఇప్పుడంతా మారిపోయింది. ప్రజ్వల్, ఆయన తండ్రి రేవణ్ణను కుమారస్వామి పూర్తిగా పక్కనపెట్టడం జేడీఎస్‌ను చీలికకు కారణం కానుందనే వాదనలు వినిపిస్తున్నాయి. కర్ణాటక పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ అయితే.. జేడీఎస్‌కు చెందిన 19 మంది ఎమ్మెల్యేల్లో 15 మంది తమ పార్టీలో చేరుతారని వ్యాఖ్యానించడం గమనార్హం.





ఏప్రిల్ 14న ఎన్నికల ప్రచారంలో ప్రజ్వల్, దేవెగౌడతో కలిసి మోదీ అభివాదం(ఫైల్)

సిటింగ్‌ల మార్పు.. మంత్రుల వారసులు

రెండో విడత పోలింగ్ జరగనున్న 14 స్థానాలనూ 2019లో బీజేపీనే గెలుచుకుంది. ఈ ఎన్నికల్లో సగంచోట్ల సిటింగ్ అభ్యర్థులను మార్చింది. కొప్పల్, ఉత్తర కన్నడ మరికొన్ని నియోజకవర్గాల ఎంపీలపై పార్టీ కేడర్‌లోనే వ్యతిరేకత ఉంది. ఇక కాంగ్రెస్ ఐదుచోట్ల రాష్ట్ర మంత్రుల కుమారులు లేదా కుమార్తెలను దింపడం గమనార్హం. మరో 3 స్థానాల్లో సీనియర్ నేతల వారసులకు, ఒకచోట రిటైర్డ్ ఐఏఎస్‌కు టికెట్టిచ్చింది. వీరిలో ఒక్కరు తప్ప అందరూ కొత్తవారే. ఇది బీజేపీ-కాంగ్రెస్ మధ్య వ్యత్యాసం చూపొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పోలింగ్ జరిగే నియోజకవర్గాలు: చిక్కోడి, బెళగావి, బాగల్కోట, ఉత్తర కన్నడ, బీదర్, రాయచూరు, బళ్లారి, కొప్పళ, విజయపుర, కలబురగి, దావణగెరె, శివమొగ్గ, హావేరి, ధారవాడ.

పోటీలోని ప్రముఖులు: మాజీ సీఎంలు బొమ్మై, శెట్టర్, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమని, మంత్రుల వారసులు సాగర్ ఖంద్రె, ప్రియాంక జార్కిహోళి, మృణాల్ హెబ్బాల్కర్, సంయుక్తా పాటిల్, మంత్రి మల్లికార్జున భార్య ప్రభ ఈ విడతలో పోటీలో ఉన్నారు. శివమొగ్గలో మాజీ సీఎంలు యడియూరప్ప కుమారుడు రాఘవేంద్ర, బంగారప్ప కోడలు గీతాశివరాజ్ తలపడుతున్నారు.

లింగాయత్‌ల అడ్డా

బీజేపీకి బలమైన ఓటు బ్యాంకు లింగాయత్‌ల ప్రాబల్యం ఉత్తర కర్ణాటకలోనే అధికం. 2014 నుంచి 60%పైగా లింగాయత్‌లు కమలం పార్టీ వైపే నిలుస్తున్నారు. 2019 ఎన్నికల్లో అయితే 87% మంది మద్దతు పలికారు. యడియూరప్పకు తిరిగి కీలక బాధ్యతలు అప్పగించడం, ఆయన కుమారుడికి రాష్ట్ర పార్టీ పగ్గాలివ్వడం, లింగాయత్‌లైన ఇద్దరు మాజీ సీఎంలు శెట్టర్, బొమ్మైలు ఈ ప్రాంతం నుంచి పోటీ చేస్తుండడంతో లింగాయత్‌ల ఓట్లు గంపగుత్తగా తమకే పడతాయని బీజేపీ భావిస్తోంది. కాగా, ఓబీసీలు కొన్నేళ్లుగా బీజేపీనే ఎక్కువ ఆదరిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ వారిని ఆకర్షించింది. దళితులు మాత్రం పూర్తి స్థాయిలో హస్తం వైపే ఉన్నారు. కల్యాణ్ కర్ణాటకలో ప్రభుత్వ పథకాలైన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ఉధృతంగా ప్రచారం చేస్తోంది. బీజేపీ మోదీ మేనియాను నమ్ముకుంది.



నేడు మూడో దశ పోలింగ్

దేశవ్యాప్తంగా 93 నియోజకవర్గాల్లో ఓటింగ్

న్యూఢిల్లీ, మే 6(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమరంలో భాగంగా మంగళవారం మూడో దశ పోలింగ్ జరగనుంది. దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 93 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓటింగ్ నిర్వహించనున్నారు. గుజరాత్(25), కర్ణాటక(14), మహారాష్ట్ర(11), ఉత్తరప్రదేశ్(10), మధ్యప్రదేశ్(8), ఛత్తీస్‌గఢ్(7), బిహార్(5), పశ్చిమ బెంగాల్(4), అసోం(4), గోవా(2), దాద్రానగర్ హవేలీ, డామన్ డయ్యూ, జమ్మూకశ్మీర్(1)లో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ దశతో గుజరాత్, కర్ణాటక, అసోంలోని అన్ని స్థానాల్లోనూ పోలింగ్ పూర్తి కానుంది. దేశంలోని మొత్తం 283 నియోజకవర్గాల్లో ఓటింగ్ ముగియనుంది. కాగా, మూడో దశలో 17.24 కోట్ల మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకోనున్నారు. మరోవైపు బీఎస్పీ అభ్యర్థి మృతితో వాయిదా పడ్డ మధ్యప్రదేశ్‌లోని బేతుల్ స్థానానికి కూడా ఈ దశలో ఓటింగ్ జరగనుంది. ప్రధాని మోదీ అహ్మదాబాద్‌లో తన ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కేంద్ర హోం మంత్రి, బీజేపీ కీలక నేత అమిత్ షా (గాంధీనగర్)తో పాటు గుజరాత్‌కు చెందిన కేంద్ర మంత్రులు పురుషోత్తం రూపాలా (రాజ్‌కోట్), మన్‌సుఖ్ మాండవీయ (పోరుబందర్) పోటీ చేస్తున్న నియోజకవర్గాలు మూడో దశలోనే ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లో జ్యోతిరాదిత్య సింధియా(గుణ), మాజీ సీఎంలు శివరాజ్‌సింగ్ (విదిశ), దిగ్విజయ్(రాజ్‌గఢ్) బరిలో ఉన్నారు. కర్ణాటకలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి (ధార్వాడ్) ఈ దశలోనే పోటీలో ఉన్నారు.

నకిలీ సమాచారాన్ని 3 గంటల్లోగా తొలగించండి

న్యూఢిల్లీ, మే 6: తమ సోషల్ మీడియా ప్లాట్‌ఫారాల్లో నకిలీ సమాచారం ఉందన్న విషయం తెలిసిన మూడు గంటల్లోగా దాన్ని తొలగించాలని ఎన్నికల సంఘం సోమవారం అన్ని పార్టీలను ఆదేశించింది. ఒకరి మాటలను మరొకరికి ఆపాదించడం, మహిళలను కించపరచడం వంటి సమాచారం ఉన్న వీడియోలను, డీప్‌ఫేక్ వీడియోలను పెట్టకూడదని తెలిపింది.

పని మనిషి ఇంట్లో రూ. 34 కోట్లు



రాంచి, మే 6: గుట్టలు గుట్టలుగా నోట్ల కట్టలు.. గంటలు గడిచిన కొద్దీ లెక్క పెరుగుతూ పోయింది.. పలువురు అధికారులు యంత్రాల సాయంతో నిర్విరామంగా శ్రమిస్తే కానీ ఓ కొలిక్కి రాలేదు. ఝార్ఖండ్‌లో ఓ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి (పీఎస్) ఇంట్లో పని చేసే వ్యక్తి వద్ద భారీ ఎత్తున నగదు పట్టుబడింది. ఇది దాదాపు రూ.34 కోట్లని.. ఇదంతా లెక్కల్లోకి రాని అక్రమ సొమ్మేనని అధికారులు పేర్కొన్నారు. సోదాల్లో భాగంగా మరో చోట రూ.3 కోట్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఝార్ఖండ్ గ్రామీణాభివృద్ధి శాఖలో చీఫ్ ఇంజినీర్‌గా పని చేసిన వీరేంద్రకుమార్ రామ్ గతేడాది రూ.10 వేల లంచం కేసులో అరెస్ట్ అయ్యారు. అయితే, ఆ తర్వాత మనీ లాండరింగ్ కేసులో ఈడీ ఆయన్ను అదుపులోకి తీసుకున్నాక సీన్ మారిపోయింది. ఆయన ఇచ్చిన సమాచారంతో సోమవారం రాష్ట్ర రాజధాని రాంచీలోని పలు ప్రాంతాల్లో ఈడీ సోదాలు జరిపింది. కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఆలంగిర్ ఆలం పీఎస్ సంజీవ్‌లాల్ ఇంట్లో పని మనిషిగా ఉన్న జహంగీర్ ఆలం అనే వ్యక్తి నివాసంలో కూడా సోదాలు జరిగాయి. అక్కడ రూ.500 నోట్ల కట్టలు గుట్టలుగా బయటపడటం కలకలం రేపింది. ఒడిశాలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ప్రధాని మోదీ ఈ వ్యవహారాన్ని తన ప్రసంగంలో ప్రస్తావించారు. 'ఝార్ఖండ్‌లో నోట్ల గుట్టలు బయటపడ్డాయి. పనిమనిషి ఇంటినే అవినీతి గోడౌన్‌గా మార్చారు. నగదు లెక్కింపు యంత్రాలే అలిసిపోయేంతగా నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఇదంతా కాంగ్రెస్ ప్రథమ కుటుంబం తాలుకూ నల్లధనమేనా..? దీనిపై యువరాజు సమాధానం చెప్పాలి' అని మోదీ ప్రశ్నించారు.

సునీతా.. ముచ్చటగా మూడోసారి

- అంతరిక్ష యాత్రకు సిద్ధమైన భారత సంతతి వ్యోమగామి
- నేటి ఉదయం 8.04 గంటలకు రోదసీ యాత్ర



వాషింగ్టన్, మే 6: భారత సంతతికి చెందిన అమెరికా వ్యోమగామి సునీతా విలియమ్స్(58) ముచ్చటగా మూడోసారి అంతరిక్ష యాత్రకు సిద్ధమయ్యారు. మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్‌తో కలిసి బోయింగ్‌కు చెందిన స్టార్‌లైనర్ వ్యోమనౌకలో ఆమె రోదసీలోకి వెళ్లనున్నారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం (మే 7) ఉదయం 8.04 గంటలకు ఫ్లోరిడాలోని కేప్ కెనవెరాల్ నుంచి బోయింగ్‌కు చెందిన స్టార్‌లైనర్ వ్యోమనౌక అంతర్జాతీయ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)కు బయల్దేరనుంది. సునీత విలియమ్స్ ఇప్పటికే రెండుసార్లు అంతరిక్షంలోకి వెళ్లొచ్చారు. తాజా యాత్రలో ఆమె మిషన్ పైలట్‌గా వ్యవహరించనున్నారు. తానొక ఆధ్యాత్మిక వాదినని, తనకు వినాయకుడు అంటే ఇష్టమని.. అందుకే ఈ సారికూడా తాను అంతరిక్షంలోకి వెళ్లేటప్పుడు తనతోపాటు వినాయకుడి విగ్రహాన్ని తీసుకెళ్తున్నానని సునీతా విలియమ్స్ చెప్పారు. కాగా, బోయింగ్ కంపెనీ ఇప్పటి వరకూ మానవ రహిత అంతరిక్ష యాత్రలు చేపట్టగా.. తొలిసారి మానవ సహిత యాత్రకు సిద్ధమైంది.

సెమీ క్రయోజెనిక్ ఇంజన్‌కు ప్రీ బర్నర్ పరీక్ష సక్సెస్

బెంగళూరు, మే 6: భవిష్యత్తులో తాము ప్రయోగించే రాకెట్లను మరింత శక్తిమంతంగా మార్చుకునే ప్రణాళికలో భాగంగా 2000 కిలోన్యూటన్ల (కేఎన్) సామర్థ్యం కలిగిన సెమీ క్రయోజెనిక్ ఇంజిన్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు ఇస్రో సోమవారం తెలిపింది. ఇందులో భాగంగా సెమీ క్రయో ప్రీ బర్నర్‌ను విజయవంతంగా పరీక్షించామని పేర్కొంది. టర్బోపంప్స్ మినహా ఇంజిన్ పవర్ హెడ్ వ్యవస్థకు అనుబంధంగా ఉండే ప్రీ-బర్నర్ ఇగ్నీషన్ ట్రయల్‌ను మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో నిర్వహించారు.

కేజ్రీవాల్‌పై ఎన్ఐఏ దర్యాప్తు

సిఫార్సు చేసిన లెఫ్టినెంట్ గవర్నర్.. కేంద్ర హోం శాఖకు లేఖ



- ఉగ్రవాది విడుదలకు ఖలిస్థాన్ సంస్థ నుంచి నిధులు తీసుకున్నట్టు ఆరోపణలు

న్యూఢిల్లీ, మే 6: మద్యం విధానం కుంభకోణం కేసులో ఇప్పటికే సీబీఐ, ఈడీ విచారణలను ఎదుర్కొంటున్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఇకపై మరో అంశంలో ఎన్ఐఏ దర్యాప్తును ఎదుర్కొనే సూచనలు కనిపిస్తున్నాయి. ఖలిస్థాన్‌కు అనుకూలంగా ఉండే నిషేధిత తీవ్రవాద సంస్థ సిక్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) నుంచి రాజకీయ విరాళాలు తీసుకున్నారంటూ అందిన ఫిర్యాదుపై ఎన్ఐఏతో దర్యాప్తు చేయించాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా సిఫార్సు చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం కేంద్ర హోం శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. జైలు శిక్ష అనుభవిస్తున్న ఖలిస్తాన్ తీవ్రవాది దేవేంద్ర పాల్ భుల్లర్‌ను విడుదల చేయించడంతో పాటు, ఖలిస్థాన్ సెంటిమెంట్లను రెచ్చగొట్టేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ ఆ తీవ్రవాద సంస్థ నుంచి 16 మిలియన్ డాలర్లు (సుమారు రూ.135 కోట్లు) తీసుకున్నట్టు వరల్డ్ హిందూ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆషూ మోగియా గతంలో ఫిర్యాదు చేశారు. దాన్ని ఆధారం చేసుకొని సక్సేనా ఈ లేఖ రాశారు. 2014 నుంచి 2022 వరకు ఆమ్ ఆద్మీ పార్టీకి ఖలిస్థాన్ గ్రూపుల నుంచి 16 మిలియన్ డాలర్లు విరాళాలుగా అందాయని పేర్కొంటూ ఖలిస్థాన్ ఉగ్రవాది, సిక్స్ ఫర్ జస్టిస్ వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నున్ విడుదల చేసిన వీడియోను కూడా ఈ లేఖలో ప్రస్తావించారు. ప్రొఫెసర్ భుల్లర్‌ను జైలు నుంచి విడుదల చేయాలని ఆప్ ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రపతికి సిఫార్సు చేసిందని ఆ లేఖలో రాశారు. 1993లో ఢిల్లీలోని యువజన కాంగ్రెస్ కార్యాలయం వద్ద బాంబు దాడి జరిగిన ఘటనలో భుల్లర్ జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. ఆ సంఘటనలో తొమ్మిది మంది మరణించగా, 31 మంది గాయపడ్డారు. జర్మనీలో ఉన్న అతడ్ని 1995లో తీసుకువచ్చి అరెస్టు చేశారు. అప్పటి నుంచి అతడు తిహాడ్ జైలులో ఉన్నాడు. ట్రయల్ కోర్టు అతనికి 2001లో మరణశిక్ష విధించగా, 2014లో ఉన్నత న్యాయస్థానం దాన్ని యావజ్జీవ కారాగార శిక్షగా తగ్గించింది. అతని విడుదల కోసం కేజ్రీవాల్ న్యూయార్క్‌లోని గురుద్వారా రిచ్‌మాండ్ హిల్స్‌లో వేర్పాటువాదులను కలిసినట్టు, వారి నుంచి నిధులు తీసుకున్నట్టు ఫిర్యాదు అందినందున ఎన్ఐఏ దర్యాప్తునకు లెఫ్టినెంట్ గవర్నర్ సిఫార్సు చేశారు. న్యూయార్క్ గురుద్వారాలో ఖలిస్థాన్ అనుకూల వ్యక్తులతో కేజ్రీవాల్ భేటీ అయిన ఫొటోను ఆప్ మాజీ కార్యకర్త మునీష్ కుమార్ రైజాదా అప్పట్లో ట్విటర్‌లో పెట్టారు. దాన్ని కూడా లేఖలో పేర్కొన్నారు. వీటన్నింటిపై ఫోరెన్సిక్ పరీక్షలతో పాటు, సమగ్ర దర్యాప్తు జరగాల్సి ఉందని తెలిపారు.

మరో కుట్ర

దీనిపై ఆప్ స్పందిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ బీజేపీ ఏజెంటని, ఢిల్లీలోని మొత్తం ఏడు స్థానాల్లో ఆ పార్టీ ఓడిపోతుందని తెలిసి కేజ్రీవాల్‌పై మరో పెద్ద కుట్రకు తెరతీశారని వ్యాఖ్యానించింది. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఇలాంటి ప్రయత్నం జరిగిందని ఆ పార్టీ నాయకుడు, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ చెప్పారు.

'కొవిషీల్డ్'పై విచారణకు సుప్రీంకోర్టు అంగీకారం

న్యూఢిల్లీ, మే 6 (ఆంధ్రజ్యోతి): కరోనా వ్యాక్సిన్ కోవిషీల్డ్‌ను వినియోగించడం ద్వారా కలిగిన సైడ్ ఎఫెక్ట్స్ విషయమై దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీం కోర్టు అంగీకరించింది. అయితే దీనిని సత్వరమే చేపట్టాలన్న వినతిని మాత్రం తిరస్కరించింది. బ్రిటిష్ ఫార్మా దిగ్గజం ఆస్ట్రాజెనెకా, ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన కోవిడ్-19 వ్యాక్సిన్‌ను సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఇండియాలో కోవిషీల్డ్ పేరుతో తయారు చేసి విక్రయించింది. తమ వ్యాక్సిన్ తీసుకున్న వారిలో అరుదైన సందర్భాల్లో రక్తం గడ్డకట్టడం, ప్లేట్‌లెట్ల సంఖ్య పడిపోవడం జరుగుతుందని ఆస్ట్రాజెనెకా ఇటీవల అంగీకరించింది. ఈ నేపథ్యంలో భారత్‌లోనూ ఈ వ్యాక్సిన్ తీసుకున్న వారు కొంతమంది అకస్మాత్తుగా కుప్పకూలిపోవడం, గుండెపోటుతో మరణించిన సంఘటనలపై దర్యాప్తు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలయింది. కోవిషీల్డ్ ప్రభావంపై వైద్య నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ న్యాయవాది విశాల్ తివారీ ఈ నెల ఒకటో తేదీన పిటిషన్ దాఖలు చేశారు. మృతుల కుటుంబాలకు పరిహారం ఇప్పించాలన్నారు.

ఆస్ట్రేలియా వీసాలకు టోఫెల్ స్కోర్లు

న్యూఢిల్లీ, మే 6: అన్ని రకాల ఆస్ట్రేలియా వీసాలకు ఇక నుంచి ఆంగ్ల భాషా పరీక్ష 'టోఫెల్' స్కోరును పరిగణనలోకి తీసుకుంటామని ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసు (ఈటీఎస్) సోమవారం ప్రకటించింది. ఈనెల 5న లేదా ఆ తర్వాత నుంచి నిర్వహించిన టోఫెల్ పరీక్షల స్కోర్లు మాత్రమే వీసాల జారీ విషయంలో చెల్లుబాటు అవుతాయని వివరించింది. టోఫెల్ అనేది ఇంగ్లిష్ మాట్లాడే దేశాల్లోని విశ్వ విద్యాలయాల్లో చేరాలనుకునే స్థానికేతరులకు వారి ఆంగ్ల భాషా సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు నిర్వహించే ప్రామాణిక పరీక్ష. దీన్ని 160 కంటే ఎక్కువ దేశాల్లోని వర్సిటీలు ఆమోదించాయి.

చైనా సీ డ్రాగన్.. ఫ్యూజియాన్



విమానవాహక యుద్ధ నౌక సీ ట్రయల్స్ ప్రారంభం

- అమెరికాకు ధీటుగా ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్ సిస్టమ్‌తో అందుబాటులోకి తెచ్చిన చైనా

బీజింగ్, మే 6: సంఖ్యాపరంగా ప్రపంచంలోనే అతిపెద్ద నౌకా దళ శక్తిగా ఉన్న చైనా.. తన బలాన్ని ఇతోధికంగా పెంచుకునే క్రమంలో మూడో విమాన వాహక యుద్ధనౌక ఫ్యూజియాన్‌ను రంగంలోకి దించింది! ప్రపంచంలోనే అతిపెద్దదైన అమెరికా విమానవాహక యుద్ధ నౌక 'యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్'లో మాత్రమే ఉన్న 'ఈమాల్స్' (ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్ సిస్టమ్)'తో చైనా దీన్ని రూపొందించడం విశేషం. మే1న ఈ ఫ్యూజియాన్ సీ ట్రయల్స్‌ను ప్రారంభించింది. ఆ యుద్ధనౌకలోని ప్రొపల్షన్, విద్యుత్ వ్యవస్థల పనితీరు, స్థిరత్వాన్ని చైనా రెండేళ్లు పరీక్షించి, ఐదేళ్లలో తన నౌకాదళానికి అందుబాటులోకితేనుంది. దీని బరువు దాదాపు 80వేల టన్నులు. పొడుగు 1036అడుగులు. ఫ్యూజియాన్‌కన్నా ముందు చైనా వద్ద 2 విమాన వాహక యుద్ధనౌకలున్నాయి. మొదటిది.. లియావోనింగ్. 1998లో చైనా దీన్ని ఉక్రెయిన్ నుంచి కొని మార్పుచేర్పులు చేసుకుంది. 2019లో షాంగ్‌డాంగ్ అనే దేశీయ విమాన వాహక యుద్ధనౌకను తన నేవీకి అందుబాటులోకి తెచ్చింది. వీటికన్నా సాంకేతికంగా అత్యంత అధునాతనమైనది ఫ్యూజియాన్ యుద్ధనౌక.

ఇక విమానం టేకాఫ్ కావాలంటే పెద్ద రన్‌వే అవసరం. యుద్ధ నౌకపై అంతపెద్ద రన్‌వే ఉండదు కాబట్టి వాటిపై నుంచి యుద్ధవిమానాల టేకాఫ్‌కు స్టోబార్, క్యాటోబార్ విధానాలను అనుసరిస్తారు. స్టోబార్ అంటే షార్ట్ టేకాఫ్ బ్యారియర్ అరెస్టెడ్ రికవరీ విధానం. ఇందులో యుద్ధనౌక చివర్లో రన్‌వే కొంత పైకి లేచినట్టు ఉంటుంది. క్యాటోబార్ (కెటాపల్ట్ అసిస్టెడ్ టేకాఫ్ బ్యారియర్ అసిస్టెడ్ రికవరీ) విధానం.. వంగలకర్ర పెట్టి ఒక రాయిని లాగిపెట్టి కొడితే ఆ రాయి ఎలా దూసుకెళుతుందో అలాంటిది. ఈ విధానంలో విమానాల టేకాఫ్‌కు ఆవిరి శక్తి వాడతారు. దానికి బదులు విద్యుదయస్కాంత శక్తి వాడితే అదే ఈమాల్స్ దీంతో టేకాఫ్ అయ్యే విమానాలరేంజ్‌ఎక్కువ.

మనకు పక్కలో బల్లమే..

గత 3 దశాబ్దాలుగా హిందూ మహాసముద్రంపై కన్నేసి విస్తృత కార్యకలాపాలతో తన ప్రాబల్యాన్ని పెంచుకుంటున్న చైనా.. భారత దేశ క్షిపణి పరీక్షలను అతి దగ్గర్నుంచీ పరిశీలిస్తూ పక్కలోబల్లెంలా తయారైంది. విమానవాహక యుద్ధనౌకల విషయంలో చైనా, భారత్ సమానంగా ఉన్నాయి. చైనా వద్ద 2 ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లు ఉంటే.. మనదగ్గరా 2 (ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్) విమాన వాహక యుద్ధనౌకలున్నాయి. ఇప్పుడు 'ఈమాల్స్'తో చైనా మూడో ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌ను రంగంలోకి దించడం భారత్‌కు ఆందోళన కలిగించేదే. 2035నాటికి ఇదే తరహాలో విద్యుదయస్కాంత శక్తితో యుద్ధవిమానాలను లాంచ్ చేయగల మరో 3 విమానవాహక యుద్ధ నౌకలను తననౌకాదళానికి అందుబాటులోకి తేవాలన్నది చైనా లక్ష్యం. అదే జరిగితే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అమేయ శక్తిగా మారి చైనా మనకు పెనుముప్పుగా మారుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

రఫాపై ఇజ్రాయెల్ దాడి

కాల్పుల విరమణకు సిద్ధమన్న హమాస్



సెంట్రల్‌గాజా/టెల్ అవీవ్, మే 6: ముందుగా హెచ్చరించినట్లుగానే గాజా-ఈజిప్ట్ సరిహద్దు నగరం రఫాపై ఇజ్రాయెల్ సోమవారం దాడులు ప్రారంభించింది. గాజాపై ఇజ్రాయెల్ భూతల దాడులు ప్రారంభమయ్యాక.. పాలస్తీనా శరణార్థులకు ఆశ్రయమిస్తున్న రఫాలో నక్కిన హమాస్ నేతల ఏరివేత పేరుతో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) ముందుకు సాగుతోంది. ఆదివారం హమాస్ జరిపిన కాల్పుల్లో నలుగురు ఐడీఎఫ్ సైనికులు మృతిచెందడంతో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలో భేటీ అయిన అత్యవసర యుద్ధ క్యాబినెట్..రఫాపై దాడికి ఏకగ్రీవంగా ఆమోదించింది. హమాస్ తాజా దాడితో చర్చలకు విఘాతమేర్పడిందని క్యాబినెట్ అభిప్రాయపడింది. దీంతో సోమవారం ఉదయం నుంచే రఫాలోని శరణార్థులను సముద్రతీర ప్రాంతమైన మువాసి నగరానికి తరలించడం ప్రారంభించింది. సాయంత్రం సమయంలో ఐడీఎఫ్ వర్గాలు తూర్పు రఫాపై డ్రోన్ దాడులను ప్రారంభించాయి. రఫాపై దాడి యత్నాన్ని మానుకోవాలంటూ అమెరికా, ఫ్రాన్స్, ఐరోపా సమాఖ్య, ఇతర దేశాలు కోరినా ఇజ్రాయెల్ పట్టించుకోకపోవడం గమనార్హం..! కాగా.. కాల్పుల విరమణకు తాము సిద్ధంగా ఉన్నామని హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హనియే సోమవారం సాయంత్రం ప్రకటించారు. ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తిత్వం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

అణ్వాయుధాలను పరీక్షించి సిద్ధం చేయండి

అధికారులకు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదేశాలు

న్యూఢిల్లీ, మే 6: ఉక్రెయిన్‌పై సైనిక చర్యలో నాటో దేశాలు తమను రెచ్చగొడితే అణ్వాయుధాలను వాడటానికి కూడా వెనుకాడబోమన్న రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆ దిశగా ఓ అడుగు ముందుకేశారు. అణ్వాయుధాలను పరీక్షించి, సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈమేరకు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ఓ ప్రకటనలో వెల్లడించింది. రష్యాలో అణ్వాయుధ పరీక్షలు సాధారణమే అయినప్పటికీ, రష్యా ఇలా బహిరంగంగా ప్రకటన చేయడం ఇదేమొదటిసారి. అవసరమైతే ఉక్రెయిన్‌కు తమ బలగాలను పంపిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, ఉక్రెయిన్ తమ ఆయుధాలను వినియోగించుకోవచ్చని యూకే విదేశాంగ మంత్రి డేవిడ్ కామెరూన్ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో పుతిన్.. పశ్చిమ దేశాలను హెచ్చరించడానికే ఈ ఆదేశాలు జారీ చేసినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

లోకం తీరు



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కవితకు మళ్లీ నిరాశే

(మొదటి పేజీ తరువాయి)

కీలక దశలో ఉందని, ఈ నేపథ్యంలోనే కవిత బెయిల్ పిటిషన్లను తిరస్కరిస్తున్నట్లు తెలిపింది. ఢిల్లీ మద్యం కేసులో అరెస్టై తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత.. సీబీఐ, ఈడీ నమోదు చేసిన రెండు కేసుల్లోనూ తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లపై రౌస్ అవెన్యూ జిల్లా కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. 'కవిత విదేశాలకు పారిపోయే అవకాశం లేదు. అయితే, ఈ కేసులో సాక్షులను ఆమె గతంలో బెదిరించారు. బెయిల్ ఇస్తే, ఆమెకున్న స్థాయి దృష్ట్యా కేసులోని ఇతర సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అందుకనే బెయిల్ ఇవ్వటం లేదు' అని న్యాయమూర్తి కావేరీ బవేజా పేర్కొన్నారు. ఆరోగ్య కారణాల రీత్యా బెయిల్ ఇవ్వాలన్న కవిత విజ్ఞప్తిపై స్పందిస్తూ.. జైలు ఆస్పత్రిలో తగిన చికిత్స ఆమెకు అందుబాటులో ఉందని తెలిపారు. ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరం కేసుల విచారణ సందర్భంగా.. బెయిల్ ఇవ్వటానికి ప్రాతిపదికగా తీసుకోవాల్సిన అంశాలను సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని న్యాయమూర్తి గుర్తు చేశారు. సుప్రీంకోర్టు ముందు అదనపు సొలిసిటర్ జనరల్ హామీ ఇచ్చినా కవితను అరెస్టు చేశారనే అంశంపై మార్చి 16న ఇచ్చిన ఉత్తర్వుల ద్వారా సమస్య పరిష్కారమైందన్నారు. విచారణ సమయంలో ఇండో స్పిరిట్స్‌లో వాటా లేదని పిటిషనర్ (కవిత) వాదించారని, అయితే, సీఏ బుచ్చిబాబు, రాఘవ మాగుంట వాట్సాప్ చాట్‌లు 33 శాతం వాటాను స్పష్టంగా చూపుతున్నాయని గుర్తు చేశారు. ఈ వాట్సాప్ చాట్‌లను కూడా పిటిషనర్ ఖండించారని తెలిపారు. రూ.25 కోట్ల నగదును రెండు విడతల్లో మాగుంట రాఘవ అనుచరుడు (ఆప్‌కు) అందించినట్లు దర్యాప్తు సంస్థల స్టేట్‌మెంట్‌లో ఉందని పేర్కొన్నారు. కేజ్రీవాల్, మనీశ్ సిసోడియాలతో విజయ్ నాయర్ ద్వారా కవిత చర్చలు జరిపి లిక్కర్ పాలసీని తమకు అనుకూలంగా మార్చితే రూ.100 కోట్లు ఇస్తానని ప్రతిపాదించినట్లుగా అరుణ్‌పిళ్లై చెప్పారని గుర్తు చేసింది. ఈ కారణాలన్నింటినీ దృష్టిలో ఉంచుకొని మధ్యంతర బెయిల్‌గానీ, రెగ్యులర్ బెయిల్‌గానీ ఇవ్వలేమని నిర్ణయించినట్లు ఆదేశాల్లో న్యాయమూర్తి పేర్కొన్నారు.



రెండోసారి తిరస్కరణ

కవిత బెయిల్ విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించటం ఇది రెండోసారి. మార్చి 15న ఈడీ అరెస్టు చేసిన వెంటనే కవిత మధ్యంతర బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. తన కుమారుడికి 11వ తరగతి పరీక్షలు ఉన్నాయని, తల్లిగా అతడిని దగ్గరుండి చూసుకోవాల్సి ఉందని పేర్కొంటూ మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. దీనికి ఈడీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో న్యాయస్థానం కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. అనంతరం, సాధారణ బెయిల్ కోసం కవిత ప్రయత్నించారు. ఈడీ కేసులో బెయిల్ కోసం ఏప్రిల్ 4న, సీబీఐ కేసులో బెయిల్ కోసం ఏప్రిల్ 15న పిటిషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ పార్టీకి తను స్టార్ క్యాంపెయినర్‌నని, తనకు అనారోగ్య సమస్యలు కూడా ఉన్నాయని, కాబట్టి, సాధారణ బెయిల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్లపైనా ఈడీతోపాటు సీబీఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న రౌస్ అవెన్యూ కోర్టు గతంలో తీర్పును రిజర్వు చేసి సోమవారం వెలువరించింది. కాగా, కవిత జ్యుడీషియల్ కస్టడీ మంగళవారంతో ముగియనుంది.

సీటీవోల అధికారాలకు కత్తెర

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదు చేయగా...సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ రీఫండ్ పొందడానికి తాను అధికారులకు లంచాలు ఇచ్చినట్లు రాజా రమేశ్‌రెడ్డి వెల్లడించడంతో ఒక డిప్యూటీ కమిషనర్, ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్లు, ఒక సీటీవోను పోలీసులు అరెస్టు చేశారు. ఇది రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో పెను సంచలనం సృష్టించింది. పన్ను వసూళ్లలో లీకేజీలు లేకుండా చూడాల్సిన అధికారులే అక్రమాలకు తెరలేపడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టీకే శ్రీదేవి దిద్దుబాటు చర్యలు చేపడుతూ అంతర్గత సర్క్యులర్‌ను జారీ చేశారు. జీఎస్టీ రీఫండ్‌కు సంబంధించి రూ.లక్షలోపు ఉన్న క్లెయిమ్‌లను మాత్రమే సీటీవోలు పరిశీలించాలని ఆదేశించారు. రూ.లక్ష నుంచి రూ.కోటి వరకు క్లెయిమ్‌లను పరిష్కరించే బాధ్యత జాయింట్ కమిషనర్లకు అప్పగించారు. ఇక, రూ.కోటిపైన ఉండే రీఫండ్ దరఖాస్తులన్నింటినీ కమిషనర్ వద్దకు పంపాలని సూచించారు. ఈ చర్యలతో రీఫండ్‌లో అక్రమాలకు కొంతైనా తగ్గే అవకాశాలుంటాయని భావిస్తున్నారు.

నేడు మేడిగడ్డకు జస్టిస్ పినాకి చంద్రఘోష్

హైదరాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల వైఫల్యాలపై విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ పినాకి చంద్రఘోష్ మంగళవారం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నారు. సోమవారం హైదరాబాద్‌కు చేరుకున్న ఆయన నీటిపారుదలశాఖ అధికారులతో సమావేశమయ్యారు. కమిషన్‌కు కార్యదర్శిగా హైకోర్టు మాజీ రిజిస్ట్రార్‌తో పాటు ఇద్దరు టెక్నికల్ కమిటీ సభ్యులని నియమించాలని ఈ సందర్భంగా నిర్ణయం తీసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధం లేనివారికి సాంకేతిక సభ్యులుగా పోస్టింగ్ ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు. మేడిగడ్డ బ్యారేజీ పరిశీలన ఏర్పాట్లపై కూడా చర్చించారు. మంగళవారం ఉదయం 8:30 గంటలకు హైదరాబాద్ నుంచి రోడ్డుమార్గంలో మేడిగడ్డకు చేరుకొని, బ్యారేజీని పరిశీలించనున్నారు

మేడిగడ్డ వైఫల్యానికి నిర్మాణ సంస్థే కారణం!

(మొదటి పేజీ తరువాయి)

గేట్లన్నీ తెరిచే ఉంచాలని, వరద పూర్తిస్థాయిలో తగ్గుముఖం పట్టిన తర్వాత మేడిగడ్డలో షీట్‌పైల్ కాఫర్ డ్యామ్ నిర్మాణం చేపట్టాలని పేర్కొంది. కాఫర్ డ్యామ్ నిర్మించిన తర్వాత మేడిగడ్డలోని బ్లాక్-7ను పూర్తిగా తొలగించి, ఆ స్థానంలో కొత్త బ్లాకు కట్టాలని... ఏడో బ్లాకులో దెబ్బతిన్న గేట్ల సీల్‌లను తొలగించి గేట్లను మాన్యువల్ విధానంలో ఎత్తాలని సూచించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం పూర్తైన ఏడాది నుంచే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులు చేపట్టలేదని, 2019లో నవంబరులోనే వరదల తర్వాత గేట్లు మూయగానే ఈ బ్యారేజీల్లో లోపాలు బయటపడ్డాయని కమిటీ పేర్కొంది. డౌన్‌స్ట్రీమ్, అప్‌స్ట్రీమ్ అప్రాన్లు దెబ్బతిన్నాయని తెలిపింది. సీసీ బ్లాకులు కూడా కొట్టుకుపోయాయని, బ్యారేజీల నిర్మాణం పూర్తైనా కాఫర్ డ్యామ్, షీట్ పైల్స్ శిథిలాలు యథాతథంగా ఉన్నాయని... ఇవి కూడా వరద ప్రవాహానికి అడ్డుపడి బ్యారేజీలు దెబ్బతినడానికి కారణమయ్యాయని పేర్కొంది. మరమ్మతుల అనంతరం మేడిగడ్డ బ్యారేజీలో పూర్తిస్థాయి నీటి నిల్వలు చేయవద్దని, పంప్‌హౌస్‌లకు నీరందేలా హెడ్‌లకు నీరు (పంపింగ్ చేయడానికి నీరు దొరికేదాకా) అందే వరకే నీటి నిల్వ చేయాలని కమిటీ సూచించింది. ఇతర బ్యారేజీల్లో కూడా పూర్తిస్థాయి నీటినిల్వ ఏ మాత్రం క్షేమదాయకం కాదని పేర్కొంది. మేడిగడ్డ పూర్తిస్థాయి సామర్థ్యం 16.17 టీఎంసీలు కాగా... అన్నారం బ్యారేజీ సామర్థ్యం 10.87 టీఎంసీలు, సుందిళ్ల సామర్థ్యం 8.83 టీఎంసీలుగా ఉంది..

ఆసిఫాబాద్ జిల్లాలో మారిన నీట్ ప్రశ్నపత్రం

- ఒక సెట్‌కు బదులు మరో సెట్ ఇచ్చిన నిర్వాహకులు

ఆసిఫాబాద్, మే 6: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నీట్ ప్రశ్నపత్రం మారడం విద్యార్థులను ఆందోళనకు గురిచేసింది. ఆసిఫాబాద్ హైస్కూల్ (ఆసిఫాబాద్ మోడల్ స్కూల్)లో ఆదివారం జరిగిన నీట్ పరీక్షకు 299 మంది విద్యార్థులు హాజరయ్యారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) మార్గదర్శకాలమేరకు నిర్వాహకులు ఎస్బీఐ నుంచి తీసుకురావాల్సిన ప్రశ్నపత్రానికి బదులుగా కెనరా బ్యాంకు నుంచి తెచ్చిన ప్రశ్నపత్రాల సెట్‌ను విద్యార్థులకు ఇచ్చారు. అయితే సోమవారం ఓ కోచింగ్ సెంటర్ విడుదల చేసిన 'కీ' పేపర్‌ను పరిశీలించిన కొందరు విద్యార్థులు తమకు ఇచ్చిన ప్రశ్నపత్రానికి 'కీ'లోని ప్రశ్నలు, సమాధానాలకు పొంతన లేకపోవడంతో కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని ఆర్డీవోను ఆయన ఆదేశించారు. నిర్వాహకుల తప్పిదం వల్లే ఒక సెట్‌కు బదులు మరొక సెట్‌ను ఇచ్చారని నిర్ధారించి కలెక్టర్‌కు ఆర్డీవో నివేదికిచ్చారు. ఎన్‌టీఏ అధికారులతో తము మాట్లాడామని, విద్యార్థులు రాసిన ప్రశ్నపత్రాన్ని పరిగణనలోకి తీసుకొని మూల్యాంకనం చేస్తారని వారు చెప్పారని కలెక్టర్ తెలిపారు.

ఎండలకు కాస్త బ్రేక్.. మూడ్రోజుల పాటు వానలు!

- ఇవ్వాళ కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు
- రేపు, ఎల్లుండి ఓ మోస్తరు వానలు..
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చాలా చోట్ల 46 డిగ్రీలపైనే నమోదు
- వడదెబ్బతో ముగ్గురి మృతి..



రంగారెడ్డి జిల్లా చిత్తాపూర్‌లోని కాముని చెరువులో మృత్యువాత పడ్డ చేపలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): భానుడి భగభగల నుంచి కాస్త ఉపశమనం లభించనుంది. వారం రోజులుగా ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడుతున్న జనాలకు ఊరట దొరకనుంది. వచ్చే మూడ్రోజుల పాటు ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో అన్ని జిల్లాల్లో సగటున 3 నుంచి 4 డిగ్రీల ఉష్ణోగ్రతలు తగ్గుతాయని.. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు మించకపోవచ్చని వివరించింది. మంగళవారం నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. అలాగే ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, హనుమకొండ, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. ఇక బుధ, గురువారాల్లోనూ పలు జిల్లాల్లో మోస్తరు వానలు కురుస్తాయని పేర్కొంది.

ఉమ్మడి కరీంనగర్‌లో 46 డిగ్రీల పైనే..

ఇటు సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా కనిపించింది. ఆ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా అల్లీపూర్, గుల్లకోటలో 46.8, పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.4, అదే జిల్లా సుగ్లాంపల్లి, జగిత్యాల జిల్లా కోల్వాయిలో 46.3, కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో 46.2, జగిత్యాల జిల్లా గోధూరులో 46.1, మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో 46, ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఇక చాలా జిల్లాల్లో 45 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వడదెబ్బతో ముగ్గురు మృతి చెందారు. ఖమ్మం రూరల్ మండలం కాంచికల్ గ్రామానికి చెందిన వృద్ధుడు గుండ్రా లక్ష్మయ్య (75), ఎర్రుపాలెం మండలంలోని పెద్దగోపవరంలో రాసమంటి వెంకటకృష్ణ (45), సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల కేంద్రానికి చెంది దారా జీవమ్మ (50) ఎండలకు అస్వస్థత చెంది మరణించారు.

ఎండ వేడికి చేపల మృత్యువాత..!

వేసవి తాపానికి చేపలు కూడా మృత్యువాత పడుతున్నాయి. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం చిత్తాపూర్‌లోని కాముని చెరువులో ఉన్న కొద్ది నీరు కాస్త ఎండకు బాగా వేడిగా మారడంతో ఆ చెరువులోని రూ.లక్షన్నర విలువ చేసే చేపలు చనిపోయి నీటిపై తేలాయి. ఇటు శంషాబాద్ మునిసిపల్ కేంద్రంలోని కాముంచెర్వులో ఆరు రోజులుగా దాదాపు రూ.7 లక్షల విలువైన చేపలు మృత్యువాత పడ్డాయి. చెరువుకి సమీపంలో ఉన్న హోటళ్లకు చెందిన డ్రైనేజీల నీరు చేరడంతో నీరు కలుషితమై చేపలు మృత్యువాత పడుతున్నాయా లేక ఎండ వేడిమికి మృతి చెందుతున్నాయో అర్థం కావడం లేదని గంగపుత్ర సంఘం సభ్యులు సాయిరాం, జగన్నాథం వాపోయారు.

సైబర్ నేరస్థులకు సహకారం

- బ్యాంకు ఖాతాల సమకూర్పు
- మూడు ముఠాల ఆటకట్టు
- ఎన్నారై సహా.. 10 మంది అరెస్టు



హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో భారతీయులకు కుచ్చుటోపీ పెడుతున్న దుబాయ్ ముఠాకు బ్యాంకు ఖాతాలను సమకూరుస్తున్న మూడు ముఠాలకు చెందిన ఓ ఎన్నారై, మరో 9 మంది నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి వివరాలను వెల్లడించారు. దుబాయ్‌లో ఉంటున్న బెర్లిన్ ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతుండగా.. అక్కడే ఉంటున్న ఎన్నారై వ్యాపారి, రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన భూరారామ్ అలియాస్ రాజూభాయ్ సహకరిస్తున్నాడు. సైబర్ నేరాలు చేసేప్పుడు బెర్లిన్‌కు బాధితులు నగదును బదిలీ చేసేందుకు భారతీయ బ్యాంకుల ఖాతాలను భూరారామ్ సమకూర్చేవాడు. ఇందుకోసం భూరారామ్ జోధ్‌పూర్‌లోని తన స్నేహితుడు రామచంద్ర అలియాస్ గణేశ్‌రామ్ సహకారం తీసుకుంటున్నాడు. ఇలా వీరు 47 బ్యాంకు ఖాతాలను నిర్వహిస్తున్నారు. ఈ ముఠాపై దేశవ్యాప్తంగా 507 కేసులున్నట్లు సీపీ తెలిపారు. తెలంగాణలో వీరిపై 67 కేసులు నమోదయ్యాయి. నగరానికి చెందిన ఓ బాధితుడి నుంచి ఈ ముఠా రూ.1.03 కోట్లను కొల్లగొట్టింది. బాధితుడి ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించిన సైబర్‌క్రైమ్ పోలీసులు.. భూరారామ్ నేపాల్ సరిహద్దు నుంచి రోడ్డు మార్గం లో భారత్‌లోకి వచ్చేందుకు యత్నించగా.. అరెస్టు చేశారు. భూరారామ్ ఇచ్చిన సమాచారం మేరకు రామచంద్రను అరెస్టు చేశారు. నిందితుల బ్యాంకు ఖాతాల్లోని రూ.1.44 కోట్లను ఫ్రీజ్ చేయించామని, కోర్టు ఆదేశాలతో ఓ బాధితుడికి రూ.55 లక్షలను చెల్లించామని తెలిపారు.

మరో రెండు కేసుల్లో..

దుబాయ్ కేంద్రంగా పనిచేస్తున్న సైబర్ నేరగాళ్ల ముఠాలకు బ్యాంకు ఖాతాలు(మొత్తం 24) సమకూరుస్తున్న నలుగురు నిందితులను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠాపై దేశవ్యాప్తంగా 171 కేసులు ఉన్నాయని, వాటిల్లో 11 తెలంగాణలో నమోదయ్యాయని చెప్పారు. మరో కేసులో.. 'యుూ కాయిన్ 8' పేరుతో ట్రేడింగ్ మోసాలకు పాల్పడుతున్న దుబాయ్ ముఠాకు సహకరించిన నలుగురికి సైబర్‌క్రైమ్ పోలీసులు బేడీలు వేశారు. ఈ ముఠాపై దేశవ్యాప్తంగా 92 కేసులున్నాయని, వాటిల్లో 10 తెలంగాణలో నమోదైనవేనని సీపీ వివరించారు.

కూతురి ఆత్మహత్యాయత్నం.. భరించలేక తండ్రి బలవన్మరణం

- నడికుడ మండలంలో ఘటన



కుమారస్వామి(ఫైల్)

నడికూడ, మే 6: కూతురు ఇంటర్మీడియట్‌లో ఫెయిలవ్వడంతో తండ్రి మందలించాడు.. అది తట్టుకోలేని కూతురు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా.. భరించలేని తండ్రి పురుగుల మందు తాగి మృతి చెందాడు. హనుమకొండ జిల్లా నడికూడ మండలంలోని రామకృష్ణాపురంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గాజ కుమారస్వామి (47) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు భార్య రమాదేవి, ఇద్దరు కూతుళ్లున్నారు. చిన్న కూతురు శ్రీవిద్య (17) గత సంవత్సరం హనుమకొండలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదివి కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిలైంది. ఈ మధ్య జరిగిన పరీక్షలు రాసినప్పటికీ పాస్ కాలేదు. దీంతో తండ్రి కూతురిని మందలించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లోని పురుగుల మందు తాగింది. ఇది గమనించిన తల్లిదండ్రులు వెంటనే పరకాల ఆస్పత్రికి తరలించారు. అయితే తన వల్లే కూతురు ఆత్మహత్యకు ప్రయత్నించిందని తండ్రి కుమారస్వామి మనోవేదనకు గురయ్యాడు. పరకాలలోని ఫెర్టిలైజర్ షాపులో పురుగుల మందు కొనుగోలు చేసిన అతడు.. పక్కనే వ్యవసాయ బావి వద్దకు వెళ్లి తాగి మృతి చెందాడు. క్షణికావేశంలో తండ్రీ కూతుళ్లు ప్రాణాల మీదికి తెచ్చుకోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరయ్యారు.

టీఎస్ ఈసెట్‌కు 96శాతం మంది హాజరు

హైదరాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశాలకు ఉద్దేశించిన ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీఎస్ ఈసెట్) పరీక్ష సోమవారం రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రశాంతంగా ముగిసింది. సీబీటీ విధానంలో జరిగిన ఈ పరీక్షను తెలంగాణలో 92, ఏపీలో 7 కేంద్రాల్లో నిర్వహించారు. తెలంగాణలో 21513 (96.58%) ఆంధ్రప్రదేశ్‌లో 1817 (90.85%) మంది హాజరయ్యారని కన్వీనర్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పిటిషనర్ల భూములు ఖాళీ చేయించొద్దు

- ఆర్ఆర్ఆర్ భూసేకరణలో ఇతర కార్యకలాపాలు యథావిధిగా చేసుకోవచ్చు
- ఎన్‌హెచ్ఏఐకి హైకోర్టు ఉత్తర్వులు

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) భూసేకరణకు సంబంధించి పిటిషనర్ల భూములను ఖాళీ చేయించరాదని రాష్ట్ర హైకోర్టు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)ను ఆదేశించింది. ఆర్ఆర్ఆర్‌కు సంబంధించిన ఇతర కార్యకలాపాలు యథావిధిగా కొనసాగించుకోవచ్చని స్పష్టం చేసింది. పిటిషనర్ల భూసేకరణ వ్యవహారంలో వివరణ ఇవ్వాలని ఎన్‌హెచ్ఏఐ సహా ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం నిర్మాణం కోసం నేషనల్ హైవేస్ యాక్ట్-1958, నూతన భూసేకరణ చట్టం- 2013లోని విధానాలకు విరుద్ధంగా భూసేకరణ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొంటూ మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన జి.శ్రీరాంరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇస్లాంపూర్‌లో సర్వే నంబర్లు 375, 377, 336లలో 9.03 ఎకరాల భూమి పిటిషనర్‌కు ఉంది. ఎన్‌హెచ్44- ఆర్ఆర్ఆర్ ఇంటర్ జంక్షన్ నిర్మాణంలో భాగంగా పిటిషనర్ తన మొత్తం భూమిని కోల్పోతున్నారు. జాతీయ రహదారుల చట్టం కింద అధికారులు 2022లో జారీ చేసిన 3ఏ నోటిఫికేషన్, 2023లో జారీచేసిన 3డీ నోటిఫికేషన్లను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం పాములపర్తికి చెందిన కట్ట ఆరులప్ప కూడా భూసేకరణపై పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కాజా శరత్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది గొరారం రాజశేఖర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుత ఆర్ఆర్ఆర్ 'జాతీయ రహదారుల పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్-2006' ప్రకారం 'ఎ' క్యాటగిరీలోకి వస్తుందన్నారు. 100 కిలోమీటర్లకు పైగా పొడవు ఉండే హైవేల నిర్మాణానికి కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ నుంచి పర్యావరణ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఆ అనుమతులు పొందడానికి ముందే 3డీ నోటిఫికేషన్ జారీచేయడం చెల్లదన్నారు. నూతన భూసేకరణ చట్టం-2013 ప్రకారం నిర్వాసితులను గుర్తించి ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ ప్రక్రియ చేపట్టకుండా భూసేకరణకు సంబంధించిన 3డీ నోటిఫికేషన్ ఇవ్వడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఎన్‌హెచ్ఏఐ తరఫున న్యాయవాది పద్మారావు వాదనలు వినిపిస్తూ.. జాతీయ రహదారుల చట్టం-1958 కింద చేపట్టే భూసేకరణకు నూతన భూసేకరణ చట్టంలోని ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ నిబంధనలు వర్తించవని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. పిటిషనర్లను వారి భూముల నుంచి ఖాళీ చేయించరాదని పేర్కొంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. విచారణను జూన్ 14కు వాయిదా వేసింది.



ప్రభుత్వ హాస్టళ్లలో లోపాలను సరిదిద్దాలి

- మార్గదర్శకాల ప్రకారం సౌకర్యాలు ఉండాలి
- వేసవి సెలవుల్లో చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టళ్లలో తగు సౌకర్యాలు కల్పించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జాతీయ బాలల హక్కుల రక్షణ చట్టం-2018లోని చాప్టర్-4 మార్గదర్శకాలను అమలుచేయాలని స్పష్టం చేసింది. ఆ మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేసింది. వసతి గృహాల్లోని లోపాలను వేసవి సెలవుల్లో సరిదిద్దడంతో పాటు నివేదికను సమర్పించాలని తెలిపింది. రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్లలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని.. విద్యార్థుల ఆత్మహత్యలు సహా అనారోగ్యాలకు గురికావడం వంటి అనేక ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, బాలల హక్కుల చట్టంలో పేర్కొన్న మార్గదర్శకాలను అమలు చేయాలని కోరుతూ ప్రైవేటు ఉద్యోగి అఖిల్ శ్రీగురు తేజ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ప్రభుత్వ హాస్టళ్లలో గత 60 రోజుల వ్యవధిలో ముగ్గురు విద్యార్థులు చనిపోవడంతోపాటు విషాహారం వల్ల దాదాపు 100 మంది విద్యార్థులు జ్వరం సహా ఇతర రోగాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతి సాధ్యమేనా?

భయపడినట్టే జరుగుతోంది. రాఫా నగరంనుంచి తక్షణమే ఓ లక్షమంది పాలస్తీనియన్లను ఖాళీచేయించాలని ఇజ్రాయెల్ నిర్ణయించుకుంది. నగరంలోకి చొరబడేందుకు సైన్యానికి అత్యున్నతస్థాయి అనుమతులు లభించినందున పౌరులను ఖాళీచేయించే పనిలో సైన్యం ఉన్నదని వార్తలు వస్తున్నాయి. ఇజ్రాయెల్ సైన్యానికీ, హమాస్‌కు మధ్య భీకర పోరు ఆరంభం కాబోతున్నదన్న భయంతో రాఫానగరం నుంచి ప్రజలు తరలిపోతున్నారు. చేతికి దొరికినవాహనాల్లోనూ, గాడిదలమీదా, నడుచుకుంటూ ప్రజలు కదిలిపోతున్నారు. హమాస్‌తో కాల్పుల విరమణకు సంబంధించిన చర్చలను ప్రభావితం చేయడానికీ, దానిని లొంగదీయడానికీ ఇజ్రాయెల్ ఈ రాఫా నిర్ణయాన్ని ప్రకటించిందని ఓ వాదన. రాఫా జోలికి వస్తే ఊరుకొనేది లేదనీ, ఆ నగరంలోకి అడుగుపెడితే ఇక మాటలుండవని హమాస్ హెచ్చరిస్తోంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూకు ఫోన్ చేసి, పదిలక్షలమంది పాలస్తీనా శరణార్థులు తలదాచుకుంటున్న ఈ నగరంలోకి సైన్యాన్ని పంపి, మారణహోమానికి పాల్పడవద్దని హితవుచెప్పారట. వాళ్ళిద్దరూ నిజంగా ఏమి మాట్లాడుకున్నారో తెలియదు కానీ, నెతన్యాహూ ఎవరిమాటా వినడని అందరికంటే ఎక్కువగా అమెరికా అధ్యక్షుడికే ఎరుక.

పరిమితస్థాయి చొరబాటు మాత్రమే జరుగుతుందని వార్తలు వస్తున్నప్పటికీ వాటిని ఏమాత్రం విశ్వసించలేం. వందలాదిమంది సైనికులు మారణాయుధాలతో రాఫాలోకి అడుగుపెడితే, వారు రాక్షసంగా వ్యవహరించడం, రెండుపక్షాల పోరులో సామాన్యులు సమిధలు కావడం ఖాయం. పైగా, హమాస్ యోధానుయోధులంతా ఈ నగరంలోనే ఉన్నారని, రాఫా వారి కీలకమైన స్థావరమని ఇజ్రాయెల్ అంటోంది. నాలుగు హమాస్ బెటాలియన్లకు ఈ నగరం స్థావరమని, వీరికితోడు గత ఆర్నెల్లయుద్ధంలో ఇతర ప్రాంతాలనుంచి పారిపోయివచ్చిన వేలాదిమంది హమాస్ ఫైటర్లు ఇక్కడే తలదాచుకుంటున్నారని ఇజ్రాయెల్ వాదిస్తోంది. అందువల్ల ఇప్పటివరకూ గ్రౌండ్ ఆపరేషన్స్ చేపట్టని కీలకమైన నగరంలోకి ఇజ్రాయెల్ సేనలు ప్రవేశిస్తే పరిస్థితులు ఎంత తీవ్రంగా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ఈ కారణంగానే అమెరికా సహా చాలా యూరప్ దేశాలు ఇజ్రాయెల్ సాగించబోయే విధ్వంసకాండతో తమకు అప్రదిష్టవస్తుందని భయపడుతున్నాయి, కూడదని హితవుచెబుతున్నాయి.

ఈజిప్ట్, ఖతార్ మధ్యవర్తిత్వంలో, హమాస్–ఇజ్రాయెల్‌మధ్య సాగుతున్న చర్చలు ఫలించాయని, కాల్పుల విరమణ ఒప్పందానికి హమాస్ అంగీకరించిందని వార్తలు వస్తున్నాయి. రాఫానుంచి తొలివిడతగా లక్షమందిని ఖాళీచేయించి, తన సైన్యాన్ని ప్రవేశపెట్టేందుకు ఇజ్రాయెల్ సిద్ధపడటంతోనే హమాస్ దిగివచ్చిందని కొందరివాదన. కాల్పుల విరమణకు హమాస్ సానుకూలంగా ఉన్నదని తెలిసి, అది తన నిర్ణయాన్ని ప్రకటించేలోగా నెతన్యాహూ రాఫామీద పడ్డారని మరోవాదన. కాల్పులవిరమణకు లొంగినపక్షంలో రాఫాలోకి చొరబడటం ఇక అసాధ్యమైపోతుంది. ఆ నగరం సంగతి తేల్చకుండానే ఇజ్రాయెల్ సైనికులు వెనక్కుమళ్ళాల్సిరావచ్చు. అందువల్లనే, రాఫా విషయంలో రాజీపడవద్దనీ, యుద్ధంలో మనదే విజయమని రేపొద్దున ప్రజలకు చెప్పుకోవాలంటే అందులోకి చొరబడి, హమాస్‌ను ఊచకోతకోయాల్సిందేనని నెతన్యాహూ మీద ఆయన మిత్రపక్షాలు తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నాయట. రాఫాలోకి అడుగుపెట్టవద్దంటూ హమాస్ చేస్తున్న హెచ్చరికలకు, అంతర్జాతీయ ఒత్తిళ్ళకు లొంగితే రచ్చగెలిచి ఇంట ఓడిపోతానని నెతన్యాహూ నమ్ముతున్నారనీ, శాంతియత్నాలు, హమాస్‌తో సంధి ఆయనకు ఈ దశలో ఇష్టంలేదని వార్తలు వస్తున్నాయి. అందువల్ల హమాస్‌మీద ఒత్తిడి తేవడానికి కాక, దానిని రెచ్చగొట్టడానికే చర్చలు ఫలించబోతున్న ఆఖరుదశలో నెతన్యాహూ రాఫా మీద పడ్డారని ఓ వాదన. కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా హమాస్ తన దగ్గరున్న బందీలందరి అప్పగింత, గాజాలోని పలుప్రాంతాలనుంచి ఇజ్రాయెల్ దశలవారీ ఉపసంహరణ ఉంటాయని ఖతార్ ఎప్పటినుంచో అంటోంది. శాశ్వత కాల్పులవిరమణ, గాజానుంచి ఇజ్రాయెల్ పూర్తిగా వెనక్కుపోవడం, నిరాశ్రయులైనవారంతా తిరిగి ఇళ్ళకు చేరడం వంటివి హమాస్ ప్రధానంగా డిమాండ్ చేస్తోంది. ఇప్పుడు హమాస్ సరేనన్న ఒప్పందంలో ఏయే అంశాలున్నాయో, వాటికి ఇజ్రాయెల్ అంగీకరిస్తుందో లేదో తెలియదు. నెతన్యాహూ యుద్ధకండూతికి వ్యతిరేకంగా ఇంటాబయటా రేగుతున్న ఆగ్రహం ఇప్పటికే తీవ్రస్థాయికి చేరుకుంది. రాఫాను వదిలి, కాల్పుల విరమణకు సరేనని, బందీలను విడిపించుకున్న పక్షంలోనే ప్రజలు ఆయనను క్షమిస్తారు.

ఏపీలో ఏమవుతున్నదో మోదీకి తెలుసు!

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అభివృద్ధిపై పూర్తిగా దృష్టిని కేంద్రీకరిస్తే ఆంధ్రప్రదేశ్‌లో జగన్ పూర్తిగా అవినీతిపై దృష్టి కేంద్రీకరించారని, అవినీతి లేకపోతే ఆయన ఏ పనీ చేయరని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం రాజమండ్రి, అనకాపల్లి సభల్లో చేసిన విమర్శలు ప్రజలను ఆలోచింప చేస్తున్నాయి. ఆఖరుకు మద్యం, ఇసుక మాఫియాల గురించి కూడా మోదీ మాట్లాడటంతో రాష్ట్రంలో ఏం జరుగుతుందో ఆయనకు స్పష్టంగా తెలుసని అర్థమవుతోంది.

మూడు రాజధానుల నిర్మాణం పేరుతో వైసీపీ సర్కారు ఖజానాను ఖాళీచేయడం, ఒక్క రాజధాని కూడా నిర్మించలేకపోవడం, రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరానికి తాము రూ.15వేల కోట్లు ఇచ్చినా వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోవడం గురించి కూడా మోదీ, అమిత్ షాలు మాట్లాడారు. కేంద్రంలో 26 పార్టీల ఇండియా అలయెన్స్‌కు 26 సీట్లు కూడా రావని, ఇదే పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో జగన్ కూడా ఎదుర్కొంటారని అమిత్ షా రెండు రోజుల క్రితం ధర్మవరం నియోజకవర్గంలో జరిగిన ప్రచార సభలో స్పష్టం చేశారు.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

ఏపీలో గుండాగిరి అంతానికే కూటమిని ఏర్పరిచామని, ఇక్కడి అవినీతి ప్రభుత్వాన్ని గద్దెదించేందుకే చేతులు కలిపామని స్పష్టం చేశారు. భూ మాఫియాను అంతం చేసి, అమరావతిని మళ్లీ రాజధానిగా ఏర్పాటు చేసేందుకే తాము కలిసి పనిచేయాలని నిర్ణయించామని తెలిపారు. జూన్‌లో ఏపీలో చంద్రబాబు, కేంద్రంలో మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకుని రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని అన్నారు. మోదీ – చంద్రబాబు మైత్రి సూపర్ హిట్ జోడీ అని, ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ మూలంగా శరవేగంతో అభివృద్ధి జరగడం ఖాయమని ఆయన చెప్పారు. 25కు 25 ఎంపీ స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని, అసెంబ్లీలో మూడింట రెండొంతు సీట్లతో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని ఆయన రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

ఒక దేశ ప్రధానమంత్రి, హోంమంత్రి ఇలాంటి ప్రకటనలు చేయడం సాధారణ విషయం కాదు. అయిదేళ్ళ జగన్ పాలనలో దుష్కృత్యాలగురించి వారికి ఎప్పటికప్పుడూ నివేదికలు వెళుతూ ఉంటాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబు నాయుడు ప్రథమ స్థానంలో నిలిపారని, విభజన తర్వాత కూడా రాష్ట్రాన్ని ప్రగతి బాటలో నడిపారని, ఆయన చేసిన అభివృద్ధిని జగన్ అధోగతి పట్టించారని మోదీ, అమిత్ షా చెప్పిన మాటల్ని చూస్తే వారికి రాష్ట్రం గురించి ఎంతో అధ్యయనం చేశారని అర్థమవుతోంది.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబు నాయుడు ప్రథమ స్థానంలో నిలిపారని, విభజన తర్వాత కూడా రాష్ట్రాన్ని ప్రగతి బాటలో నడిపారని, ఆయన చేసిన అభివృద్ధిని జగన్ అధోగతి పట్టించారని మోదీ, అమిత్ షా చెప్పిన మాటల్ని చూస్తే వారు రాష్ట్రం గురించి ఎంతో అధ్యయనం చేశారని అర్థమవుతోంది.

నిజానికి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ అభివృద్ధికి జగన్ కల్పిస్తున్న ఆటంకాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేయడం నుంచీ, పోలవరం ప్రాజెక్టుకు విఘాతం కల్పించడం వరకూ జగన్ ఒక అభివృద్ధి వ్యతిరేకిగా తనను తాను రుజువు చేసుకున్నారు. అనేక పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లాయి. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రైల్వేజోన్‌ను మంజూరు చేసినా ఈ జోన్ ముఖ్య కార్యాలయానికి జగన్ ప్రభుత్వం భూమిని కేటాయించలేదని సాక్షాత్తూ ప్రధానమంత్రే అన్నారు. 21 లక్షల మేరకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన క్రింద ఇళ్ల నిర్మాణాన్ని మంజూరు చేసినా వాటిలో సగం కూడా కట్టలేదని మోదీయే అన్నారు. జగన్ చేసిన అప్పులు, రాష్ట్ర ఖజానా ఖాళీ కావడం మోదీ చాలా కాలంగా గమనిస్తూ ఉన్నారు. కార్పొరేషన్ల పేరిట కూడా అప్పులు చేయడం, కేంద్రం ఇస్తోన్న నిధులను ఇష్టారాజ్యంగా మళ్లించడం ఆయనకు తెలుసు. అందుకే జగన్‌కు అవినీతి నిర్వహణ తప్ప ఆర్థిక నియంత్రణ తెలియదని, రాష్ట్రం అందుకే అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆయన ఘాటుగా విమర్శించారు.

నిజానికి రాష్ట్రంలో జగన్ అస్తవ్యస్థ అరాచక పాలన గురించి తెలిసిన తర్వాతే బీజేపీ తెలుగుదేశం–జనసేనలతో పొత్తు పెట్టుకోవాలని నిర్ణయించింది. చంద్రబాబు హయాంలో నంబర్ వన్‌గా ఉన్న రాష్ట్రం ఇప్పుడెందుకు అప్పుల్లో కూరుకుపోయిందని మోదీ, షాలు చేస్తున్న విమర్శలకు జగన్, ఆయన అనుయాయుల వద్ద జవాబులు లేవు.

పోనీ జగన్ తాను ఏమైనా వాగ్దానాలు నిలబెట్టుకున్నారా అంటే అదీ లేదు. అమరావతిని రాజధానిగా నిర్ణయించడాన్ని జగన్ అసెంబ్లీలో స్వాగతించారు. అధికారంలోకి రాగానే విశాఖపట్టణం, అమరావతి, కర్నూల్‌లలో మూడు రాజధానులు నెలకొల్పుతామని ప్రకటించారు. ఇవాళ చూస్తే ఏపీలో ఒక్క రాజధాని కూడా లేదు. రాష్ట్రంలో మద్యాన్ని పూర్తిగా నిషేధిస్తామని జగన్ వాగ్దానం చేశారు. కాని అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పోరేషన్ లిమిటెడ్ తరఫున మద్యాన్ని అమ్మడం ప్రారంభించారు. వైసీపీ నేతల డిస్టిలరీస్‌లో తయారు చేసిన మద్యాన్నే ఈ సంస్థ అమ్ముతోంది. జగన్ అనుయాయులంతా మద్యం సిండికేట్ నడుపుతూ వేల కోట్లు వెనుకేసుకుంటున్నారు.

2023 డిసెంబర్‌లో ఆరోగ్యశ్రీ పథకాన్ని జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. కాని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీస్ హాస్పిటల్ అసోసియేషన్ (ఆశా) ఈ పథకం ద్వారా రోగులకు చికిత్స అందించకూడదని నిర్ణయించింది. అనేక ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో రోగులను చేర్చుకోవడానికి నిరాకరిస్తున్నారు. ఎందుకంటే వారికి చెల్లించాల్సిన బకాయిల్లో పది శాతం కూడా జగన్ ప్రభుత్వం చెల్లించడంలేదు.

జగన్ రాయలసీమకు చెందినవారు కనుక ఆ ప్రాంతానికైనా ఏదో ఒక మేలు చేశారనుకుంటే అది కూడా లేదు. ఈ అయిదేళ్లలో రాయలసీమను పూర్తిగా విస్మరించారు. ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి కావల్సిన పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడంలో బీజేపీ కీలక పాత్ర పోషించింది. కాని జగన్ అవినీతి, అరాచక చర్యల వల్ల గత అయిదేళ్ళల్లో ఈ ప్రాజెక్టు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. మోదీ ప్రభుత్వం రూ.15వేల కోట్లు మంజూరు చేసినప్పటికీ పోలవరం ప్రాజెక్టు స్తంభించిపోయింది. పోలవరం మాత్రమే కాదు, హంద్రీ నీవా సుజల స్రవంతి, వెలిగొండ, ప్రజలు ఏడు దశాబ్దాలుగా కలలు కంటున్న వరికపుడిసెల ప్రాజెక్టు అమలు విషయంలో జగన్ ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

ఏపీలో ఎన్డీఏ కూటమి అటు వైసీపీ నుంచీ, ఇటు కాంగ్రెస్ నుంచీ పోటీని ఎదుర్కొంటోంది. జగన్ వ్యతిరేక ఓట్లను చీల్చేందుకు ఆయన సోదరి తీవ్రంగా యత్నిస్తున్నారు. పైకి ఇరువురూ తీవ్ర విమర్శలు చేసుకుంటున్నా, ఇద్దరూ ఒకరికి ఒకరు సహాయపడుతున్నారని ప్రధానమంత్రి మోదీ సైతం అభిప్రాయపడ్డారు. దాదాపు ఆరు దశాబ్దాల పాటు దేశాన్ని అధోగతిపాలు చేసిన కాంగ్రెస్ అవినీతిలో కూరుకుపోయింది. ఈడీ, ఈడీ అంటూ గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ నేతల ఇళ్లలోనే ఎందుకు గుట్టలుగా డబ్బులు దొరుకుతున్నాయన్న మోదీ ప్రశ్నకు ఎవరు సమాధానం చెప్పగలరు? ప్రజల నుంచి నేతలు దోచుకున్న డబ్బు పేదలకు ఎలా పంచాలో ఆలోచిస్తున్న మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చాక ఈ దేశంలో అవినీతి పూర్తిగా మటుమాయం కావడం ఖాయం.

జయాపజయాల నిర్ణేత!

లోక్‌సభ ఎన్నికల మూడో విడత పోలింగ్ నేడు జరగనున్నది. ఈ మూడో దశ చాలా కీలకమైనది. అధికార, ప్రతిపక్ష కూటములు గెలుచుకున్న లేదా కోల్పోయే నియోజక వర్గాల సంఖ్య మొత్తంగా వాటి జయాపజయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేసే అవకాశం ఎంతైనా ఉన్నది. మంగళవారం 93 నియోజకవర్గాలలో పోలింగ్ పరిపూర్తితో సగానికి పైగా లోక్‌సభ నియోజకవర్గాలు కచ్చితంగా చెప్పాలంటే 238 స్థానాలు–ఓటర్లు తమ ప్రతినిధులను ఎన్నుకోవడం పూర్తవుతుంది. మా అంచనా ప్రకారం ఎన్డీఏ ఐదు సంవత్సరాల క్రితం గెలుచుకున్న 111 స్థానాలలో 20ని ప్రస్తుత ఎన్నికల మొదటి రెండు దశల్లో కోల్పోనున్నది. ఈ మూడో దశలో మరో 20 సీట్లను సైతం అది కోల్పోయే అవకాశాలు ఉన్నాయి. నిజంగా ఇదే జరిగితే బీజేపీకి తీవ్ర నష్టం వాటిల్లడం ఖాయం. కొత్త లోక్‌సభలో బీజేపీకి కనీస మెజారిటీ (272) కంటే తక్కువ స్థానాలు మాత్రమే లభిస్తాయి. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే బీజేపీ, దాని మిత్రపక్షాలు ఈ దశలో అత్యధిక స్థానాలను గెలుచుకుని తీరాలి. ఇది జరిగితేనే బీజేపీ తన ఆధిక్యతను కాపాడుకోగలుగుతుంది. రెండో దశలో వలే మూడో దశలో కూడా, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న చాలా సీట్లను కాపాడుకోవల్సి రావడమే ఎన్డీఏ సమస్య. పోలింగ్ జరగనున్న 93 (బీజేపీ అభ్యర్థి ఏకగ్రీవంగా గెలిచిన సూరత్‌ను కూడా కలుపుకుంటే 94) సీట్లలో 80 సీట్లు ఎన్డీఏవే కావడం గమనార్హం. అయితే మూడో విడత పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలు ఉన్న గుజరాత్ మొదలైనవి ఎన్డీఏకు కంచుకోటలుగా ఉండడం విస్మరింపలేని వాస్తవం. నేడు పోలింగ్ జరగనున్న పది రాష్ట్రాలలో ఎనిమిది బీజేపీ ప్రభుత్వాల పాలనలో ఉన్నాయి. ఈ 94 సీట్లలో, గతంలో కేవలం 12 మాత్రమే గెలుచుకున్న ఇండియా కూటమి ఈసారి మరో 15 సీట్లను కైవసం చేసుకునే అవకాశమున్నది. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు సాధించిన విజయాలే అందుకు నిదర్శనం. ఎన్డీఏ అనుకూలత 80:12 నుంచి 65:27కి తగ్గనున్నది.



■ యోగేంద్ర యాదవ్

మూడో దశ ఎన్నికలలో కర్ణాటక ఓటర్ల తీర్పు నిర్ణయాత్మకం కానున్నది. ఈ రాష్ట్రంలో బీజేపీకి తీవ్ర ప్రతికూలతలు ఉండగా, ఇండియా కూటమికి విజయావకాశాలు మెరుగ్గా ఉన్నాయి. పోలింగ్ జరగనున్న 14 స్థానాలలో అత్యధికం ఉత్తర, మధ్య కర్ణాటకలో ఉన్నాయి. వీటన్నిటినీ ఎన్డీఏ కోల్పోయే అవకాశమున్నది. 2019లో ఎన్డీఏ ఈ 14 స్థానాలనూ గెలుచుకున్నది; 2014లో 11 స్థానాలను, 2009లో 12 స్థానాలనూ గెలుచుకున్నది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ మంచి ఫలితాలను సాధించింది. ఆ ఫలితాల ప్రాతిపదికన చూస్తే ఈ 14 నియోజకవర్గాలలో కనీసం ఏడు స్థానాలలో కాంగ్రెస్ ముందంజలో ఉన్నది. అయితే అంతిమ విజయం కాంగ్రెస్‌నే వరిస్తుందని చెప్పలేము. ఎందుకంటే గత మూడు దశాబ్దాలుగా లోక్‌సభ ఎన్నికలలో, బీజేపీనే విజయం సాధిస్తూ వస్తోంది. అయితే ఈ తడవ బీజేపీకి అటువంటి సానుకూల పరిస్థితి లేదు. ఇందుకు పలు కారణాలు ఉన్నాయి. సిద్దరామయ్య ప్రభుత్వం తన ఎన్నికల హామీలను పూర్తిగా అమలుపరిచింది. ఐదు గ్యారంటీల అమలు ఫలితంగా ముఖ్యంగా మహిళలు ఇతోధిక లబ్ధి పొందారు. ఈ కారణంగా కాంగ్రెస్ పార్టీ వైపే ఓటర్లు మొగ్గు చూపుతున్నారు. గతంలో వలే రాష్ట్ర స్థాయి నాయకులు ఈ జాతీయ ఎన్నికలపై ఉదాసీనత చూపే పరిస్థితి లేదు. ఈసారి కాంగ్రెస్ అభ్యర్థులలో సగం మంది రాష్ట్ర మంత్రుల సమీప బంధువులే. ఇక కాంగ్రెస్ నాయకులు అసెంబ్లీ ఎన్నికలలో వలే లోక్‌సభ ఎన్నికలలో కూడా సమైక్యంగా పని చేస్తున్నారు. అయితే బీజేపీలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉన్నది. బీజేపీ జాతీయ నాయకత్వం కర్ణాటకలో ఎన్నికల బాధ్యతను బిఎస్ యెడ్యూరప్పకు అప్పగించింది. అయితే మాజీ ఉప ముఖ్యమంత్రి కెఎస్ ఈశ్వరప్ప ఈ విషయమై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. యెడ్యూరప్పకు అమిత ప్రాధాన్యాన్ని ఇవ్వడాన్ని ఆయన వ్యతిరేకిస్తున్నారు. అలాగే లింగాయత్ సామాజికవర్గ ఆధ్యాత్మిక నేత ఒకరు యడ్యూరప్ప నాయకత్వాన్ని హర్షించడం లేదు. మూడో దశ ఎన్నికలు జరగనున్న నియోజకవర్గాలలో లింగాయత్‌లు ప్రభావ ప్రాబల్యాలు గణనీయమైన స్థాయిలో ఉన్నాయి. జనతాదళ్ (ఎస్) నాయకుడు, హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దురాగతాల ఉదంతం ఎన్డీఏ విజయావకాశాలను తీవ్రంగా దెబ్బ తీసింది ప్రజ్వల్‌కు మద్దతుగా ప్రధాని మోదీ కూడా ప్రచారం చేశారు. పోలింగ్ అయిన తరువాత ప్రజ్వల్ జర్మనీకి పరారయ్యాడు. ఇందుకు మోదీ సర్కార్ సహకరించిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఓబీసీ రిజర్వేషన్లలో ముస్లింలకు 4 శాతం సబ్ కోటాను ఇవ్వడాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను ముస్లింలకు బదిలీ చేసేందుకు కాంగ్రెస్ పన్నాగమని మోదీ తీవ్ర స్థాయిలో చేసిన ఆరోపణలకు కూడా ప్రజల నుంచి పెద్దగా ప్రతిస్పందన లేదు (నిజానికి ఈ సబ్ కోటాను 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు నాటి బీజేపీ ప్రభుత్వం రద్దు చేసేంతవరకు బీజేపీతో సహా అన్ని పార్టీల ప్రభుత్వాలూ అమలుపరిచాయి). ఏడాది క్రితం అసెంబ్లీ ఎన్నికలలో సాధించుకున్న ఓట్ల శాతాన్ని ఈ ఎన్నికలలోనూ నిలబెట్టుకోగలిగితే బీజేపీ అధీనంలో ఉన్న 14 సీట్లలో ఏడింటిని తప్పకుండా కైవసం చేసుకోగలుగుతుంది. ప్రజ్వల్ ఉదంతంతో అప్రతిష్ఠపాలైన జనతాదళ్(ఎస్) పార్టీకి చెందిన ఓటర్లను తన వైపుకు తిప్పుకోగలిగితే కాంగ్రెస్‌కు లభించే స్థానాల సంఖ్య 11కి పెరిగే అవకాశమున్నది.

మహారాష్ట్రలో మూడో విడత పోలింగ్ 11 నియోజకవర్గాలలో జరగనున్నది. 2019లో ఈ 11 స్థానాలలో ఏడింటిని నాటి బీజేపీ–శివసేన కూటమి కైవసం చేసుకున్నది. ప్రస్తుత ఎన్నికలలో అందరి దృష్టి పశ్చిమ మహారాష్ట్రపై ఉన్నది. మనుగడ ముప్పునెదుర్కొంటున్న ఎన్సీపీని రక్షించుకునేందుకు ఆ పార్టీ అధినేత శరద్ పవార్ తన సర్వశక్తులనూ ఒడ్డుతున్నారు. కాగా ఈ దశలో ఇండియా కూటమి స్వల్పస్థాయిలో లబ్ధి పొందే అవకాశమున్నది. ఇక మధ్యప్రదేశ్‌లో ఇండియా కూటమి విజయావకాశాలు ముఖ్యంగా చంబల్–గ్వాలియర్ ప్రాంతంలో మెరుగ్గా ఉన్నాయి. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ హవా ప్రచండంగా వీచినప్పటికీ ఈ ప్రాంతాలలో కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకు పోలేదు. నేడు పోలింగ్ జరగనున్న 9 స్థానాలనూ 2019లో బీజేపీనే గెలుచుకున్నది. కాంగ్రెస్ మూడు సీట్లలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ దృష్ట్యా కాంగ్రెస్ ఆ స్థానాలను గెలుచుకునే అవకాశమున్నది. ఉత్తరప్రదేశ్‌లో నేడు పోలింగ్ జరగనున్న పది స్థానాలూ సమాజ్‌వాది పార్టీ ప్రభావ ప్రాబల్యాలు బలంగా ఉన్న ప్రాంతాలలో ఉన్నాయి. అయితే బీఎస్పీ తరఫున ఐదుగురు ముస్లిం అభ్యర్థులు రంగంలో ఉన్నందున ఇండియా కూటమి గట్టి సవాల్ నెదుర్కొంటుందని చెప్పవచ్చు.



పశ్చిమ బెంగాల్‌లో నేడు పోలింగ్ జరగనున్న నాలుగు నియోజక వర్గాలలోనూ త్రిముఖ పోటీ జరగనున్నది. ముస్లింలు అత్యధికంగా ఉన్న ఈ నాలుగు నియోజక వర్గాలలోనూ కాంగ్రెస్–లెఫ్ట్ కూటమి ముస్లిం అభ్యర్థులను నిలబెట్టినందున బీజేపీ పరిస్థితి మెరుగుపడే అవకాశమున్నది.

ప్రధాని మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో గత రెండు సార్వత్రిక ఎన్నికలలోనూ అన్ని స్థానాలనూ బీజేపీనే గెలుచుకున్నది. అయితే ఈసారి ఆ పరిస్థితి ఉండకపోవచ్చు. ఆదివాసీలు అత్యధికంగా ఉన్న ప్రాంతాలలో బీజేపీకి కాంగ్రెస్ గట్టి పోటీనిస్తోంది. క్షత్రియులు, పటేళ్ల మొదలైన సామాజికవర్గాలు బీజేపీ పట్ల తీవ్ర అసంతృప్తితో ఉండడం కాంగ్రెస్‌కు కలిసివచ్చే విషయం.

పశ్చిమ బెంగాల్‌లో నేడు పోలింగ్ జరగనున్న నాలుగు నియోజకవర్గాలలోనూ త్రిముఖ పోటీ జరగనున్నది. ముస్లింలు అత్యధికంగా ఉన్న ఈ నాలుగు నియోజకవర్గాలలోనూ కాంగ్రెస్–లెఫ్ట్ కూటమి ముస్లిం అభ్యర్థులను నిలబెట్టినందున బీజేపీ పరిస్థితి మెరుగుపడే అవకాశమున్నది. అస్సాంలో నియోజకవర్గాల పునర్విభజన ఆయా పార్టీల జయాపజయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేయనున్నది. బిహార్, ఛత్తీస్‌గఢ్, గోవాలలో కూడా ఇండియా కూటమికి విజయావకాశాలు మెరుగ్గా ఉన్నాయి.

మొత్తం మీద ఈ మూడో దశలో ఎన్డీఏ కూటమి మరో 20 సీట్లను కోల్పోయిన పక్షంలో, ఈ సార్వత్రిక ఎన్నికల ఆరంభంలో ఎవరూ ఊహించని పరిస్థితి నెలకొనే అవకాశమున్నది: బీజేపీ నేతృత్వంలోని అధికార కూటమికి కనీస మెజారిటీ (272) సైతం దక్కే అవకాశముండదు.

(వ్యాసకర్త జాతీయ కన్వీనర్, భారత్ జోడో అభియాన్)

అల్లూరి ఆశయసాధనకు కృషి చేయాలి

'విప్లవజ్యోతి' అల్లూరి సీతారామరాజును మేజర్ గుడాల్ కాల్చి చంపి నేటికి వందేళ్లు. శ్రీరామరాజు మరణించే నాటికి ఆయన వయస్సు 27 సంవత్సరాలు. ఇందులో 13 ఏళ్లు రాజమండ్రి గోదావరి గట్టు ప్రాంతంలో నివసించాడు. ఆ ప్రాంతంలో చదువుకున్న ఉల్లితోట బంగారయ్య స్కూలుకు, గోదావరి పుష్కరాల రేవు ప్రాంతం నుంచి ఉన్న పాత రైలు వంతెనకు, ఏజెన్సీకి ముఖద్వారంగా



ఉన్న రాజమండ్రి విమానాశ్రయానికి అల్లూరి శ్రీరామరాజు పేరు పెట్టాలని ఐదు దశాబ్దాలుగా కోరుతుంటే ఉమ్మడి విశాఖ జిల్లాను మూడుగా విభజించి ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టారు. అయితే రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుంది. పార్లమెంటు భవన ప్రాంగణంలో అనుమతి ఉన్నా ఆయన విగ్రహాన్ని పెట్టలేదు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 125వ జయంత్యోత్సవం సందర్భంగా 125 రూపాయల నాణేన్ని విడుదల చేశారు. కానీ అల్లూరి 125 సంవత్సరాల జయంత్యోత్సవం జరుపుకుంటున్న తరుణంలో నాణేన్ని విడుదల చేయాలని కోరినా పెడచెవిన పెట్టారు. గతంలో పాఠ్యపుస్తకాల్లో అల్లూరి చరిత్ర ఉండేది. దానిని ఎత్తేశారు. తిరిగి దానిని ప్రవేశపెట్టాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో అల్లూరి చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలి. రాష్ట్రంలో గిరిజన యువత, చదువుకున్నవారు, శ్రామికులు వలస వెళ్లకుండా ఆ ప్రాంతాల్లో చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. కేంద్ర బడ్జెట్‌లో ఆదివాసీలకు కేటాయించిన సొమ్ము వారికే పూర్తిగా ఖర్చు చేయాలి. గిరిజన విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు పెంచాలి. శ్రీరామ రాజు పేరున ఏర్పాటు చేసిన జిల్లాను అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలి. శ్రీరామరాజు చరిత్ర వ్యాప్తికి, ఆయన ఆశయ సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి.

– పడాల వీరభద్రరావు
అల్లూరి సీతారామరాజు చరిత్ర పరిశోధకులు

ద్రవిడ లోకంలో బ్రాహ్మణ వికాసమెట్టిది?

కులాల్లో మార్పులు కొత్తకాదు. వాటి వృత్తి పునాదులు కదలటమూ కొత్తకాదు. కులాల్లో అంతరాలూ కొత్తవి కావు. కులాల వలసలూ పాత విషయమే. 200 ఏళ్లల్లో ఎన్నో మార్పులు! అయినా మారని సత్యాలూ కొన్ని ఉన్నాయి. సగటు మనిషి ఆలోచనలను, అభిరుచుల్ని, వివాహాన్ని నిర్ణయించటంలో కులం పాత్ర ఇప్పటికీ గణనీయమే. దీన్ని వదులుకుని అడుగులు వేయటం అంత తేలిక కాదు. మరోవైపు ఆధునిక జీవిత ఒత్తిళ్లతో ఉద్యోగ, వ్యాపారాల్లో నిలదొక్కుకోటానికి ఎన్నో కుల ప్రభావాలను వదులుకోవాల్సి వస్తోంది. లాభాపేక్షతో నడిచే ఆర్థిక వ్యవస్థలో కులం పాత్ర ఎట్లా మారుతోంది? అది నిర్దేశించే ఆలోచనలు, అలవాట్లు, భేషజాలు ఏమవుతున్నాయి? అన్న ప్రశ్నలు అందరిలోనూ ఏదో రూపంలో ఉదయిస్తూనే ఉంటాయి.

కులం ప్రభావంలేని రంగమంటూ లేదు. అందుకే ఎన్నో పరిశోధనలు.. విశ్లేషణలు. కొన్ని కులాల్లో మార్పులపై ఇప్పటికే సమగ్ర వ్యాసాలు, పుస్తకాలు వచ్చాయి. కానీ బ్రాహ్మణుల గురించి వచ్చినవి తక్కువ. అందులోనూ ఒక ప్రాంత బ్రాహ్మణుల గురించి వచ్చినవి ఇంకా తక్కువ. దీనికి భిన్నంగా తమిళ బ్రాహ్మణులపై ప్రముఖ అంత్రపాలజిస్టు సి.జె.ఫులర్ లోతైన పరిశోధన చేశారు. హరిప్రియా నరసింహన్‌తో కలిసి 'తమిళ్ బ్రాహ్మన్స్' పేరుతో రాసిన పుస్తకం చాలా ఆసక్తికరమైంది. కావేరీ డెల్టాలోని అగ్రహార గ్రామాల్లో దండిగా భూసంపద ఉండి, అన్నింటా ఒకనాడు ఆధిపత్యాన్ని చలాయించిన సంప్రదాయ బ్రాహ్మణులు మధ్య–ఎగువ మధ్యతరగతిగా ఎలా మారారు? రిజర్వేషన్ల అమలుతో ఏర్పడిన ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఆధిక్యతను ఎలా నిలబెట్టుకున్నారు? ముఖ్యంగా ద్రవిడ ఉద్యమం సృష్టించిన బ్రాహ్మణ వ్యతిరేకతకు, విసిరిన సవాళ్లను ఎలా అధిగమించారు? సంప్రదాయం అందించిన ఆధిక్యతలు అంతరించిపోయినా ఇంకా తమని తాము ఒక విశిష్ట సమూహంగా ఎలా భావించుకుంటున్నారు? అన్నవి కుతూహలం కలిగించే ప్రశ్నలే.


తమిళ బ్రాహ్మణులు ఏ స్థాయి నుంచి ఎక్కడికి చేరుకున్నారో అర్థం చేసుకోటానికి ద్రవిడ ఉద్యమం తలెత్తిన నాటి పరిస్థితులు చూడాలి. అంతకు కొన్ని దశాబ్దాల నాటి గ్రామీణ జీవనంలో వాళ్ల పాత్రనూ పరిశీలించాలి. 1916 డిసెంబరులో సౌత్ ఇండియన్ పీపుల్స్ అసోసియేషన్.. నాన్–బ్రాహ్మిన్ మ్యానిఫెస్టోను విడుదల చేయటం దేశంలోనే సంచలనం. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 3 శాతంగా ఉన్న బ్రాహ్మణులు ఉద్యోగాల్లో, పదవుల్లో ఎంతటి ఆధిక్యతను నెలకొల్పుకున్నారో వివరిస్తూ గణాంకాలను పొందుపరచారు. ప్రావిన్షియల్ సివిల్ సర్వీసు పరీక్ష అప్పట్లో చాలా కీలకమైంది. 1892–1904 మధ్య 16 మంది ఆ పరీక్షలో నెగ్గితే అందులో 15 మంది బ్రాహ్మణులే ఉన్నారు. 1913లో 128 మంది శాశ్వత జిల్లా మున్సిఫ్ పోస్టులుంటే 93 పోస్టుల్లో బ్రాహ్మణులే కుదురుకున్నారు. మద్రాసు హైకోర్టులోని అయిదుగురు భారతీయ న్యాయమూర్తుల్లో నలుగురు బ్రాహ్మణ వర్గానికి చెందినవారే. 1914 నాటికి మద్రాసు వర్సిటీకి చెందిన 650 మంది రిజిస్టరు గ్యాడ్యుయేట్లల్లో 450 మంది బ్రాహ్మణులే. జాతీయోద్యమంలో కూడా వారి ప్రాబల్యమే ఎక్కువ. అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి మద్రాసు నుంచి ఎన్నికైన 16గురిలో 15గురు బ్రాహ్మణులే. విద్య, ఉద్యోగ రంగాల్లో బ్రాహ్మణేతర కులాలకు సముచిత వాటా దక్కాలనే లక్ష్యంతో నాన్–బ్రాహ్మిన్ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఈ మ్యానిఫెస్టో రూపకల్పన వెనుక వ్యవసాయ కులాల్లోని పైవర్గాలకు చెందినవారే ప్రముఖంగా ఉన్నారు. విద్యారంగంలో ఈ వర్గాలూ అప్పటికి ఎంతో కొంత ప్రగతిని సాధించారు. వాటాల కోసం అందుకే గొంతెత్తారు. ప్రభుత్వ అండతో బ్రాహ్మణ ఆధిక్యాన్ని తగ్గించటానికి పూనుకున్నారు. బ్రాహ్మణయేతర్లకు రిజర్వేషన్లు ఉండాలనే ఆలోచనలకు అంకురార్పణ ప్రధానంగా అప్పుడే జరిగింది. బ్రాహ్మణ వ్యతిరేకతతో 1920లో అధికారంలోకి వచ్చిన జస్టిస్ పార్టీ రిజర్వేషన్లకు ఆ నేపథ్యంలోనే శ్రీకారం చుట్టింది. కాంగ్రెస్ పార్టీకి వాటిని కొనసాగించక తప్పలేదు. అందుకే 1951లోనే ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఓబీసీలకు 25 శాతం రిజర్వేషన్లను కల్పించింది. 1973లో డీఎంకే ప్రభుత్వం వాటిని 31 శాతానికి పెంచింది. 1980లో ఏఐడీఎంకే ప్రభుత్వం వాటిని 50 శాతానికి చేర్చింది. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన 18 శాతాన్ని కలుపుకొంటే మొత్తం రిజర్వేషన్లు తమిళనాట 1980నాటికే 68 శాతానికి చేరాయి.

నగర, పట్టణ ప్రాంతంలోని పరిస్థితులను పక్కనబెట్టి గ్రామాల్లోకి చూస్తే మరోరకం ఆధిపత్యం కనపడుతుంది. పాత తంజావూరు జిల్లా పరిస్థితి చూస్తే అదేంటో అర్థం అవుతుంది. ఆ జిల్లాలో బ్రాహ్మణులు 6.4 శాతం ఉండేవారు. వ్యవసాయం అభివృద్ధి పొందిన జిల్లా కాబట్టి బ్రాహ్మణుల సంఖ్య అక్కడ ఎక్కువ. కిందటి శతాబ్దం తొలినాళ్లలో ధనిక మిరాశీదార్లలో (వారసత్వ భూస్వాములు) బ్రాహ్మణుల వాటా 38 శాతం. బ్రాహ్మణుల్లో పౌరోహిత్యం చేసే వాళ్లే ఎక్కువనే భావన ప్రజల్లో ఉంది. అది నిజం కాదు. భూముల మీదా, ఉద్యోగాల ద్వారా వచ్చే ఆదాయంపై ఆధారపడే వారి సంఖ్యే ఎక్కువ. 1951–52 నాటి



■ రాహుల్ కుమార్

బ్రాహ్మణేతరులూ ఆధునిక రంగాల్లో అడుగుపెట్టారు. కానీ గ్రామాలతో, భూములతో సంబంధాలను వదులుకోలేదు. తమిళ బ్రాహ్మణులు మాత్రం వాటిని వదులుకున్నారు. పట్టణ మధ్య–ఎగువ తరగతిగా పూర్తిగా పరివర్తన చెందారు. కానీ కులం స్పృహను వదులుకోలేదు. అవసరమైన చోట పక్షపాత ప్రదర్శననూ వదులుకోలేదు. తమను విశిష్ట వర్గంగా భావించుకోవటమూ మానలేదు. కర్ణాటక సంగీతాన్ని, భరతనాట్యాన్ని అభివృద్ధి చేయటంలోనూ ఆ విశిష్టత కోసం చేసిన ప్రయత్నమే కనపడుతుంది.




కుంబపెట□అగ్రహార గ్రామాన్ని తీసుకుంటే విపరీత అసమానతలతో కూడిన సామాజిక జీవితం స్పష్టంగా కనపడుతుంది. 1827లో ఆ గ్రామ భూములపై మొదటిసారి సర్వే జరిగింది. మొత్తం భూములన్నీ దాదాపుగా బ్రాహ్మణుల చేతుల్లోనే ఉండేవి. 1950ల నాటికి పరిస్థితి చాలా మారింది. కొన్ని భూములు బ్రాహ్మణేతర కులాల చేతుల్లోకి వెళ్లాయి. మరికొంత భూమిని కౌలుకు ఇచ్చారు. అగ్రహారంలో 49 ఇళ్లు ఉండేవి. 1950ల నాటికే కొందరు పట్టణాలకు వలస వెళ్లటంతో 35 ఇళ్లలో 174 మంది మాత్రమే ఉండేవారు. అదే 1871లో 412 మంది అక్కడ నివసించేవారు. అగ్రహార వీధికి దూరంగా 18 కులాల ప్రజలు జీవించేవారు. వీళ్లకు మరికొంత దూరంలో 354 మంది ఆది ద్రవిడులు (దళితులు) ఉండేవారు. వ్యవసాయ కాలం ఆరంభంలో అగ్రహారంలోని రామాలయంలో ఉత్సవాలు జరిగేవి. బ్రాహ్మణేతర రైతులు, కూలీలు ఆలయ ద్వారం బయటే నిల్చొనేవారు. ఆది ద్రవిడులైతే అక్కడికి రావటానికే వీల్లేదు. అదే రోజు సాయంకాలం గ్రామదేవతకూ పూజలు చేసేవారు. బ్రాహ్మణేతర పూజారి వాటిని నిర్వహించేవాడు. రామాలయం నుంచి వచ్చిన హారతిని దేవతకు సమర్పించేవారు. గ్రామదేవత విగ్రహం దగ్గర కూర్చునే గౌరవం మాత్రం బ్రాహ్మణ కుటుంబాలకే దక్కేది. ఇతర కులాలవారు దూరంగా నిల్చొనేవారు. ఆది ద్రవిడులకు ఇక్కడా కూడా నిషేధమే. మిరాశీదారులుగా ఉన్న బలంతోనూ కులవ్యవస్థలోని అగ్రస్థానం కారణంగా అన్ని సందర్భాల్లోనూ బ్రాహ్మణులకే పెద్దపీట వేసేవారు. మిరాశీదార్లు భూముల్లో పనిచేసేవారు కాదు. నాగలిపడితే మహాపాపం అనుకునేవారు. ఇళ్లల్లో అంటూ సొంటూ, మడి సంప్రదాయాన్ని కఠినంగా పాటించేవారు. రైతాంగ కులాల వారిని సైతం వంటింటివైపు రానిచ్చేవారు కాదు. ఆది ద్రవిడులు ఇంటి వెనుక ద్వారం వరకూ మాత్రమే రాగలిగేవారు.

ఇతర కులాలతో బ్రాహ్మణుల సంబంధాలు పరిమితంగా ఉండేవి. అందుకే గ్రామ జీవితంతో తెగతెంపులు చేసుకోవటం వారికి కష్టం అనిపించలేదు. వ్యవసాయం ప్రధాన ఆదాయ వనరైనా అందులో క్రియాశీల పాత్ర లేదు. భూమిపై మమకారం చాలా తక్కువ. అందుకే వలస పోవటంలో అందరికంటే ముందున్నారు. వివిధ ఉద్యోగాల్లో తేలికగా కుదురుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహారాష్ట్ర దేశస్థ బ్రాహ్మణులు తమిళనాడులో తొలుత పట్టుసాధించినా తర్వాత దాన్ని కోల్పోయారు. తెలుగు నియోగ బ్రాహ్మణులు అందుకు ప్రయత్నించినా తమిళ బ్రాహ్మణులతో పోటీ పడలేకపోయారు.

గడిచిన 150 సంవత్సరాల్లో తమిళ బ్రాహ్మణులు వివిధ రంగాల్లో ఎలా పాతుకుపోయారో చూస్తే వాళ్ల మధ్య–ఎగువ తరగతి స్థాయి కొంతైనా అర్థమవుతుంది. 1885–1905 మధ్య లా విద్యార్థుల్లో 70–80 శాతం మంది బ్రాహ్మణులే ఉన్నారు. మరో 15 ఏళ్ల నాటికీ పరిస్థితిలో మార్పులేదు. ఇంజినీరింగులో 74 శాతం ఉన్నారు. అంటూసొంటూ వల్ల వైద్య విద్యలో చేరటానికి మొదట్లో తటపటాయించారు. అయినా 1900 నాటికి వైద్య విద్యలో 30 శాతం బ్రాహ్మణులు ఉన్నారు. మరో 20 ఏళ్లలో అది 60 శాతానికి పెరిగింది. మొత్తం యూనివర్సిటీ విద్యార్థుల్లో బ్రాహ్మణులు 80 శాతం ఉండేవారు. 1921 నుంచి అమలైన రిజర్వేషన్ల వల్ల క్రమేపీ ఈ శాతాల్లో తగ్గుదల నమోదై 1940ల నాటికి 40–50శాతానికి పరిమితమైంది. ఓబీసీ రిజర్వేషన్ల కోటాతో అవకాశాలు తగ్గటంతో బ్రాహ్మణులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలపై దృష్టిపెట్టి వాటిని ఎక్కువే దక్కించుకున్నారు. 1992 వరకూ కేంద్రంలో ఓబీసీ రిజర్వేషన్లు లేవు. ఉద్యోగాల్లోనే గాక వ్యాపార, పారిశ్రామిక, బ్యాంకింగ్ రంగాల్లో కూడా బ్రాహ్మణులు చొచ్చుకెళ్లారు. 1946లో ప్రారంభమైన ఇండియా సిమెంట్ పరిశ్రమ దీనికి ఉదాహరణ. రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటారుబైక్స్‌ను తయారుచేసిన ఈఏఎస్‌యుఎన్ ఇంజినీరింగ్ కంపెనీ కూడా ఈ వర్గానిదే. 1929లో మొదలైన టీవీఎస్ కంపెనీ కూడా వీళ్లదే. ఐటీ కంపెనీల స్థాపనలోనూ కీలక పాత్ర ఉంది. ఇక పైస్థాయి ఐటీ ఉద్యోగాల్లో 40–50 శాతం వాటా వారిదే.

బ్రాహ్మణేతరులూ ఆధునిక రంగాల్లో అడుగుపెట్టారు. కానీ గ్రామాలతో, భూములతో సంబంధాలను వదులుకోలేదు. తమిళ బ్రాహ్మణులు మాత్రం వాటిని వదులుకున్నారు. పట్టణ మధ్య–ఎగువ తరగతిగా పూర్తిగా పరివర్తన చెందారు. కానీ కులం స్పృహను వదులుకోలేదు. అవసరమైన చోట పక్షపాత ప్రదర్శననూ వదులుకోలేదు. తమను విశిష్ట వర్గంగా భావించుకోవటమూ మానలేదు. కర్ణాటక సంగీతాన్ని, భరతనాట్యాన్ని అభివృద్ధి చేయటంలోనూ ఆ విశిష్టత కోసం చేసిన ప్రయత్నమే కనపడుతుంది. ఒకనాడు భరతనాట్యాన్ని దేవదాసీ నృత్యకళగా భావించిన వారే ఇప్పుడు దాన్ని సంప్రదాయానికి చిహ్నంగా భావిస్తున్నారు. ద్రవిడ ఉద్యమాన్ని పోటీ తర్కంతో, దీటైన సిద్ధాంతంతో ఢీకొట్టకుండా చల్లగా మెల్లగా తాము ఒకనాడు తక్కువగా చూసిన వృత్తుల్లోకి ప్రవేశించి సంపూర్ణ మధ్య–ఎగువ తరగతికి ఎగబాకటం ఒక విచిత్రంగానే చెప్పుకోవాలి. అవసరం ఉన్నంతమేరకే సంప్రదాయ సరిహద్దులను దాటే అవకాశవాద ఆధునికతగా దీన్ని చెప్పుకోవాలేమో! దీనికి మినహాయింపు ఎవరన్నదే ఇప్పుడు పెద్ద ప్రశ్నార్థకం!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)



సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.9 కనిష్ఠం 28.1

ప్రధాని రాక సందర్భంగా నేడు, రేపు ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ మంగళవారం నగరంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి రాజ్‌భవన్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాని మంగళవారం రాత్రి 8.35 గంటలకు బేగంపేట

మిగతా 8వ పేజీలో..

అయినా.. అంతే..
తీరు మారేదేలే..!

- తప్పుల తడకగా ఓటరు జాబితా
- క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే తొలగింపు
- గుర్తింపు కార్డులున్నా జాబితాలో పేర్లు మాయం
- పార్లమెంట్ ఎన్నికల వేళ ఓటర్ల మండిపాటు



వినాయక్‌నగర్ డివిజన్ ఓటరు జాబితాలో తప్పులు

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని వినాయక్‌నగర్ డివిజన్ కాకతీయనగర్‌లో 1300మంది వరకు ఓటర్లు ఉండగా మరణించిన పది మందికిపైగా ఓటర్లు పేర్లు ఇప్పటికీ జాబితాలోనే ఉన్నాయి. చిరునామా మారిన, రెండు పర్యాయాలు పేర్లున్న వారు మరో 50 మందికి పైగా ఉన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్‌లోని అంబర్‌పేటలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసిన పలువురి పేర్లు ఇప్పుడు జాబితా నుంచి మాయమయ్యాయి. ఈ నెల 25న విడుదలైన జాబితాలో చెక్ చేసుకోగా, ఓ కుటుంబంలో ఐదుగురికిగాను ఇద్దరి పేర్లు తొలగించారు. మహానగరంలోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. మరణించిన వారి పేర్లు జాబితాలో ఇప్పటికీ కొనసాగుతుండగా.. ప్రతి ఎన్నికల్లో ఓటు వేస్తోన్న

మిగతా 6వ పేజీలో..

కాంగ్రెస్, బీజేపీలను ఓడించండి



కొండాపూర్ రోడ్‌షోలో మాట్లాడుతున్న కేటీఆర్,చిత్రంలో అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

నగరంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచార ఉధృతిని పెంచింది. ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బడంగ్‌పేట, కొండాపూర్‌లలో సోమవారం రాత్రి జరిగిన రోడ్‌షోలలో పాల్గొన్నారు. కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఒక్కటేనని, వాటిని నమ్మొద్దని, వారు తెలంగాణకు చేసిందేమీ లేదని విమర్శలు గుప్పించారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి..



ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం. (ఇన్‌సెట్లో సీఎం రేవంత్‌రెడ్డికి కంటోన్మెంట్‌లో గదను బహూకరిస్తున్న కాంగ్రెస్ నేత, చిత్రంలో మల్కాజిగిరి అభ్యర్థి సునీతారెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు)

ప్రచార ఘట్టం చివరి అంకానికి చేరుకోవడంతో కాంగ్రెస్ దూకుడును పెంచింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నగరంలోని ఉప్పల్ బస్టాండ్ వద్ద, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో, కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం కూడలి వద్ద సోమవారం రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కిషన్‌రెడ్డి నగరానికి చేసిందేమీ లేదని, బీఆర్ఎస్‌కు ఇక భవిష్యత్ లేదని విమర్శించారు.

రోజుకో కండువా.. పూటకో గుర్తు..!



- ప్రచారంలో రంగులు మారుస్తున్న నాయకులు
- ద్వితీయ నేతల నుంచి బస్తీ నేతల వరకు అదేతీరు
- ఓటర్ల కంటే నాయకులపైనే పార్టీల గురి
- ప్రత్యర్థి పార్టీ నేతలపై నజర్
- కండువా కప్పేందుకు చర్చలు



సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఓ బస్తీ సంఘం నాయకులు మొన్నటి వరకు ఓ పార్టీకి మద్దతుగా ప్రచారం చేశారు. రెండు, మూడు రోజులుగా అదే నాయకులు మరో గుర్తుకు ఓటేయాలని కోరుతున్నారు. వ్యక్తులు వారే.. కానీ, వారు కప్పుకొనే కండువాలు.. వేయాలని చెప్పే పార్టీల గుర్తులు మారిపోయాయి.

మల్కాజిగిరి లోక్‌సభలోని ఓ బస్తీ నాయకుడు చెప్పిందే స్థానికులకు వేదం. ఆయన చెప్పిన గుర్తుకే ప్రజలు ఓటు వేస్తారు. దీంతో ప్రధాన పార్టీ అభ్యర్థి ఒకరు ఆయన ద్వారా మంత్రాంగం మొదలు పెట్టారు. ఏం కావాలో చెప్పమంటూ బేరసారాలు పూర్తి చేశారు.

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతోంది. పాదయాత్రలు, అగ్రనేతల రోడ్ షోలతో పాటు.. అంతర్గతంగా బస్తీలు, కాలనీల నాయకులు, ఇతర పార్టీల నేతల మద్దతు కూడగట్టేందుకు అభ్యర్థులు కృషి చేస్తున్నారు. ఓ వైపు ఎండలు మండుతున్నా.. క్షణం తీరిక లేకుండా ఎన్నికల్లో గెలుపునకు పాటుపడుతున్నారు. ప్రచార విరామ సమయంలో బస్తీ, కుల, యువజన సంఘాల గంపగుత్త ఓట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మాకు ఓటు వేస్తే ఏవి ఎస్తాం.. మున్ముందు ఏం చేస్తాం..' అన్నది వివరిస్తూ ఓట్ల కొనుగోలుకు శ్రీకారం చుట్టారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే డిమాండ్ తక్కువగా ఉన్నా.. ఎలాగైనా గెలవాలని పట్టుదల ఉన్న పార్టీలు, అభ్యర్థులు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. స్థానిక సమస్యలను పరిష్కరిస్తామనే హామీలతో పాటు కొన్నిచోట్ల ఓటుకు నోటు ఇచ్చేందుకూ సిద్ధమవుతున్నారు.

హామీల కన్నా.. ప్రలోభంపైనే..

గెలిచాక అది చేస్తాం.. ఇది చేస్తాం అన్న హామీల కంటే ఇప్పటికిప్పుడు ఓట్లు పొందడం ఎలా..? అన్న దానిపై పార్టీలు ప్రధానంగా దృష్టి సారించాయి. ఆయా పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాల్లో స్థానికంగా పలుకుబడి ఉన్న నేతలను వెంట తీసుకెళుతూ ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు కృషి చేస్తున్నారు. పలుకుబడి నేతలు ఏ పార్టీకి చెందిన వారైనా సరే నజరానాలతో తమవైపు తిప్పుకొంటున్నట్లు తెలుస్తోంది. మల్కాజిగిరిలో ఓ పార్టీ అభ్యర్థి భారీగా ఖర్చు చేస్తున్నాడు. పార్టీ కార్పొరేటర్లకు ఖర్చుల నిమిత్తం రూ.10 లక్షల చొప్పున ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అదే నియోజకవర్గంలో మరో అభ్యర్థి యువజన, కాలనీ సంఘాలకు రూ.లక్షల నజరానా ఇస్తున్నారు. కొందరు అభ్యర్థులు కాలనీ సంఘాల ప్రతినిధులకు మందు, విందు ఏర్పాటుచేసి ప్రసన్నం చేసుకునేందుకు తాపత్రయపడుతున్నారు. సికింద్రాబాద్‌లో ఓ అభ్యర్థి పలువురు నమ్మకస్తులకు బస్తీ ఓట్ల కొనుగోలు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

కండువా కప్పి..

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే గ్రేటర్‌లో పార్టీల పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్‌కు చెందిన 14 మంది కార్పొరేటర్లు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, ద్వితీయ శ్రేణి నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకోగా.. ఎల్బీనగర్‌కు చెందిన ఓ కార్పొరేట్ బీజేపీ నుంచి హస్తం గూటికి చేరారు. ఎన్నికల నాటికి ఆ రెండు పార్టీల నుంచి మరికొందరిని చేర్చుకునేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది. డివిజన్ నుంచి రాష్ట్ర స్థాయి నాయకుల వరకు అసంతృప్తులకు గాలం వేసి కండువా కప్పాలని ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్‌లోని కీలక నేతల నమ్మకస్తులు ఇందులో కీలక భూమిక పోషిస్తున్నారు. కార్పొరేషన్ చైర్మన్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తదితర పోస్టులు ఇస్తామని హామీ ఇస్తున్నారు. నాయకుల చేరికతో క్షేత్రస్థాయిలో పరిణామాలూ మారుతున్నాయి.

పోటాపోటీ ప్రచారం



హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ తేదీ దగ్గరపడుతుండడంతో అభ్యర్థుల గెలుపు కోసం కాలనీలు, బస్తీల్లో ద్వితీయశ్రేణి నేతలు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ కరపత్రాలు, స్టిక్కర్లు పంపిణీ చేస్తున్నారు. పార్లమెంట్ పరిధి విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో డివిజన్ల వారీగా నేతలు తమ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం ప్రచారంలో పరుగులు తీస్తున్నారు. అభ్యర్థులు రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌ల్లో, ద్వితీయ శ్రేణి నేతలు బస్తీలు, కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉదయం అభ్యర్థుల ఇళ్ల వద్ద పార్టీ స్థానిక నేతలను కలిపించి.. ఏయే ప్రాంతాల్లో ప్రచారం నిర్వస్తున్నారో అభ్యర్థులకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. బస్తీలు, కాలనీల్లో కొంత మంది పార్టీ నేతలు భోజనాలు పెట్టి మరీ రాత్రుళ్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కొంతమంది డివిజన్ నాయకులు స్థానికంగా ఫ్లెక్సీలు, ప్రచార రథాలతో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన ద్వితీయ శ్రేణినేతలు తమ ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం పోటాపోటీగా ముఖ్యనేతలను పిలిపిస్తూ సభలు, కార్నర్ మీటింగ్ నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఓట్ల కోసం రీల్స్, వీడియోలు

- అభ్యర్థుల 'స్మార్ట్' ప్రచారం



మల్లాపూర్/అల్వాల్, మే6(ఆంధ్రజ్యోతి): ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు కలిసొచ్చే ప్రతి అంశాన్ని వాడుకుంటున్నారు. ఒక వైపు పాతపద్ధతిలో ఇంటింటి ప్రచారం చేస్తూనే మరోవైపు స్మార్ట్‌గా ఆలోచిస్తున్నారు. సోషల్‌మీడియాతో 'స్మార్ట్'గా ప్రచారం చేస్తూ ఓటర్లను తమవైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు. సరికొత్త సినిమా పాటలతో నేతల ప్రచార వీడియోలను 'షార్ట్స్'గా మార్చి వైరల్ చేస్తున్నారు. సెల్‌ఫోన్, కంప్యూటర్లకు అతుక్కునే యువత, మహిళలు, ఉద్యోగ, వ్యాపారులతో బిజీగా ఉండే వారిని ఇట్టే ఆకట్టుకుంటున్నారు. మరోవైపు దీనికి ఖర్చు తక్కువ కావడంతో అభ్యర్థులు సైతం దీనిని నమ్ముకొంటున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా నిత్యం ఓటర్లకు అందుబాటులో ఉంటున్నారు. ఓ ప్రధాన పార్టీ దాదాపుగా 15 లక్షలకు పైగా వాట్సాప్ నెంబర్లను సేకరిస్తే మరో పార్టీ పదిలక్షలకు పైగా వాట్సాప్ నెంబర్లను సేకరించి సోషల్‌మీడియా ప్రచారంలోనూ తిరుగుతలేదనిపిస్తున్నాయి. వాటితో పాటు బ్రాడ్‌కాస్ట్ గ్రూపులకు ఒకేసారి మెసేజ్‌లను పంపించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. యుట్యూబ్ షార్ట్స్, ఆకర్షించే వీడియోస్‌తో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వాట్సాప్ ఇలా ప్రతివేదికలో ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఒక్కో వాట్సాప్ గ్రూప్‌లో రోజుకి పది రీల్స్ చొప్పున అభ్యర్థుల ప్రచారాన్ని వైరల్ చేస్తున్నారు. ప్రతి రీల్స్‌లో కొత్తదనం ఉండేలా.. ప్రసంగాల్లో ముఖ్యమైన అంశాలను ఆకర్షించేలా రీల్స్ చేసి జనం ఫోన్లలోకి వెళ్లేలా చేస్తున్నారు. ఇంటింటి ప్రచారం కాదు.. ఇంట్లోని అందరి సెల్‌ఫోన్స్‌కు ప్రచారం రీచ్ అయ్యేలా చూస్తున్నారు.

ఇంజనీరింగ్ యాజమాన్యాలకు
సెలవుల సెగ 6

నా పనితీరు
నచ్చితేనే ఓటేయ్యండి

- 5ఏళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు చేశా
- కొందరు కుల, మతాల పేరుతో రాజకీయాలు చేస్తున్నారు
- ప్రజలంతా ఆలోచించి ఎన్నికల్లో ఓటు వేయాలి
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి



(ఆంధ్రజ్యోతి,రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): గడిచిన అయిదేళ్ల కాలంలో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఎన్నో అభివృద్ధి పనులు చేశానని, ఈ సారి మళ్లీ గెలిపిస్తే అన్ని విధాలా నియోజకవర్గాన్ని అభివృద్ధిచేస్తానని కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి జి. రంజిత్‌రెడ్డి తెలిపారు.

మిగతా 6వ పేజీలో..



సమావేశంలో అభివాదం చేస్తున్న టీడీపీ నేతలు ఎం.అరవింద్‌కుమార్ గౌడ్, పి. సాయిబాబా, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి తదితరులు

బీజేపీకి టీటీడీపీ మద్దతు

హైదరాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇవ్వాలని టీటీడీపీ నిర్ణయించింది. ఇందులో భాగంగా, టీటీడీపీ నేతలతో బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చర్చలు జరిపారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యుడు అరవింద్ కుమార్ గౌడ్, సీనియర్ నేతలు సాయిబాబా, కాట్రగడ్డ ప్రసూన, శ్రీపతి సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి భేషజాలు పెట్టుకోకుండా ప్రతీ టీడీపీ కార్యకర్త ఈసారి బీజేపీకి ఓటు వేసే విధంగా కృషి చేయాలని చింతల రామచంద్ర రెడ్డి కోరారు. మన ఓటు

మిగతా 6వ పేజీలో..

డబ్బు మాట దేవుడెరుగు...
ప్రాణం పోతే ఎవరిది బాధ్యత 8

మండే 43.8 డిగ్రీలు

- వడగాలులు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
- నేడు, రేపు పలుప్రాంతాల్లో వర్షసూచన

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): మండే ఎండలతో నగరవాసులు అల్లాడిపోతున్నారు. సోమవారం ఉదయం నుంచి వీస్తున్న వడగాలులు, రాత్రి ఉక్కపోతతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. సోమవారం అత్యధికంగా చందానగర్‌లో 43.8 డిగ్రీలు, మూసాపేటలో 43.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వడగాలుల తీవ్రతకు ప్రధానరహదారులపై మధ్యాహ్నం ట్రాఫిక్ తగ్గింది. ఎండలు తగ్గే వరకు అత్యవసరముంటే తప్పా బయటకు రావద్దంటూ డాక్టర్లు సూచిస్తున్నారు. మంగళ, బుధవారాల్లో నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంటుందన్నారు. రెండురోజుల పాటు గరిష్ఠంగా 39, కనిష్ఠంగా 27 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలుంటాయని అధికారులు తెలిపారు.



సోమవారం నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం
చందానగర్	43.8
మూసాపేట	43.7
కుత్బుల్లాపూర్	43.5
షేక్‌పేట	43.4
బీహెచ్ఈఎల్	43.3
రాజేంద్రనగర్	43.3
లంగర్‌హౌజ్	43.1

ఒకరికి 15.. మరొకరికి 54 ఏళ్లు

● టీఎస్‌ఎప్‌సెట్‌కు అతిపిన్న వయసు బాలిక, అతిపెద్ద వయసు మహిళ దరఖాస్తు ● ఇద్దరూ ఇంజనీరింగ్ పరీక్షకే..
● నేడు, రేపు అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ.. ● ఈ నెల 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్‌ఎప్‌సెట్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. మంగళ, బుధవారాల్లో(7, 8 తేదీల్లో) అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షలు.. 9, 10, 11 తేదీల్లో ఇంజనీరింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. సాధారణంగా ఎప్‌సెట్ పరీక్ష రాసేందుకు కనీస వయసు 17ఏళ్లు నిండి ఉండాలి. అయితే, ఈసారి మాత్రం అతిపిన్న వయసున్న పదిహేనేళ్ల బాలిక, అతిపెద్ద వయసున్న 54 ఏళ్ల మహిళ దరఖాస్తు చేయడం విశేషం. వీరిద్దరూ ఇంజనీరింగ్ పరీక్షనే ఎంచుకున్నారు. వీరితో పాటు కొన్ని నెలలు అటూఇటుగా మరో నలుగురు అండర్ ఏజ్, మరికొందరు అప్పర్ ఏజ్ (30 ఏళ్లపైన) అభ్యర్థులు ఎప్‌సెట్‌కు దరఖాస్తు చేసినట్లు సమాచారం. ఎప్‌సెట్‌కు కనీస వయోపరిమితి ఉంది కానీ గరిష్ఠ వయోపరిమితిని ప్రభుత్వం నిర్ణయించలేదు. కాగా, అండర్ ఏజ్‌తో టీఎస్‌ఎప్‌సెట్ దరఖాస్తు చేసిన అభ్యర్థులు ముందుగానే ప్రభుత్వం నుంచి అనుమతి జీవోలు తెచ్చుకున్నారని, గరిష్ఠ వయోపరిమితి లేనందున పెద్ద వయసు వారు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందని సెట్ కోకన్వీనర్ డాక్టర్ వి జయకుమార్‌రెడ్డి తెలిపారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షల కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లో 135 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఈ పరీక్షలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 12,352 మంది, తెలంగాణ నుంచి 88,080 మంది హాజరవుతున్నట్లు ఆయన చెప్పారు. టీఎస్‌ఎప్‌సెట్‌కు ఈ సారి 3.54 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఇంజనీరింగ్ యాజమాన్యాలకు సెలవుల సెగ

● మొన్న జేఎన్‌టీయూ.. నిన్న ఎంజీఐటీ..! ● సెలవులు ప్రకటించాలని విద్యార్థుల ఆందోళనలు


ఎంజీఐటీ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

హైదరాబాద్ సిటీ/నార్సింగ్, మే 6 (ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండలు విద్యార్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కొన్నిరోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 నుంచి 46 డిగ్రీలకు చేరుతుండడంతో యూనివర్సిటీ కాలేజీలు, హాస్టళ్లలో ఉండే విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మరోవైపు శివార్లలోని ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు మండే ఎండలోనే బస్సుల్లో వెళ్లి రాలేకపోతున్నారు. ఇటీవల కొన్ని జిల్లాల్లో వడదెబ్బ తగిలి కొందరు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. బయట పరిస్థితులు ఇంత దారుణంగా ఉన్నప్పటికీ, యూనివర్సిటీల్లోని ఏసీగదుల్లో ఉంటున్న ఉన్నతాధికారులకు, కళాశాలల యాజమాన్యాలకు పట్టకపోవడం విద్యార్థులకు ఆగ్రహాన్ని తెప్పించింది. ఈ క్రమంలో విద్యార్థులు చేస్తోన్న ఆందోళనలతో కొన్ని కళాశాలల యాజమాన్యాలకు సెలవుల సెగ తగులుతోంది. ఎంతసేపటికి క్యాలెండర్ ప్రకారం పనిదినాల లెక్కలు వేస్తున్నారేగానీ, విద్యార్థుల ప్రాణాలేమై పోతాయోనని యూనివర్సిటీ అధికారులు, కాలేజీల యాజమాన్యాలు ఆలోచించడం లేదని బాధిత విద్యార్థులు, తల్లిదండ్రులు ఆక్రోశిస్తున్నారు. గత గురువారం జేఎన్టీయూ కాలేజీ ఇంజనీరింగ్ విద్యార్థులు తమకు సెలవులు కావాలంటూ ప్రిన్సిపాల్ చాంబర్‌ను ముట్టడించగా సోమవారం నుంచి సెలవులు ప్రకటించారు. తాజాగా గండిపేటలోని ఎంజీఐటీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు కూడా కళాశాల ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. వేసవిలో సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహించడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని, ఎండల తీవ్రతకు క్లాస్ రూమ్‌ల్లో ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం సెలవులు ప్రకటించాలని విద్యార్థులు కళాశాల యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

సెలవులు ఇస్తే షోకాజ్ నోటీసులా

అయితే.. యూనివర్సిటీ యాజమాన్యాన్ని సంప్రదించకుండానే జేఎన్‌టీయూ కాలేజీకి వేసవి సెలవులు ప్రకటించిన ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌కు వర్సిటీ ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. దీంతో ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్ల పరిస్థితే ఇలా ఉంటే.. తమంతట తాము సెలవులు ప్రకటిస్తే, యూనివర్సిటీ అధికారుల నుంచి ఎటువంటి చర్యలు ఉంటాయోనని ప్రైవేట్ కాలేజీల ప్రిన్సిపాళ్లు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థుల ఇబ్బందుల నేపథ్యంలో వేసవి సెలవులిచ్చే అంశంపై యూనివర్సిటీ ఉన్నతాధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతున్నారు.

క్యాలెండర్ ప్రకారమే సెలవులు

జేఎన్‌టీయూ క్యాలెండర్ ప్రకారమే సెలవులు ఇస్తాం. ఈ నెల 10 నుంచి వర్సిటీ క్యాలెండర్‌లో సమ్మర్ హాలీడేస్ ఉన్నాయి. ఎండ తీవ్రత కారణంగా వేసవి సెలవులు ఇవ్వాలన్న విద్యార్థుల డిమాండ్‌ను మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లి ఒక నిర్ణయం తీసుకుంటాం.

-ఎంజీఐటీ ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి

పనిదినాలు చాలకుంటే ఆన్‌లైన్ తరగతులు

యూనివర్సిటీ జారీ చేసిన క్యాలెండర్ ప్రకారం ప్రతీ సెమిస్టర్‌కు 90 పనిదినాలు కాలేజీలు పనిచేయాల్సి ఉంటుంది. వేసవి సెలవులు ఇచ్చేందుకు పనిదినాలు సరిపోని పక్షంలో విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించి సర్దుబాటు చేసుకోవచ్చు. ఎంజీఐటీ విద్యార్థుల ఆందోళన విషయమై సదరు కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడి అవసరమైన సూచనలు చేశాం.

- జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు

నా పనితీరు నచ్చితేనే ఓటేయ్యండి

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

ఐదేళ్లలో విరామం లేకుండా పనిచేశా

గడిచిన ఐదేళ్ల కాలంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సమస్యల పరిష్కారం కోసం విరామం లేకుండా పనిచేశాను. ప్రజలు కూడా ఇది గుర్తించారు. అందుకే ప్రచారానికి ఎక్కడకు వెళ్లినా నన్ను ఆదరిస్తున్నారు. సొంతింటి మనిషిలా చూస్తున్నారు. అయిదేళ్లలో ప్రతి మున్సిపాలిటీలో రోడ్లు, స్టేడియంలు,ఆసుపత్రుల నిర్మాణాలకు నిధులు తెచ్చాను. 111జీవో ఎత్తివేయడంలో నా కృషి కూడా ఎంతో ఉంది. కోవిడ్ సమయంలో అసెంబ్లీ నియోజకవర్గానికో అంబులెన్స్ ఇచ్చాను. ఆరోగ్య బస్ ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో వైద్యసేవలు అందించాను. నా వద్దకు ఏదైనా సమస్యతో వచ్చిన వారిని కలిసి వారి సమస్యలను పరిష్కరించాను. ప్రజల ఆదరణ చూస్తే తప్పక మళ్లీ గెలుస్తాననే ధీమా వస్తోంది.

అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లోకి...

చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరాను. అధికారంలో ఉన్న పార్టీలో ఉంటేనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం. గత అయిదేళ్లలో ఎంపీగా నా పనితీరు సీఎం రేవంత్‌రెడ్డికి కూడా తెలుసు. మేమిద్దరం ఉమ్మడి జిల్లాలో ఎంపీలుగా ఉన్నాం. ఇక్కడ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి పూర్తి అవగాహన ఉంది. ఆయన ఆశీస్సులతో పార్లమెంట్‌లో అనేక అభివృద్ధి పనులు చేస్తాను.

నచ్చితేనే ఆదరించండి..

అయిదేళ్ల పాటు నా పనితీరు నియోజకవర్గ ప్రజలు చూశారు. అయిదేళ్ల కాలంలో నియోజకవర్గలో నేను చేసిన అభివృద్ధి నచ్చితేనే ఆదరించి ఓటేయ్యండి అని ప్రజలను కోరుతున్నాను. నా పనితీరు నచ్చకుంటే ప్రశ్నించండి... సమాధానమిస్తాను. నియోజకవర్గాన్ని తాము ఉద్దరిస్తామంటూ ఇపుడు కొందరు వచ్చి వంగి వంగి దండాలు పెడుతున్నారు. మతం, కులం పేరుతో రాజకీయాలు చేస్తున్నారు. ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారు. ఈ విషయంపై ఆలోచించి వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటేయ్యాలి.

పట్టణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

పట్టణ, గ్రామీణ ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తాం. తాండూరులో పరిశ్రమలను దూరంగా తరలించి కాలుష్యబారి నుంచి తాండూరు వాసులను కాపాడతాం. వికారాబాద్‌ను మరింత అభివృద్ధిచేసేందుకు ప్రయత్నిస్తాను. ఉమ్మడి రంగారెడ్డిజిల్లా అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి వద్ద మంచి రూట్‌మ్యాప్ ఉంది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ఉమ్మడి జిల్లాకు తాగు, సాగునీరు తీసుకువస్తాం. అలాగే మూసి ప్రక్షాళన చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మెట్రోరైలు ప్రాజెక్టును శంషాబాద్ ఎయిర్ పోర్టు వరకు విస్తరించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. భవిష్యత్తులో దీన్ని కందుకూరు వరకు పొడిగించేయత్నం చేస్తున్నాం.

అయినా.. అంతే..!

(5వ పేజీ తరువాయి)

పలువురి పేర్లు మాయమయ్యాయి. చిరునామా మారిన లక్షలాది మంది పేర్లు ఇప్పటికీ జాబితాలోనే ఉన్నాయి. కొందరి పేర్లు ఒకే నియోజకవర్గంలో రెండు, మూడు ప్రాంతాల్లోని జాబితాల్లో ఉండడం గమనార్హం. ఇక వేర్వేరు నియోజకవర్గాల్లో పేర్లున్న వారి సంఖ్య భారీగానే ఉంటుంది. ప్రతియేటా సమ్మరి రివిజన్‌లో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నామని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతుంటారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ జాబితా ఆధారంగా ఓటర్లు ఆ చిరునామాలో ఉంటున్నారా..? లేదా.. అన్నది పరిశీలిస్తున్నామంటారు. మరణించిన వారి వివరాలు సేకరించి కుటుంబ సభ్యుల సంతకంతో సిబ్బంది పేర్లు తొలగిస్తున్నారని పేర్కొంటారు. కానీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. క్షేత్రస్థాయిలో కనీస పరిశీలన లేకుండానే ఇష్టానికి పేర్లు తొలగిస్తున్నారనేందుకు ప్రస్తుత ఓటర్ జాబితా నిదర్శనం.

గుర్తింపు కార్డులున్నా..

అసెంబ్లీ, పార్లమెంట్, జీహెచ్‌ఎంసీ ఎన్నిక ఏదైనా నగరంలోని పలు ప్రాంతాల్లో ఓటరు గుర్తింపు కార్డులు పట్టుకొని పౌరులు పోలింగ్ కేంద్రాల వద్ద నిరసన వ్యక్తం చేస్తుంటారు. తమ పేర్లు జాబితాలో లేవని, మొన్నటి ఎన్నికల్లో ఓటు వేశాం.. ఇప్పుడు ఎందుకు తొలగించారో..? అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. అయితే, ఈ ఎన్నికలో ముందే ఆ పరిస్థితి కనిపిస్తోంది. పోలింగ్ బూత్‌ల వారీగా పలు రాజకీయ పార్టీలు ఓటరు జాబితాను పరిశీలిస్తుండగా.. విస్తుగొలిపే విషయాలు బయటపడుతున్నాయి. వినాయక్‌నగర్‌లో ఓ మహిళ, మరో యువకుడి పేర్లు జాబితాలో పక్కపక్కనే రెండుసార్లు ఉండడం గమనార్హం. మరణించిన, చిరునామా మారిన వారి పేర్లు ఇంకా జాబితాలో ఉన్నాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గతేడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 5.41 లక్షల ఓటర్ల పేర్లు తొలగించినట్లు జీహెచ్‌ఎంసీ ప్రకటించింది. ఇందులో చిరునామా మారిన, మరణించిన, రెండు, మూడు చోట్ల పేర్లున్నవి తీసేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో పలువురి పేర్లు జాబితా నుంచి మాయమయ్యాయని స్థానికులు చెబుతున్నారు. సికింద్రాబాద్, గోషామహల్, ఖైరతాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల పరిధిలో ఇలాంటి విషయాలు మా దృష్టికి వస్తున్నాయని పార్టీల నేతలు పేర్కొన్నారు.

హైదరాబాద్ జిల్లాలో తొలగించిన ఓటర్ల వివరాలు..
- మరణించిన ఓటర్లు - 47,141
- చిరునామా మారినవి - 4,39,801
- డూప్లికేట్ - 54,529

మొత్తం 5,41,201

నేటి నుంచి పలు మార్గాల్లో 24 రైళ్ల రద్దు

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ కారణాలతో మంగళవారం నుంచి గురువారం వరకు పలు ఎంఎంటీఎస్ సహా మొత్తం 24 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్‌వో రాకేశ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేడ్చల్-హైదరాబాద్, సికింద్రాబాద్-మేడ్చల్, కాచిగూడ-మహబూబ్‌నగర్, కాచిగూడ-రాయచూర్, కాచిగూడ-కరీంనగర్, బోధన్-కరీంనగర్, సికింద్రాబాద్-సిద్ధిపేట, మెదక్-కాచిగూడ మార్గాల్లో పలు సర్వీసులు రద్దయ్యాయని తెలిపారు. కాగా, ఈ నెల 8న కాచిగూడ-రాయచూర్, జడ్చర్ల-రాయచూర్ సర్వీసులను పాక్షికంగా రద్దు చేసినట్లు తెలిపారు.

బీజేపీకి టీటీడీపీ మద్దతు

(5వ పేజీ తరువాయి)

ఇతర పార్టీలకు వేస్తే ఉభయులకునష్టం చేకూరుతుందని, ఏపీలో చంద్రబాబు సీఎం కావాలని ఆయన ఆకాంక్షించారు. సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి టీడీపీ మద్దతు ఇవ్వడం శుభపరిణామం అన్నారు. ఈనెల 10వ తేదీన ప్రధాని మోదీ హైదరాబాద్‌కు రానున్నారని, ఆరోజు బహిరంగసభకు తెలుగుదేశం శ్రేణులు పెద్ద ఎత్తున రావాలని ఆయన కోరారు.

కిషన్‌రెడ్డి గెలుపునకు టీడీపీ కృషి

రాంనగర్/అమీర్‌పేట: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి అభ్యర్థి జి. కిషన్‌రెడ్డి గెలుపునకు టీడీపీ కృషి చేస్తుందని పొలిట్ బ్యూరో సభ్యుడు ఎం. అరవింద్‌కుమార్ గౌడ్ తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు తెలంగాణలో బీజేపీతో టీడీపీ ఈ ఎన్నికల్లో కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ఎంపీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులకు టీడీపీ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సోమవారం దోమలగూడలోని టీడీపీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డికి మద్దతుగా టీడీపీ నగర అధ్యక్షుడు పి. సాయిబాబా అధ్యక్షతన సమావేశం జరిగింది.



బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

రాజేంద్రనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు అడికె మహేందర్, అడికె రాజు, సంరెడ్డి ప్రమోద్‌రెడ్డి, అక్కెం జయశంకర్ యాదవ్ అన్నారు. సోమవారం మైలార్‌దేవుపల్లి డివిజన్ లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ, బాలాజీ నగర్, గణేశ్‌నగర్, కాటేదాన్ తదితర ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుకు ఓటు వేసి విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శీలం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థులకు

వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా మద్దతు

చార్మినార్, మే 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులకు వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా మద్దతు తెలుపుతుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రతినిధులు సయ్యద్ ఖాసిం రసూల్ ఇలియాసి, మొహమ్మద్ వసీం, ఖలీద్ నూర్, మహమ్మద్ రియాజ్ తెలిపారు. చార్మినార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 16 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు, హైదరాబాద్‌లో మజ్లిస్‌కు మద్దతు తెలుపుతున్నామని పేర్కొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రతినిధులు

రాజేంద్రనగర్ అభివృద్ధికి కృషి

● కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

నార్సింగ్, మే 6 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఏ-బ్లాక్ అధ్యక్షుడు డప్పు నవీన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ గంధంగూడ నుంచి హైదర్షాకోట్ చౌరస్తా వరకు జరిగింది. ముఖ్యఅతిథులుగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, టీఎమ్ఆర్ఈఐఎస్ అధ్యక్షుడు ఎండీ ఫాహీమ్ ఖురేషీ, రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు.

బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో రంజిత్‌రెడ్డి లక్ష ఓట్ల మెజారిటీ వస్తుందన్నా ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో నిరుపేద కుటుంబాలకు 5000 పక్కా ఇళ్లు కటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజీవ్, ప్రేమ్‌కుమార్, లత ప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, టింకురెడ్డి, చంద్రశేఖర్, అస్లాం, రాజిరెడ్డి, సంగారెడ్డి, నరేందర్, మాజీ సర్పంచ్ హరికృష్ణ, సుధాకర్, బొగల శ్రీను, పీఎస్ కుమార్, బొర్రా జ్ఞాన్ అభిలాష్, గంగని అరుణ్, హరికృష్ణ, గణేశ్, ప్రవీణ్, అమీన్, ప్రేమ్, మక్బూల్ పాల్గొన్నారు.



ర్యాలీలో రంజిత్‌రెడ్డి, బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఫాహీమ్ ఖురేషీ తదితరులు



తయ్యబా కాలనీలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రంజిత్‌రెడ్డి గెలుపునకు కృషి చేయండి

రాజేంద్రనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి గెలుపునకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం బుద్వేల్‌లో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మోదీ హటావో.. దేశ్‌కు బచావో.. ఆప్ కి బార్ ఇండియా కూటవి' అన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారన్నారు. జన్‌ధన్ పథకం ద్వారా ప్రతి పేదవాడి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని అమలు చేయలేదన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో నినాదం టీవీ ప్రకటనలు, పేపర్‌లకే పరిమితమైందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు ఎక్కువయ్యాయన్నారు. రైతుల పాలిట శాపంగా మారిన నరేంద్రమోదీని గద్దె దించాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. కార్మిక, రైతు చట్టాలను రద్దు చేసి వారి బతుకులను ఆగం చేసిన మోదీకి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.ఎ. రియాజ్, గండిపేట్ మండల కార్యదర్శి బాబురావు, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎస్.మల్లేశ్ స్వామి, కార్యాలయం కార్యదర్శి జి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

పహాడిషరీఫ్, మే 6 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మజ్లిస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని సరూర్‌నగర్ మండల ప్రజాపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఒమర్‌బామ్ తెలిపారు. సోమవారం తయ్యబాకాలనీలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మజ్లిస్, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అలీమ్, హనీఫ్, నయీమ్, ఆరిఫ్ హష్మీ, అక్బర్, ఆరిఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకుడు మల్లేష్

బీఆర్ఎస్ ముఖ్య నాయకుడు బీజేపీలో చేరిక

హిమాయత్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): హిమాయత్‌నగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకుడు మల్లేష్ సోమవారం బీజేపీలో చేరాడు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థిగా పోటీ చేస్తున్న జి.కిషన్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డి గెలుపునకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ మహిళా నేత జ్యోతిరెడ్డి

హిమాయత్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ నియోజకవర్గం బీజేపీ సీనియర్ మహిళా నేత జ్యోతిరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జ్యోతిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు, సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపునకు తనవంతు కృషి చేస్తానన్నారు.



దీపాదాస్ మున్షీతో జ్యోతిరెడ్డి

నేడు రాజేంద్రనగర్‌లో మందకృష్ణ బహిరంగ సభ



నవజ్యోతి యూత్ క్లబ్ మైదానంను పరిశీలిస్తున్న బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

రాజేంద్రనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): నవజ్యోతి యూత్ క్లబ్ ఆవరణలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన బహిరంగ సభ నిర్వహిస్తున్నామని బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. సోమవారం నవజ్యోతి యూత్ క్లబ్ గ్రౌండ్స్‌ను బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ ఎన్.మల్లారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ పి.మల్లేశ్ యాదవ్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.బాబూరావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మద్దిలేటి, రావుగళ్ల బాబు తదితరులు పరిశీలించారు.

బహదూర్‌పురాలో కార్డన్ సెర్చ్

మదీన, మే 6 (ఆంధ్రజ్యోతి): కిషన్‌బాగ్‌లో ఆదివారం రాత్రి బహదూర్‌పురా పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగురు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో న్యూసెన్స్ చేయడం, భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కార్డన్ సెర్చ్‌లో అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్, ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ తదితరులు

దోపిడీ కేసులో నలుగురికి జరిమానా

బర్కత్‌పుర, మే 6 (ఆంధ్రజ్యోతి): దోపిడీ కేసులో నలుగురు నిందితులకు సికింద్రాబాద్ రైల్వే కోర్టు జరిమానా విధించింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. 2020 జూలై 12న తలాబ్‌కట్ట ప్రాంతానికి చెందిన అమీర్‌ఖాన్ యాకుత్‌పుర రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా అదే ప్రాంతానికి చెందిన సోహేల్(25), ఫాయాజ్(23), ఇస్మాయిల్(28), అజారుద్దీన్(25) అతడిపై దాడి చేసి రెండు సెల్‌ఫోన్‌లు, రూ. 2 వేలు లాక్కొని పారిపోయారు. బాధితుడు కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి ఎండీ గౌస్‌పాషా నిందితులకు ఒక్కొక్కరికి మూడువేల రూపాయల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారని సీఐ తెలిపారు.

మెసేజ్ లింక్ పంపించి రూ. 3.47 లక్షలు కాజేత

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): మెసేజ్ లింక్ పంపించి వ్యాపారి ఖాతా నుంచి రూ. 3.47 లక్షల కాజేశారు సైబర్ నేరగాళ్లు. నగరానికి చెందిన వ్యాపారి మొబైల్‌కు ఓటీపీ నంబర్లతో కూడిన మెసేజ్ వచ్చింది. లింక్‌ను క్లిక్ చేస్తే, యాప్ ద్వారా వెబ్‌సైట్ ప్రత్యక్షమైంది. తర్వాత మీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతా పిన్ నంబర్ విజయవంతంగా మారిందని సందేశం వచ్చింది. ఓటీపీ మార్చిన సైబర్ నేరగాళ్లు తర్వాత పలు దఫాలుగా అతడి ఖాతా నుంచి డబ్బులు కాజేశారు. బాధితుడికి బైజూస్, గో ఐబిబో, ఎం.షాప్‌టీజీ, రమ్మీవైసీ, హౌసింగ్, అమెజాన్, జెప్టాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో డబ్బు ట్రాన్స్‌ఫర్ అయిందని సందేశాలు వచ్చాయి. ఇలా బాధితుడి ఖాతా నుంచి పలు దఫాలుగా రూ. 3.47 లక్షలు కాజేశారు. దాంతో బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు ప్రారంభించారు.

ఆశీర్వదించండి : పద్మారావుగౌడ్


రెజిమెంటల్‌బజార్, మే 6 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తానని బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి టి. పద్మారావుగౌడ్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ ఎస్‌పీజీ చర్చి పారిష్ హాల్‌లో తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంలో పద్మారావుగౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రైస్తవ మైనారిటీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందని గుర్తు చేశారు. చర్చిలు, క్రైస్తవుల శ్మశానవాటికల అభివృద్ధి చేసిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని ఆయన కోరారు. రాజీవ్‌సాగర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని, మైనారిటీలకు అండగా నిలిచిందన్నారు. బీజేపీ గెలిస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని ఆరోపించారు. కార్యక్రమంలో సీఎస్ఐ, మెథడిస్ట్, బాప్టిస్ట్, సాల్వేషన్ ఆర్మీ, క్యాథలిక్ అసోషియేషన్, దళిత సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు లెనార్డు, దినకరన్, ఆనంద్‌కుమార్, సుదర్శన్, బిషప్ జాకబ్, గడ్డం సాల్మన్, జాన్ రవీంద్ర, రాబర్ట్ సూర్యప్రకాశ్, సునీల్, డేవిడ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మారావుగౌడ్‌కు ఎన్ఆర్ఐల మద్దతు

పద్మారావుగౌడ్‌కు ఎన్ఆర్ఐలు మద్దతు ఇస్తున్నారని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కుర్మాచలం అన్నారు. సోమవారం సికింద్రాబాద్‌లో పద్మారావు గౌడ్‌ను కలిసి ఎన్ఆర్ఐలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కుర్మాచలం మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో హైదరాబాద్ అభివృద్ధి చెందిందని అన్నారు. పద్మారావు గౌడ్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ యూకే అధ్యక్షుడు అశోక్‌గౌడ్ దూసరి, శ్రీనివాస్ వల్లాల, మామిడాల ప్రశాంత్ తదితరులు ఉన్నారు.



క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పద్మారావు గౌడ్



శంషాబాద్‌లో జరిగిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రోడ్ షోలో ప్రకాశన్న యువసేన అధ్యక్షుడు టి.రాము గౌడ్ తదితరులు

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి

రాజేంద్రనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ప్రకాశన్న యువసేన అధ్యక్షుడు టి. రాముగౌడ్ కోరారు.

సోమవారం సాయంతం శంషాబాద్‌లో జరిగిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రోడ్ షోకు మైలార్‌దేవుపల్లి డివిజన్ నుంచి ప్రకాశన్న యువసేన ఆశ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

ఈ సందర్భంగా రాముగౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. కారు గుర్తుకు ఓటేసి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలని కోరారు. కేటీఆర్ రోడ్‌షోకు వెళ్లిన వారిలో నాయకులు పడమటి శ్రీధర్‌రెడ్డి, ఎం.ప్రభాకర్‌రెడ్డి, బాస శ్రీనివాస్, గుమ్మడి కుమార్ తదితరులు ఉన్నారు.

దాసరి పేరిట పురస్కారాల ప్రదానం అభినందనీయం

రవీంద్రభారతి, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలుగు చలనచిత్ర రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని ఈతరం యువతకు ఆదర్శంగా నిలిచిన దాసరి నారాయణరావు జీవితం స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. సోమవారం కళాదర్బార్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎలిమెంట్స్ ఎలైట్ స్టూడియోలో డాక్టర్ దాసరి నారాయణరావు 77వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. నిర్మాత శివకంఠమనేనికి పురస్కారం అందజేసి సన్మానించారు. కళా సామ్రాట్ పొత్తూరి రంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అతిథులుగా ప్రవీణ్‌కుమార్, ఆర్. వేంకటేశ్వరరావు, నాగజ్యోతి, వంశీరామరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. దాసరి పేరిట పురస్కారాలు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. తెలుగు సినీ రంగంలో మరిచిపోలేని మహా మనిషి దాసరి అని కొనియాడారు. సభకు ముందు గాయనీగాయకులచే నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. దాసరి సినిమాల్లోని గీతాలను ఆలపించి ఆకట్టుకున్నారు.



నిర్మాత శివకంఠమనేనికి పురస్కారం అందజేసిన అతిథులు

జల్సాల కోసం బైక్‌ల చోరీ

● ఇద్దరు నిందితుల అరెస్ట్

● 14 ద్విచక్రవాహనాలు స్వాధీనం

మదీన, మే 6 (ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం బైక్‌లను దొంగిలిస్తున్న ఇద్దరు వ్యక్తులను సౌత్‌ఈస్ట్ టాస్క్‌ఫోర్స్, చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 7 లక్షల విలువ చేసే 14 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బషీర్‌బాగ్‌లో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ టి. స్వామి, చాంద్రాయణగుట్ట ఏసీపీ మనోజ్‌కుమార్ వివరాలు వెల్లడించారు.

బార్కస్ సలాల నబీల్ కాలనీకి చెందిన షమ్స్ హబీబ్ కుమారుడు షమ్స్ బిలాల్(26) ఆటోడ్రైవర్. మాసబ్‌ట్యాంక్ విజయ్‌నగర్ కాలనీకి చెందిన ఆర్.శ్రీనివాస్ కుమారుడు రాసూరి సుకేశ్వర్ అలియాస్ లోకేశ్ (23) ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తున్నాడు. వీరిద్దరూ స్నేహితులు. జల్సాలకు అలవాటుపడిన వీరు డబ్బు కోసం బైక్‌లను దొంగిలించాలని నిర్ణయించుకున్నారు. పథకంలో భాగంగా నాలుగు నెలల కాలంలో సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధుల్లో 14 బైక్‌లను దొంగిలించారు.

కేసు నమోదవడంతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ గురునాథ్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపిస్తున్న అడిషనల్ డీసీపీ టి. స్వామి, ఏసీపీ మనోజ్‌కుమార్



మాట్లాడుతున్న విరసం నేత వేణుగోపాల్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలి

రాంనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపాలని, శాంతి నెలకొల్పి పాలస్తీనా ప్రజల హక్కులను కాపాడుకోవాలని విరసం నేత వేణుగోపాల్ పేర్కొన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధోన్మాదదాడి, అమెరికా యూనివర్సిటీలో విద్యార్థుల పోరాటం, పోలీసుల నిర్బంధం అనే అంశం పై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. పాలస్తీనాలో మతపరంగా ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. మదీనా, మక్కా తర్వాత ముస్లిం సమాజానికి అలాక్ మసీదు పవిత్రమైందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ కార్యదర్శివర్గ సభ్యులు హన్మేష్, ప్రజాసంఘాల నాయకులు ప్రదీప్, ఎస్. నాగేశ్వరరావు, ఆజాద్, ప్రవీణ్, పృథ్వీ, నరేందర్, అనిల్, హరీష్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

యాప్ ద్వారా డబ్బు

● మోసానికి యత్నించిన యువకుడి అరెస్ట్

బంజారాహిల్స్, మే 6 (ఆంధ్రజ్యోతి): సహాయం చేసేందుకు ముందుకొచ్చిన ఉద్యోగిని యాప్ ద్వారా డబ్బు పంపించినట్టు మోసం చేసేందుకు యత్నించిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీనగర్‌కాలనీలో ఓ పెట్రోల్ బంక్‌లో జి.మహేష్‌బాబు క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు.

ఈనెల 5వ తేదీన ఓ యువకుడు వచ్చి యాప్ ద్వారా డబ్బు పంపిస్తాను.. నగదు కావాలని అడిగాడు. మహేష్ అంగీకరించకపోవడంతో ఆస్పత్రి పనిమీద వచ్చానని, నగదు లేదని బతిమిలాడాడు. దీంతో మహేష్ అతడికి రూ. 12 వేలు ఇచ్చి ఆ డబ్బును స్కానర్ ద్వారా పంపించాలని కోరాడు. నకిలీ యాప్‌లో డబ్బు పంపించినట్టు యువకుడు చూపించాడు. మహేష్ ఫోన్‌లో ఖాతా పరిశీలించగా డబ్బు వచ్చినట్టు కనిపించలేదు. మోసం జరిగిందని గ్రహించిన అతడు ఆ యువకుడిని పట్టుకొని తాను ఇచ్చిన నగదు లాక్కొని అతడిని పోలీసులకు అప్పగించాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బకు యాచకుడి మృతి

మదీన, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎండవేడికి తట్టుకోలేక ఓ వ్యక్తి మృతి చెందాడు. బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో మెట్రో థియేటర్ చౌరస్తాలో ఓ వ్యక్తి(35) కొంతకాలంగా భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. వడదెబ్బకు సోమవారం మెట్రో థియేటర్ ఎదురుగా ఫ్లైఓవర్ కింద మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వడదెబ్బకు మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి చేతిపై కురుమూర్తి అని పచ్చబొట్టు ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జల్‌పల్లి చెరువులో గల్లంతయిన

ఇద్దరు యువకుల మృతదేహాలు వెలికితీత

పహాడిషరీఫ్, మే 6 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి చెరువులో గల్లంతయిన ఇద్దరు యువకుల మృతదేహాలను పోలీసులు బయటకు తీశారు. పహాడిషరీఫ్ ఎస్ఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రకుంట బార్కస్‌కు చెందిన ఐదుగురు యువకులు జల్‌పల్లి చెరువులో చేపల వేటకు ఆదివారం ఉదయం వెళ్లారు. చెరువులోగల గుండుపై నిలబడి అబ్దుల్ వహెహెద్, ఉస్మాన్ నహది, మరో యువకుడు చేపలు పడుతున్నారు. కాలుజారి ముగ్గురూ చెరువులో మునిగిపోయారు. ఒడ్డుపై ఉన్న ఇద్దరిలో ఈత వచ్చిన యువకుడు చెరువులో దిగి ఒకరిని రక్షించాడు. అబ్దుల్ వాహెద్, ఉస్మాన్ నహది మునిగిపోయారు. సోమవారం ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది చెరువులో గాలించి ఇద్దరి మృతదేహాలను వెలికితీసి ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

తప్పిపోయిన చిన్నారులు కుటుంబ సభ్యులకు అప్పగింత

మంగళ్‌హట్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఇంటిముందు ఆడుకుంటూ తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను ఆబిడ్స్ పోలీసుల 12 గంటల వ్యవధిలోనే గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మురళీనగర్‌బాగ్ ప్రాంతానికి చెందిన చరణ్‌కుమార్(10), వినయ్ కుమార్ (8) తల్లిదండ్రులు చనిపోవడంతో మేనమామ శ్రీనివాస్ వద్ద ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం ఇంటి ఎదుట ఆడుకుంటూ కనిపించకుండాపోయారు. వారి ఆచూకీ లభించకపోవడంతో శ్రీనివాస్ ఆబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా చిన్నారులు బస్సెక్కి మారేడ్‌పల్లి వెళ్లినట్లు గుర్తించారు. వారిని ఆబిడ్స్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి శ్రీనివాస్‌కు అప్పగించామని ఇన్‌స్పెక్టర్ గోపాల్‌రెడ్డి తెలిపారు.

ఎన్నికల సిత్రాలు



తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న కాంగ్రెస్ భువనగిరి పార్లమెంటు అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సతీమణి డింపుల్‌రెడ్డి - హయత్‌నగర్ (ఆంధ్రజ్యోతి)



సుభాష్‌నగర్ డివిజన్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి ఓటు వేయాలని ఓ వృద్ధురాలిని అభ్యర్థిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ - జీడిమెట్ల (ఆంధ్రజ్యోతి)



అంబర్‌పేటలో చేపలు అమ్మే మహిళకు సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి కమలం పువ్వు గుర్తును చూపుతున్న బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ - అంబర్‌పేట (ఆంధ్రజ్యోతి)



మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా ఉప్పల్ నియోజకర్గం మల్లాపూర్‌లోని ఓ హోటల్‌లో దోసె వేసి ప్రచారం చేస్తున్న మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి మల్లాపూర్, మే6(ఆంధ్రజ్యోతి)

ఇంటింటి ప్రచారంలో బిజీబిజీ

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో ఆయా పార్టీల అభ్యర్థులు, మద్దతుదారులు, పార్టీల నాయకులు తమ పార్లమెంట్ నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి వినూత్నంగా ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఇండియన్ నేవీకి సీఆర్‌ఎన్-91 యుద్ధట్యాంక్‌లు

● ఒప్పందం కుదుర్చుకున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్



బిభూతి రంజన్‌తో ఒప్పందం కుదుర్చుకుంటున్న పి.బాట్జీ

అల్వాల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్ ఆర్మర్డ్ వెహికిల్ నిగమ్ లివిటెడ్(ఏవీఎన్ఎల్) రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పడిన డిఫెన్స్ పబ్లిక్ సెక్టర్ అండర్ టేకింగ్ పరిధిలో ఐదు ఉత్పత్తి యూనిట్లలో ఒకటిగా ఏవీఎన్ఎల్ ఉంది. దేశ రక్షణ అవసరాల కోసం ఉపయోగపడే ప్రధాన యుద్ధ ట్యాంక్‌లతో సహా ఆర్మర్డ్ ఫైటింగ్ వాహనాల తయారీలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఏవీఎన్ఎల్ టీ-90 ట్యాంక్, టీ-72 ట్యాంక్, బీఎంపీ-2(శరత్ ట్యాంక్) ఎంబీటీ అర్జున్ యుద్ధ ట్యాంక్‌లను తయారు చేశారు. ముఖ్యంగా సాయుధ దళాల అవసరాలను తీర్చడానికి సీఆర్‌ఎన్-91(క్లోజ్ రేంజ్ నావల్)కి చెందిన 10 యుద్ధట్యాంక్‌లను ఇండియన్ కోస్ట్‌గార్డ్, ఇండియన్ నేవీకి సరఫరా చేస్తుంది. దీనికి సంబంధించి సోమవారం మెదక్ యూనిట్‌తో న్యూఢిల్లీలోని కోస్ట్‌గార్డు హెడ్‌క్వార్టర్స్‌లో ఇండియన్ ఆర్డినెన్స్ ఫాక్టరీ సర్వీసెస్ (ఐఓఎఫ్ఎస్) జనరల్ మేనేజర్ పి.బాట్జీ ఇండియన్ నేవీతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

ఐఎస్‌సీ, ఐసీఎస్ఈ ఫలితాల్లో హెచ్‌పీఎస్ హవా

● వందశాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు

బేగంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ (ఐఎస్‌సీ), ఇండియన్ సిర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యూకేషన్ (ఐసీఎస్ఈ) పరీక్షల్లో బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్(హెచ్‌పీఎస్) విద్యార్థులు సత్తాచాటారు. ఈ మేరకు పరీక్ష రాసిన విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఐఎస్‌సీ సైన్స్ స్ట్రీమ్‌లో కాకి హర్షిత 93.80 (469/500) శాతం సాధించి హెచ్‌పీఎస్ టాపర్‌గా నిలిచారని తెలిపారు. అలాగే హ్యూమానిటీస్ స్ట్రీమ్‌లో మైలపల్లి రాణి ధన్యరూప 93.40 (467/500) శాతంతో అగ్రస్థానంలో, భవ్యగార్గ్ 93 శాతం (465/500)తో రెండో స్థానంలో నిలిచారని తెలిపారు. కామర్స్ స్ట్రీమ్‌లో వంశిక సంచేత 91.40 (457/500) శాతంతో ప్రథమ స్థానంలో నిలిచారు. ఐసీఎస్ఈ ఫలితాల్లో అర్జున్‌రావు 98.3 శాతంతో అగ్రస్థానంలో నిలిచారు. 97.2 శాతంతో యార్లగడ్డ హర్షశ్రీ విష్ణు, శ్రియాన్స్ బాల్, సిద్ద బహేతి తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఐఎస్‌సీ, ఐసీఎస్ఈ రాసిన విదార్థులందరూ మెరుగైన స్కోరును సాధించినట్లు వారు పేర్కొన్నారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో అజితారెడ్డి తదితరులు

విజువల్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్ గ్రాఫికో 2024

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): పంజాగుట్టలోని హ్యామ్‌స్టెక్ కాలేజీ తమ కళాశాలలో వార్షిక డిజైన్ ఈవెంట్ గ్రాఫికోను సోమవారం నిర్వహించింది. ఈ సందర్భంగా కళాశాల ఫౌండర్ అజితారెడ్డి మాట్లాడుతూ గ్రాఫిక్స్ గురు కైలాష్ నాయక్ మార్గనిర్దేశకత్వంలో విద్యార్థులు ఈ గ్రాఫిక్స్ చేశారని తెలిపారు. తమ ప్రొఫెషనల్ నైపుణ్యం ప్రదర్శించుకునే అవకాశాన్ని గ్రాఫికో ద్వారా అందించామన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కైలాష్ నాయక్ తో పాటుగా యుఎక్స్ గ్రాఫిక్ డిజైనర్ శాంసన్ తెన్నెల తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు స్పెషల్ టీంలు

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో రికార్డుస్థాయిలో 90 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ నమోదయ్యింది. నిరంతర విద్యుత్ సరఫరా, అంతరాయాల సత్వర పరిష్కారానికి స్పెషల్ టీంలను విద్యుత్‌శాఖ నియమించింది. సర్కిళ్లకు సీజీఎంలు, డివిజన్లకు డీఈలను నియమించారు. మొదటిసారిగా అకౌంట్స్ అధికారులను కూడా ఆపరేషన్‌వింగ్ విధుల్లో భాగస్వామ్యం కల్పించారు. విద్యుత్ డిమాండ్ తగ్గే వరకు 24 గంటలు షిఫ్టుల వారీగా విద్యుత్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ ఆదేశాలు జారీచేశారు. విద్యుత్ సరఫరా ఆపరేషన్ వింగ్‌లో అన్ని విభాగాల అధికారులను భాగస్వామ్యం చేయడం విద్యుత్‌సంస్థలో ఇదే మొదటిసారని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

'వేముల రోహిత్ మృతిపై పునర్ విచారణ జరిపించాలి'

బర్కత్‌పుర, మే 6 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ యూనివర్సిటీలో చనిపోయిన వేముల రోహిత్ మృతిపై రాష్ట్ర ప్రభుత్వం పునర్ విచారణ జరిపించాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి డిమాండ్ చేసింది. కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు కేవై రత్నం, జి.విజయ్, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి జాతీయ కన్వీనర్ బండారి లక్ష్మయ్య తదితరులు మాట్లాడారు. వేముల రోహిత్ బలవన్మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వేముల రోహిత్ మరణంపై పునర్ విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, అతడు దళితుడే అని రుజువవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట సమితి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి. రాజు, జె. చక్రవర్తి, సావిత్రీబాయి పూలే మహిళా సంఘం ప్రతినిధులు ఇ.సైదమ్మ, చైతన్య భారతి, అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు గోస్వామి, ప్రజ్వల్ పాల్గొన్నారు.

ప్రధాని రాక సందర్భంగా నేడు, రేపు ట్రాఫిక్ ఆంక్షలు

(5వ పేజీ తరువాయి)

ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రాజ్‌భవన్‌కు వెళతారు. ఈ సందర్భంగా రాత్రి 8.30 గంటల నుంచి 9.10 గంటల వరకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి పీఎన్‌టీ ఫ్లైఓవర్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, మోనప్ప ఐలాండ్, రాజ్‌భవన్ వరకు వాహనాలను అనుమతించరు. అదే విధంగా మే 8 బుధవారం ఉదయం 8.35 గంటలకు ప్రధాని మోదీ రాజ్‌భవన్ నుంచి బేగంపేట విమానాశ్రయానికి వెళతారు. ఈ సందర్భంగా మోనప్ప ఐలాండ్, నుంచి బేగంపేట ఎయిర్‌పోర్ట్ వరకు సాధారణ వాహనాలను అనుమతించరని సీపీ తెలిపారు. ఈ సమయంలో ఆయా రూట్లలో ప్రయాణించేవారు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని సూచించారు.

పోలింగ్ నిర్వహణ నిశితంగా పరిశీలించాలి

● జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలన జరపాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. పోలింగ్ సరళిని సూక్ష్మ స్థాయిలో పరిశీలన చేసేందుకు నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు సోమవారం బంజారాహిల్స్ కోమరం భీం ఆదివాసి భవన్‌లో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలను తూచా తప్పకుండా అమలయ్యేలా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలని, అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించగల్గుతారన్నారు. పోలింగ్‌కు ముందు రోజు ఉదయం నిర్ణీత సమయంలోగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకొని పోలింగ్ సిబ్బందికి అందించే సామగ్రి సక్రమంగా అందిందా లేదా అన్నది పరిశీలించాలని, అనంతరం పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ స్టేషన్లకు చేరుకోవాలన్నారు. పోలింగ్ రోజు ఏజెంట్ల సమక్షంలో ఉదయం 5.30 గంటలకే మాక్ పోల్ ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. ఒకవేళ ఏజెంట్లు ఎవరూ హాజరుకాని పక్షంలో 15 నిమిషాలు వేచి చూసిన మీదట మైక్రో అబ్జర్వర్ల సమక్షంలో మాక్‌పోల్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మౌలిక సదుపాయాలు, సీక్రెట్ పోలింగ్ కంపార్ట్‌మెంట్ సరిగా ఏర్పాటు చేశారా అన్నది పరిశీలించాలన్నారు. ఎక్కడైనా సాంకేతిక లోపాల వల్ల ఈవీఎంలు పనిచేయకపోతే, వాటి స్థానంలో వేరే ఈవీఎంలను ఎలా అమరుస్తున్నారు అన్నది పరిశీలన చేయాలన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో మరింత ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, పోలింగ్ కేంద్రం బయట, పరిసర ప్రాంతాల్లోనూ జరిగే అంశాలను గమనిస్తూ జాగరూకతతో వ్యవహరించాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మైక్రో అబ్జర్వర్ల విధులు, బాధ్యతలకు సంబంధించిన అంశాలను వివరించారు. అనంతరం హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జనరల్ అబ్జర్వర్ పీఐ శ్రీవిద్య మాట్లాడారు. ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమైందన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌ల నిర్వహణపై మైక్రో అబ్జర్వర్లకు హ్యాండ్స్ ఆన్ శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతుల్లో మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల ట్రైనింగ్ నోడల్ అధికారి అడిషనల్ కమిషనర్ (డీటీడీ) సునంద, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లను మోసం చేసిన కాంగ్రెస్



మాట్లాడుతున్న బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



అమీర్‌పేట గ్రామంలో ప్రచారం చేస్తున్న కొండా సంగీతారెడ్డి

● చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంషాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆటో డ్రైవర్లను మోసం చేసిందని వారి బతుకులను రోడ్డుపాలు చేసిందని చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శంషాబాద్ వైఎన్‌ఆర్ గార్డెన్‌లో సోమవారం భారతీయ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆటోడ్రైవర్లు లైట్‌వేట్ మోటార్ వెహికల్ డ్రైవర్లతో కొండా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల కోసం ప్రతినెలా జీవన భృతి కల్పిస్తామని చెప్పి మాట తప్పిందని విమర్శించారు. ఆటో డ్రైవర్లను రోడ్డుపాలు చేసిన కాంగ్రెస్ పార్టీకి సార్వత్రిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపు నిచ్చారు. తాను చేవెళ్లలో ఎంపీగా గెలువగానే ఆటో డ్రైవర్లకు స్వయంగా ఆటోలు కొనుక్కొవడానికి లోన్లు కల్పించడంతో పాటు అర్హులందరికీ ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం ద్వారా సొంత ఇంటికి పంపిస్తానని కొండా హామీ ఇచ్చారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన భారతీయ మజ్దూర్ యూనియన్ ముఖ్య నాయకులు సభ్యులు, బీజేపీ నాయులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో సంగీతారెడ్డి

మహేశ్వరం, మే 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13 న జరగబోయే ఎన్నికల్లో కమలం పువ్వుగుర్తుపై ఓటు వేసి చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు ఆయన సతీమణి కొండా సంగీతారెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం మండలంలోని అమీర్‌పేట, మాణిక్యమ్మగూడ, కేకేబస్తీ, సుభాన్‌పూర్ గ్రామాల్లో మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మాదవాచారి, మాజీ సర్పంచ్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమికి 400కు పైగా స్థానాలు

● తెలుగు రాష్ట్రాలలో రెండు ఎంపీ స్థానాల్లో పోటీ ● అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ కూటమికి మద్దతు

● ఆర్పీఐ అధ్యక్షుడు, కేంద్రమంత్రి రాందాస్ అథవాలే



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే

పంజాగుట్ట, మే6(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి 400కు పైగా స్థానాలు వస్తాయని, నరేంద్రమోదీ మరోసారి ప్రధాని అవడం ఖాయమని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎ) అధ్యక్షుడు, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే అన్నారు. కేంద్రంలో బీజేపీ కూటమి మళ్లీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు తొలగిస్తారంటూ వ్యాఖ్యలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన తెలిపారు.

సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ నాయకులు, అభ్యర్థులతో కలిసి ఆయన మాట్లాడారు. 2014 నుంచి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్నామని అన్నారు. అప్పటి నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నానని, కేంద్రంలో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని తెలిపారు. దేశవ్యాప్తంగా ఆరు పార్లమెంట్ స్థానాల్లో తమ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాలలో రెండు ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తున్నామని, పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ కూటమికి మద్దతు తెలుపుతున్నామని వెల్లడించారు. తన పదవి కాలం ఇంకా ఉందని, అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదన్నారు. అస్సాంలో నాలుగు, తెలంగాణలో వరంగల్, ఏపీలో విజయవాడ పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో మిగిలిన 16 పార్లమెంట్ స్థానాల్లో బీజేపీకి, ఏపీలోని 24 పార్లమెంట్, 175 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ, టీడీపీ కూటమి అభ్యర్థులకు మద్దతు తెలుపడమే కాకుండా వారి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్ ఎంపీ అభ్యర్థి పి.రవికుమార్, ప్రధాన కార్యదర్శి వైరత్న ప్రసాద్, ఏపీ అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, విజయవాడ అభ్యర్థి పేరం శివనాగేశ్వరరావు గౌడ్, జాతీయ నాయకుడు బి.నాగేశ్వరరావు, స్వామి, సంపత్ కుమార్, శ్రీధర్, తెలుగు రాష్ట్రాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసింది మేము.. పునాదులు వేసింది మేము

● ఎఫ్‌టీసీసీఐ చర్చలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు

● ఆత్మనిర్భర్, మౌలిక వసతులతో దేశం అభివృద్ధి

● బీజేపీ నేత కరుణా గోపాల్



చర్చా కార్యక్రమంలో పొన్నాల లక్ష్మయ్య, శ్యామ్ మోహన్, కరుణా గోపాల్ తదితరులు

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్ల కాలంలో తెలంగాణా అన్ని రంగాలలోనూ అపూర్వమైన అభివృద్ధిని సాధించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణా చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) సోమవారం ఎఫ్‌టీసీసీఐ ఆడిటోరియంలో ఎకనమీ, ఇండస్ట్రీ, రీఫార్మ్స్ (ఆర్థికం, పరిశ్రమలు, సంస్కరణలు) పేరిట ఓ చర్చను నిర్వహించారు. పొన్నాల లక్ష్మయ్య తో పాటుగా టీపీసీసీ ఇంటలెక్చువల్ సెల్ చైర్మన్ శ్యామ్ మోహన్ అనంతుల, బీజేపీ నేషనల్ లీడర్ కరుణ గోపాల్ పాల్గొన్నారు. దక్కన్ క్రానికల్ రెసిడెంట్ ఎడిటర్ శ్రీరామ్ కర్రి మోడరేటర్‌గా వ్యవహరించిన ఈ చర్చా కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలా జయదేవ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్ సింఘాల్ సహా పెద్ద సంఖ్యలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ దేశంలోనే మిగిలిన రాష్ట్రాల కంటే అభివృద్ధి పరంగా మిన్నగా ఉండటమే కాదు, దేశపు వృద్ధి రేటు కంటే ఇక్కడే వృద్ధి రేటు అధికంగా ఉందని ఆయన వివరించారు. టీపీసీసీ ఇంటెలెక్చువల్ సెల్ చైర్మన్ శ్యామ్ మోహన్ మాట్లాడుతూ ఇప్పుడు చాలామంది అభివృద్ధి గురించి గొప్పలు చెబుతున్నారు కానీ, అసలు అభివృద్ధికి పునాది వేసిందే తామన్నారు. రాజీవ్‌గాంధీ హయాంలోనే టెలిఫోన్ విప్లవానికి నాంది పడిందని ఆయన అన్నారు. ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పీవీ, ఆ తరువాత మన్మోహన్ సింగ్ పాలనలోనూ అభివృద్ధి పరంగా దేశాన్ని ముందుకు తీసుకువెళ్లారన్నారు. అనంతరం బీజేపీ నేత కరుణా గోపాల్ మాట్లాడుతూ గత పదేళ్లలో దేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఒకప్పుడు సేవారంగానికి మాత్రమే మన దేశంలో ప్రాధాన్యం ఉందని అన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌తో తయారీ రంగం కూడా అభివృద్ధి చెందిందన్నారు. పరిపాలన, సంస్కరణలు, ఉపాధి, అభివృద్ధి ఇలా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి ఇప్పుడు కనిపిస్తుందని ఆయన వివరించారు.

డబ్బు మాట దేవుడెరుగు.. ప్రాణం పోతే ఎవరిది బాధ్యత

● పొద్దుగాల పూట మీటింగ్‌లు పెట్టొద్దంటే పెడతారు

● ఎండకు స్పృహ కోల్పోయిన ఓ మహిళ



ప్రచారంలో స్పృహ కోల్పోయిన ఓ మహిళతో తోటి మహిళలు

కుత్బుల్లాపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): డబ్బు మాట దేవుడెరుగు.. మనిషి ప్రాణాలు పోతే ఎవరిది బాధ్యత ? పొద్దుగాల మీటింగ్లు పెట్టొందంటే ఎండల్లో మీటింగులు పెడతారు.. ఇవన్నీ కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేజ్-2 సర్కిల్‌లో ఓ పార్టీ ప్రచారానికి వచ్చిన మహిళల సంభాషణ. ప్రచారంలో భాగంగా మల్కాజిగిరిలో ఓ అభ్యర్థి మాట్లాడుతున్న సమయంలో ఎండ వేడికి ప్రచారానికి వచ్చిన ఓ మహిళ స్పృహ తప్పి కళ్లు తిరిగి కింద పడిపోయింది. దీంతో ఆమెతో పాటు వచ్చిన తోటి మహిళలు ఆమెను పక్కకు తీసుకెళ్లి మంచినీరు తాగించి తలపై నీటిని పోశారు. ఇంత జరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆగ్రహానికి గురైన తోటి మహిళలు వారిని ప్రచారానికి తీసుకొచ్చిన వారిపై చిర్రుబుర్రులాడుతూ బాధ్యత లేకుంటే ఎందుకు ప్రచారానికి తీసుకొస్తారని, ప్రాణాలు పోతే పైసలెందుకని మండిపడ్డారు.

11 ఏళ్ల బాలికకు అరుదైన శస్త్రచికిత్స

● కడుపులో నుంచి కణితి తొలగించిన గాంధీ వైద్యులు

అడ్డగుట్ట, మే 6 (ఆంధ్రజ్యోతి): 11 ఏళ్ల బాలికకు గాంధీ ఆస్పత్రి చిన్నపిల్లల వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి కడుపులో నుంచి కణితిని తొలగించారు. సోమవారం గాంధీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, చిన్నపిల్లల విభాగాధిపతి ప్రొఫెసర్ నాగార్జున వివరాలు వెల్లడించారు. నాందేడ్‌కు చెందిన 11 ఏళ్ల బాలిక సంధ్య కొన్ని నెలలుగా రక్తపోటు, తలనొప్పి మైకం, వాంతులు, నిత్యం చెమట రావడం తదితర సమస్యలతో బాధపడుతుంది. బాలికను తల్లిదండ్రులు వారం రోజుల క్రితం గాంధీ ఆస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో అడ్మిట్ చేశారు. ప్రొఫెసర్ నాగార్జున బాలికకు వైద్య పరీక్షలు చేసి ఆమెకు బైలేటరల్ అడ్రినల్ ఫియోక్రోమోసైటోమో అనే వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. సుమారు ఐదు లక్షలమందిలో ఒకరికి మాత్రమే ఈ వ్యాధి ఉంటుందని తెలిపారు. కేసును సవాలుగా తీసుకున్న వైద్యులు శస్త్రచికిత్స చేసి చిన్నారి కడుపులో కుడి అడ్రినల్ సిరను కత్తిరించి లాపర్‌స్కోపికా నుంచి కణితిని విజయవంతంగా తొలగించారు. ఈ శస్త్రచికిత్సలో పీడియాట్రిక్ వైద్యులు శ్రీనివాస్, అశిత్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, హర్ష, ప్రొఫెసర్ ఆవుల మురళీధర్, పీడియాట్రిక్ అనస్థీషియా వైద్యులు పద్మావతి, పీడియాట్రిక్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ జార్జ్, అజయ్‌మోహన్, ఎండోక్రినలాజీ విభాగం ప్రొఫెసర్ విజయ్‌శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, జాస్మిన్, ఓటీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం కేసు సహకరించిన వ్యక్తికి 20ఏళ్ల జైలు శిక్ష

రంగారెడ్డి కోర్టులు, మే 6 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో సహకరించిన వ్యక్తికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 10వేల జరిమానాతో పాటు బాధితురాలికి రూ. 2లక్షలు నష్టపరిహారం చెల్లించాలని అత్యాచారం, పోక్సో కోర్టు జడ్జి తీర్పు చెప్పారు. ప్రత్యేక పీపీ సునీత బర్ల కథనం ప్రకారం.. మీర్‌పేట్‌కు చెందిన నరేందర్ అలియాస్ చందు ఓ బాలికకు మాయమాటలు చెప్పి సినిమాకు తీసుకెళ్లి తర్వాత మీర్‌పేటలోని తన మిత్రుడు ఏంపల్లి కృష్ణ రూమ్‌కు తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి 2016 ఫిబ్రవరి 11న మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు సాక్ష్యాధారాలతో కోర్టులో ఛార్జ్‌షీటు దాఖలు చేశారు. కేసు నడుస్తున్న సమయంలో నరేందర్ అలియాస్ చందు చనిపోగా అతనికి సహకరించిన మిత్రుడు వేంపల్లి కృష్ణకు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 10 వేల జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ. 2లక్షలు నష్టపరిహారం చెల్లించాలని న్యాయమూర్తి ఎంకే పద్మావతి తీర్పు వెలువరించారు.

లోన్ కట్టాలని రాజాసింగ్‌కు ఫోన్

మంగళ్‌హట్, మే 6 (ఆంధ్రజ్యోతి): లోన్ కట్టాలంటూ ఓ బ్యాంక్ టెలీకాలర్ నుంచి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ఫోన్ కాల్ వచ్చింది. 'షేక్ మహ్మద్ పేరు మీద వెహికిల్ తీసుకున్నారని.. ఇర్ఫాన్ పేరుతో మీ ఫోన్ నంబర్ ఇచ్చారు' అని టెలీకాలర్ ఎమ్మెల్యేకు తెలిపింది. ఎవరు పడితే వారు నంబర్ ఇస్తే కాల్ చేస్తారా అంటూ టెలీకాలర్‌ను రాజాసింగ్ ప్రశ్నించారు. గూగుల్, యూట్యూబ్ సెర్చ్ చేసి తన గురించి తెలుసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ టెలీకాలర్‌కు సూచించారు.

ఎన్నికల ప్రచారంలో రౌడీషీటర్

● నిర్వాహకుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్, మే 6(ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘించి ఎన్నికల ప్రచార సభకు రౌడీషీటర్‌ను తీసుకువచ్చిన నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ నాయకుడు కాలే రోహిత్ పోలీసుల అనుమతితో ఈ నెల 4న కృష్ణానగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించాడు. ఈ ప్రచారంలో రౌడీషీటర్ బిల్లా పవన్ కూడా పాల్గొన్నాడు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పార్టీ ప్రచార కార్యక్రమాల్లో రౌడీషీటర్‌లు పాల్గొనకూడదనే నిబంధన ఉంది. ఈ నిబంధనను ఉల్లంఘించి రౌడీషీటర్‌ను ప్రచారానికి తీసుకువచ్చిన రోహిత్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పోచారం చోరీ కేసులో పాత నేరస్థుడి అరెస్ట్

● నిందితుడిపై 250కి పైగా కేసులు

ఉప్పల్, మే 6(ఆంధ్రజ్యోతి): జైలు నుంచి బయటకు వచ్చి వరుస చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఉప్పల్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజారెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. పోచారం ఐటీ కారిడార్ పీఎస్ పరిధిలో వరుస చోరీలు జరిగాయి. ఈ క్రమంలో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు చోరీలకు పాల్పడుతున్నది శీలంశెట్టి వెంకటరమణ అలియాస్ శ్రీనుగా గుర్తించారు. జోడిమెట్ల క్రాస్ రోడ్డులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకన్నారు. 21తులాల బంగారంతో పాటు కేజీ వెండి రూ.1.50లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నాటి సీపీ చేతుల మీదుగా..

శీలంశెట్టి వెంకటరమణ అలియాస్ శ్రీను గతంలో బాలానగర్‌లో పరిధిలో స్క్రాప్ దుకాణం నిర్వహిస్తూ జనగామకు చెందిన మహిళను వివాహం చేసుకున్నాడు. దీంతో జనగామలో ఉంటూ పేపర్ ప్లేట్ల వ్యాపారం చేస్తున్నట్లు చెప్పి పాత నేరస్థుడి రికార్డు నుంచి తన పేరును తొలగింపజేసుకున్నాడు. వెంకటరమణ 2014కి ముందు 250కి పైగా కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. జైలు నుంచి విడుదల అయిన తర్వాత అప్పటి సైబరాబాద్ సీపీ సీవీ ఆనంద్ చేతులు మీదుగా ఉప్పల్ క్రాస్ రోడ్డులో టిఫన్ సెంటర్ ప్రారంభించాడు. మూడేళ్లుగా తాళం వేసిన ఇళ్లపై రెక్కి నిర్వహించి చోరీలకు పాల్పడుతున్నాడు. సమావేశంలో ఏసీపీ చక్రపాణి, పోచారం సీఐ రాజు, డీఐ శ్రీనివాస్, యుగేందర్ పాల్గొన్నారు.

పోతరాజు దినేష్ మృతి



రాంగోపాల్‌పేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): లష్కర్ శ్రీఉజ్జయినీ మహంకాళి దేవాలయ పోతురాజులలో ఒకరైన దినేష్ ఆదివారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు. దినేష్ గత ఎనిమిది సంవత్సరాలుగా అమ్మవారి సేవలో పోతరాజుగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా దినేష్‌కు ఇటీవల పసిరికలు వచ్చినప్పటి నుంచి అనారోగ్యానికి గురయ్యాడు. కొన్ని రోజులుగా ఆరోగ్యం మరింత క్షీణించడంతో అతడిని కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రిలో చేర్చారు. పసిరికలు ముదరడంతో ఆదివారం రాత్రి తుదిశ్వాస వదిలారు. దినేష్‌కు భార్య, ఒక పాప, ఒక బాబు ఉన్నారు. ఆయన పలు సినిమాలు, సీరియల్స్‌లో కూడా నటించారు. దినేష్ తల్లిదండ్రులు యాప్రాల్ బాలాజీనగర్‌లో ఉంటుండంతో ఆయన కుటుంబ సభ్యులు సోమవారం దినేష్ అంత్యక్రియలను బాలాజీనగర్‌లోనే నిర్వహించారు.

'కోడ్' దాటొద్దు!

» సంయమనంతో మాట్లాడండి
» జగన్, చంద్రబాబుకు ఈసీ ఆదేశం

అమరావతి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో హుందాగా, గౌరవంగా మాట్లాడాలని... ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించొద్దని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, టీడీపీ అధినేత చంద్రబాబును కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ప్రసంగాల్లో వారు చేసిన పలు వ్యాఖ్యలను తప్పుపట్టింది. ఇది వరకే ఇచ్చిన నోటీసులకు పంపిన వివరణలను పరిశీలించిన అనంతరం ఈ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ఎన్నికల సంఘం ముఖ్య కార్యదర్శి అవినాశ్ కుమార్ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. జగన్, చంద్రబాబు ఆయా ప్రసంగాల్లో చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను కూడా ఈ ఆదేశాల్లో ప్రస్తావించారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా సంయమనం పాటించాలని ఇరువురు నేతలను ఆదేశించింది.

ఎన్నికలు సక్రమంగా జరుగుతాయనే

నమ్మకం సన్నగిల్లుతోంది

» ఇష్టానుసారం అధికారులను మార్చేస్తున్నారు
» జగన్ బేల మాటలు.. ఈసీ చర్యలపై ఆక్రోశం



మచిలీపట్నం/బాపట్ల/మాచర్ల రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాటల్లో బేలతనం కనిపించింది. 'వీరభక్త ఐపీఎస్'ల సహాయంతో ఎలాగైనా ఎన్నికల్లో గెలుద్దామనుకున్న తన వ్యూహాలు బెడిసికొడుతుండటంతో ఏకంగా ఎన్నికల కమిషన్‌పైనే ఆయన ఆక్రోశం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం గుంటూరు జిల్లా రేపల్లె, మాచర్లలో, కృష్ణా జిల్లా బందరులో జరిగిన సభల్లో జగన్ పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు సక్రమంగా జరుగుతాయనే నమ్మకం రోజురోజుకీ సన్నగిల్లుతోందని, ఇష్టానుసారంగా అధికారులను మార్చి వేస్తున్నారని ఆయన వాపోయారు. పేదలకు మంచి జరగకుండా టీడీపీ అధినేత చంద్రబాబు అడ్డుపడుతున్నారని, ఈసీపై ఒత్తిడి తెచ్చి ఆన్‌గోయింగ్ పథకాలను కూడా ఆపివేయిస్తున్నారని అక్కసు వెళ్లగక్కారు. పేదలకు మంచి చేస్తున్న జగన్ ఉండకూడదని కుట్రలు చేస్తున్నారంటూ తన బేలతనం బయటపెట్టుకున్నారు. ఎన్నికల కోడ్ రాకముందు ఎప్పుడో కొన్ని పథకాలకు బటన్ నొక్కిన డబ్బులు... అప్పుడు లబ్ధిదారుల ఖాతాల్లో వేయలేదు. సరిగ్గా పోలింగ్‌కు ముందు వాటిని జమ చేస్తామని ప్రభుత్వం అనడంతో, ఈసీ అంగీకరించలేదు. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయిన తర్వాత విడుదల చేయవచ్చునని సూచించింది. వాస్తవం ఇది కాగా, 'ఆన్ గోయింగ్ పథకాలను' చంద్రబాబు ఆపి వేయిస్తున్నారంటూ జగన్ అక్కసు వెళ్లగక్కడం గమనార్హం.

నేనూ టైటిల్ యాక్టుకు ప్రత్యక్ష బాధితుడినే!

» చనిపోయిన నా తల్లిదండ్రుల భూముల మ్యుటేషన్‌కు రెవెన్యూ అధికారులు నిరాకరించారు
» ఐఏఎస్‌గా పనిచేసిన నాపరిస్థితే ఇలా ఉంటే .. రాష్ట్రంలో సామాన్య రైతుల దుస్థితి ఊహించలేం
» మాజీ ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ ఆవేదన

అమరావతి, మే 6 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో ల్యాండ్ టైటిల్ యాక్టుకు అందరూ బాధితులే. చివరకు ప్రభుత్వ అధికారులుగా పనిచేసినవారు కూడా ఇందుకు మినహాయింపు కాదు. ఐఏఎస్ అధికారిగా 36 ఏళ్ల పాటు ఆంధ్రప్రదేశ్‌లో వివిధ హోదాల్లో సేవలందించిన పీవీ రమేశ్ అనుభవం ఇదే విషయం తేటతెల్లం చేస్తోంది. ల్యాండ్ టైటిల్ యాక్టుకు తానూ ప్రత్యక్ష బాధితుడినేనంటూ పీవీ రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వాట్సాప్ మాధ్యమం వేదికగా తన అనుభవం పంచుకున్నారు. ప్రకటించారు. "కృష్ణా జిల్లా విన్నకోట గ్రామంలో చనిపోయిన నాతల్లిదండ్రుల పట్టా భూములను మ్యుటేషన్ చేసేందుకు రెవెన్యూ అధికారులు నిరాకరించారు. తహసిల్దార్ నా దరఖాస్తును తిరస్కరించారు. పోస్టు ద్వారా పంపిన పత్రాలను తెరవకుండానే ఆర్డీవో తిరిగి ఇచ్చేశారు. నా తల్లిదండ్రుల భూములపై నాకు హక్కు లేకుండా చేస్తున్నారు. ఐఏఎస్‌గా సేవలందించిన ఓ అధికారి పరిస్థితి ఇలా ఉంటే, సామాన్య రైతుల పరిస్థితిని ఊహించలేం" అని ఆవేదన వ్యక్తం చేశారు.

దారిలో ఉన్నప్పుడే..

అంత్యక్రియల గురించి అడిగారు!

» జగన్‌కు చెబితే నువ్వే నిర్ణయించుకోమన్నారు..
» ఆ రోజు ఉదయం 6.16కి కృష్ణారెడ్డి ఫోన్
» రక్తపు వాంతులతో పడిపోయారని చెప్పాడు
» లెటర్ ఉందని.. ప్రసాద్ కొట్టినట్టు రాశారన్నాడు
» కానీ, నేను నమ్మలేదు. లెటర్‌ను దాచమన్నాను
» వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి వెల్లడి

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణతో 'బిగ్‌డిబేట్'



(కడప - ఆంధ్రజ్యోతి)

ఏపీ సీఎం జగన్ చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య, తదనంతర పరిణామాలపై ఆయన కుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి పలు విషయాలు వెల్లడించారు. ఆ రోజు ఉదయం వివేకా రక్తపు వాంతులతో మృతి చెందారన్న సమాచారంతో హైదరాబాద్ నుంచి బయలుదేరామని, అయితే, శంషాబాద్ టోల్ గేట్ దాటే సమయంలో అది 'హత్య' అని తెలిసిందని, ఆ వెంటనే దారిలో ఉండగానే అంత్యక్రియల గురించి కూడా మాట్లాడారని వెల్లడించారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ నిర్వహించిన 'బిగ్ డిబేట్'లో పాల్గొన్న సునీత, రాజశేఖర్‌రెడ్డి దంపతులు పలు అంశాలను పూసగుచ్చినట్టు వివరించారు. ఒంటరి పోరాటంలో కొన్నిసార్లు కుంగిపోయానని కానీ, రెండు మూడు రోజుల్లో తేరుకునేదాన్నని సునీత తెలిపారు. "మాకు ఈ విషయం 6.20కి తెలిస్తే 7.20 గంటలకు బయలుదేరాం. శంషాబాద్ టోల్‌గేట్ దాటే సమయంలో 'మర్డర్' అని తెలిసింది. అప్పుడే మళ్లీ కాల్స్ వచ్చాయి. పోలీసు కేసు పెట్టాలని అడిగారు. కొంచెం దూరం వెళ్లాక.. అంత్యక్రియలు ఈరోజే చేసేద్దామా అని కాల్స్ వచ్చాయి. నేను వెంటనే భారతి పీఏ నవీన్‌కి కాల్ చేసి.. భారతితో మాట్లాడా. భారతి ఫోన్ తీసుకున్నాక.. 'జగనన్నతో మాట్లాడాలి అని అడిగితే.. భారతి జగనన్నకి ఫోన్ ఇచ్చింది. అంత్యక్రియల గురించి అడుగుతున్నారు ఏం చేద్దామని అడిగా. 'నువ్వు ఎలా డిసైడ్ చేసుకుంటే అలాగే పోదాం. యూ డిసైడ్ అన్నట్లుగా జగన్ చెప్పారు" అని ఆమె పేర్కొన్నారు. 6.20- 7.20కి మధ్యలో మర్డర్ అని తెలిసినా జగన్‌తో మాట్లాడినప్పుడు ఆ విషయం అడగలేదని, తనను ఆయన కూడా అడగలేదన్నారు. అంత్యక్రియల వరకే మాట్లాడానని తెలిపారు. "అంత్యక్రియల విషయం నేనే అడిగాను. ఆయన(జగన్) నాకంటే పెద్ద. నాన్న లేకుంటే ఆయనే కదా దిక్కు. ఏమున్నాగానీ చూసుకుంటాడని అనుకున్నా. ఏం చేయాలని అడగాలంటే ఏమని అడగాలో కూడా తెలియదు" అని తెలిపారు. కాగా, చాలాకాలం నుంచి వివేకా దగ్గర కృష్ణారెడ్డి పీఏగా ఉండేవారని, హత్య జరిగిన రోజు ఉదయం 6:16 గంటలకు ఫోన్ చేసి, "రాజశేఖర్.. బావ మనకు లేరు" అని చెప్పారని రాజశేఖర్ రెడ్డి చెప్పారు. ఏమైందని అడిగితే.. రక్తపు వాంతులు అనుకుంటా.. బాత్‌రూమ్‌లో రక్తంలో పడి ఉన్నారని తెలిపారని వివరించారు. "అప్పటికి అతనికి తెలియదనే అనుకున్నాను. కానీ అతనికి కూడా పూర్తిగా అవగాహన ఉందని తర్వాత తెలిసింది.. అతనితో ఆ రోజు అలా చెప్పించారు. కానీ వాళ్లు అనుకున్నది అనుకున్నట్లు జరిగినట్లు లేదు. బావ (వివేకా)కి అప్పటికే స్టంట్ వేసి ఉంది. సిగరెట్స్ తాగుతుండేవారు. ఆల్కహాల్ తీసుకునేవారు. అందుకని రక్తపు వాంతులు అయి ఉండొచ్చునేమో అనుకున్నాను. ఏమై ఉండచ్చు అని.. పులివెందుల ఇంట్లో పనిచేసే పిల్లాడికి ఫోన్ చేస్తే.. సార్ నేను కాణిపాకం పోయాను. దారి మధ్యలో మా అక్క వాళ్ల ఇంట్లో ఆగిపోయాను అని సమాధానం ఇచ్చాడని" రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. వివేకాతో ఉన్న డ్రైవర్ ప్రసాద్‌కు ఫోన్ చేస్తే.. అతడి భార్య రిసీవ్ చేసుకుందన్నారు. 'సార్ ప్రసాద్ నిద్రపోతున్నాడు. రాత్రి లేటుగా వచ్చాడు సార్ అని తెలిపిందన్నారు. "ప్రసాద్ లేచిన తర్వాత అడిగాను. రాత్రి ఎన్ని గంటలకు వచ్చారు? భోజనం చేశారా? డ్రింక్ ఏమైనా చేశారా? అని.. 'సార్ భోజనం అయితే టేబుల్ మీద పెట్టాను. డ్రింక్ తీసుకోలేదు సార్ అన్నాడు. కానీ, అతను చెప్పింది అబద్ధం. అతను వివేకాకి డ్రింక్ ఇచ్చాడు.. నేను తిడతానేమోనని భయపడ్డాడు. నువ్వు వెంటనే వివేకా ఇంటి వద్దకు వెళ్లిపో అనిచెప్పి ఫోన్ పెట్టేశాను. తర్వాత కృష్ణారెడ్డి నుంచి మళ్లీ ఫోన్ వచ్చింది. ఏంటని అడిగితే 'ఇక్కడ ఒక లెటర్ ఉంది' అన్నాడు. చదివి వినిపించు అన్నాను. గజిబిజిగా ఉంది చదవడానికి వీలు కాదేమో అన్నాడు. టైం తీసుకొని అయిన చదువు అన్నాను. దీంతో కృష్ణారెడ్డి.. 'ప్రసాద్‌ను నేను మార్నింగ్ తొందరగా ఇంటికి రమ్మన్నాను. దీంతో అతను చచ్చేటట్లు కొట్టాడు' అని రాసి ఉందన్నాడు. కానీ, ఎవడైనా అంత పనిచేసిన తర్వాత (వివేకాను కొట్టిన తర్వాత) నింపాదిగా పడుకొని నిద్రపోతాడా? మాటల తీరు కూడా తెలుస్తుంది కదా.? లెటర్ దొరికితే, అది 'మర్డర్' అని తెలుస్తోంది. బట్ లెటర్ దొరికితే వీడ్ని (ప్రసాద్) కూడా చంపేస్తారు. ఏదో ఒకటి జరుగుతుంది. నేను వచ్చే వరకు లెటర్ దాచమని కృష్ణారెడ్డికి చెప్పాను. అప్పుడు టీడీపీ ప్రభుత్వం ఉంది. లెటరు పోలీసుల చేతికి వెళితే మళ్లీ వాళ్లేం చేస్తారో అని అనుకున్నాను" అని రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. కాగా, బాడీని నేరుగా చూడకముందే.. దారుణంగా చంపారనే డౌట్ వచ్చిందని పేర్కొన్నారు. "ఇనయతుల్లా అని నా వద్ద పనిచేస్తుంటాడు. శంషాబాద్ పరిసరాల్లో వెళ్లాక ఫోన్ చేశాడు. 'సార్ మీకు ఫొటోస్ పంపాను చూశారా' అన్నాడు. ఓపెన్ చేసి చూస్తే క్లారిటీ లేదు. అప్పుడు అనుకున్నా అక్కడేదో జరిగిందని! అప్పుడే సునీతకు చెప్పా. ఇది సహజ మరణంగా అనిపించడం లేదని. కృష్ణారెడ్డి మీద నాకు అనుమానం ఎందుకు రాలేదంటే ఫస్ట్ లెటర్ గురించి అతనే చెప్పాడు కాబట్టి" అని రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. "నేను 1992 జనవరిలో అమెరికా వెళ్లా. పని చేసే టైంలో కూడా రియల్ ఎస్టేట్ బిజినెస్ చేసేవాడిని. తర్వాత ఐటీ బిజినెస్ స్టార్ట్ చేశాను. 20 సంవత్సరాలు ఆ బిజినెస్‌లో ఉన్నా. టీపీవో పెట్టాం. సునీత 1996లో యూఎస్‌కు వచ్చింది. 2000 నుంచి తను కూడా పని చేస్తోంది. నాకు వ్యాపారంలో ఎప్పుడూ నష్టాలు రాలేదు. ఎపుడు కావాల్సినంత డబ్బు ఉండేది" అని స్పష్టం చేశారు. కాగా, ఆస్తుల కోసమని హత్య కేసును పక్కదారి పట్టించాలని చూశారు కదా? కానీ, ఆ సమయంలో మీ వాళ్లు ఎవరూ అక్కడ లేరు కదా? అని ఏబీఎన్ ఎండీ రాధాకృష్ణ ప్రశ్నించగా.. గంగిరెడ్డి, దస్తగిరి తమకు తెలిసినవారని రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. అయితే, మీరే చంపించారని వాళ్లు చెప్పలేదు కదా? అని ప్రశ్నించగా, చెప్పలేదు కానీ, వీళ్ల (జగన్) వేరేవాళ్లతో చెప్పించేవాళ్లని సమాధానమిచ్చారు.



ఏపీ డీజీపీగా హరీశ్ గుప్తా

బాధ్యతలు స్వీకరించిన 1992 బ్యాచ్ ఐపీఎస్

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): ఏపీ నూతన డీజీపీగా హరీశ్ కుమార్ గుప్తా నియమితులయ్యారు. అధికార పార్టీ వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డిని బదిలీ చేసిన ఎన్నికల సంఘం, 24గంటల్లోనే కొత్త పోలీస్ బాస్‌ను ఎంపిక చేసింది. 1992 బ్యాచ్‌కు చెందిన గుప్తాను ఎంపిక చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. ఇదే బ్యాచ్‌కు చెందిన కేవీ రాజేంద్రనాథ్ రెడ్డిపై ఆదివారం సాయంత్రం ఈసీ వేటు వేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో నియమించేందుకు ప్రభుత్వం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు, పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న మాదిరెడ్డి ప్రతాప్‌తోపాటు హరీశ్ గుప్తా పేర్లను ఈసీకి పంపింది. ఈ జాబితాలోంచి గుప్తాను ఈసీ ఎంపిక చేసింది. సోమవారం సాయంత్రం ఐదు గంటల్లోపు బాధ్యతలు తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొనడంతో ఇంచార్జి డీజీపీ శంకబ్రత బాగ్చి నుంచి గుప్తా బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్లుగా ఏపీ హోంశాఖ కార్యదర్శిగా ఉన్న ఆయన, కొన్ని నెలలుగా జైళ్లశాఖ డీజీగా అదనపు బాధ్యతలుకూడా నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం పంపిన జాబితాలో మిగిలిన ఇద్దరు తిరుమలరావు, మాదిరెడ్డి ప్రతాప్‌లను స్థానికులన్న కారణంతో పక్కన పెట్టిన ఈసీ.. జమ్మూకు చెందిన గుప్తాను ఎంపిక చేసింది..

అనంత డీఐజీ అమ్మిరెడ్డిపై వేటు..

అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డిపై ఎన్నికల సంఘం బదిలీ వేటువేసింది. తక్షణమే తప్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన ఈసీ, ఎన్నికలకు సంబంధించి ఎలాంటి విధులూ ఆయనకు అప్పగించవద్దని సూచించింది. ఇటీవల ధర్మవరంలో బీజేపీ కార్యకర్తపై వైసీపీ గూండాలు చేసిన దాడి అసలు పోలీసింగ్ అనేది రాష్ట్రంలో ఉందా అనే ప్రశ్నను బలంగా ముందుకు తెచ్చింది. ఈ ఘటన గురించిన వివరాలను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ధర్మవరం పర్యటనకు వచ్చినప్పుడు, ఎన్డీఏ నేతలు ఆయనకు వివరించారు. కేంద్ర హోం మంత్రి పర్యటన ముగిసిన 24గంటల్లోనే అమ్మిరెడ్డి బదిలీ కావడం గమనార్హం.

మాఫియారాజ్.. కరప్షన్ కింగ్!

ఏపీలో ల్యాండ్, సాండ్, లిక్కర్ మాఫియా.. అవినీతి తప్ప మరేమీ తెలియని జగన్

» వైసీపీ వచ్చాక గాడి తప్పిన పురోగతి
» జూన్ 4న తియ్యటి కబురు తథ్యం
» రాజమండ్రి, అనకాపల్లి సభల్లో మోదీ

కాకినాడ/రాజమహేంద్రవరం/అనకాపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): "మా మంత్రం.. అభివృద్ధి.. అభివృద్ధి.. అభివృద్ధి.! జగన్ మంత్రం కరప్షన్.. కరప్షన్.. కరప్షన్.! మాఫియారాజ్‌ను పెంచి పోషించిన కరప్షన్ కింగ్ జగన్" అని ప్రధాని నరేంద్ర మోదీ దుయ్యబట్టారు. ఈ నెల 13న ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ కోసం ఓటు వేయాలని.. ఈ సారి ఏపీ ప్రజల కోసం చంద్రబాబు నాయకత్వం.. పవన్‌కల్యాణ్ విశ్వాసంతోపాటు మోదీ గారెంటీ ఉంటుందని ఆయన భరోసానిచ్చారు. "తెలుగు మధురమైనది.. అనకాపల్లి బెల్లం తీయనైనది.. జూన్ 4న అంతకంటే తీయని మంచి కబురు వినిపిస్తుంది. ఏపీలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడుతుంది. డబుల్ ఇంజన్ సర్కారుతో ఏపీ అభివృద్ధి కొత్త శిఖరాలకు చేరుతుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన రాజమహేంద్రవరం, అనకాపల్లిలో జరిగిన బహిరంగ సభల్లో పాల్గొన్నారు. రాజమండ్రి సభలో జనసేన అధిపతి పవన్ కల్యాణ్, టీడీపీ యువనేత లోకేశ్ పాల్గొనగా.. అనకాపల్లిలో చంద్రబాబుతో కలిసి మోదీ వేదికను పంచుకున్నారు. ఈ సందర్భంగా జగన్‌పై మోదీ విరుచుకుపడ్డారు. చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపితే.. జగన్ అవినీతితో దాన్ని గాడితప్పించారని విమర్శించారు. "కేంద్రంలోని బీజేపీ సర్కారు ఏపీకి విశాఖ రైల్వేజోన్ ఇస్తే.. రాష్ట్ర ప్రభుత్వం కనీసం రైల్వే కార్యాలయానికి స్థలాన్ని ఇవ్వలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం 20 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. వైసీపీ సర్కారు వాటిలో సగం కూడా నిర్మించలేకపోయింది. ఎందుకంటే.. అవినీతికి ఆస్కారమున్న పనులు మాత్రమే జగన్ చేస్తారు. మేం పేదరిక నిర్మూలన చేస్తుంటే.. జగన్ పేదలను పీడించే పనిలో పడ్డారు. మద్య నిషేధం పేరుతో అధికారంలోకి వచ్చి.. రాష్ట్ర ప్రభుత్వంతో మద్యం వ్యాపారం చేయిస్తున్నారు. భారీ స్థాయిలో మద్యం సిండికేట్ నడుస్తోంది. మూడు రాజధానులని చెప్పి.. ఒక్కదాన్నీ నిర్మించలేదు. అవినీతి కారణంగా ఏపీలో అభివృద్ధికి బ్రేకులు పడ్డాయి. కేంద్రం పోలవరానికి రూ.15 వేల కోట్లు ఇచ్చింది. జగన్ సర్కారు ఆ ప్రాజెక్టును నిలిపివేసింది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులను వైఎస్ మొదలుపెడితే.. ఆయ కుమారుడి హయాంలోనూ నెరవేరలేదు. వైసీపీకి రైతులంటే శ్రద్ధలేదు" అని మోదీ వివరించారు. చంద్రబాబు హయాంలో అభివృద్ధి పరుగులుపెట్టిందని కొనియాడారు. కాంగ్రెస్ పోయి.. వైఎస్సార్ కాంగ్రెస్ వచ్చిందని, ఏపీలో సాండ్ మాఫియా, ల్యాండ్ మాఫియా, లిక్కర్ మాఫియా, అవినీతి రాజ్యమేలుతున్నాయని విమర్శించారు.



రాజమహేంద్రవరం బహిరంగ సభలో సభావేదికపై నుంచి అభివాదం చేస్తున్న మోదీ, లోకేశ్, పవన్

కాంగ్రెస్.. వైఎస్సార్ కాంగ్రెస్.. రెండు పార్టీలది ఒకే మాట, ఒకే బాట అని.. హద్దుల్లేని అవినీతి, మాఫియారాజ్యమే వాటి ఎజెండా అని దుయ్యబట్టారు. పొరుగున ఉన్న కర్ణాటకలో ట్యాంకర్ మాఫియా, ల్యాండ్ మాఫియా సాగుతోందని గుర్తు చేశారు. స్కామ్‌ల కాంగ్రెస్‌తో.. అవినీతి వైఎస్సార్ కాంగ్రెస్‌తో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు హితవుపలికారు. దేశంలో కాంగ్రెస్ నేతలు ఎన్నికల ఫలితాలకు ముందే ఓటమిని అంగీకరించారని ఎద్దేవా చేశారు. ఇంతకు ముందు ఓట్లడిగేందుకు వచ్చే నేతలను ఏం చేశారంటూ ప్రజలు నిలదీసేవారని.. ఇప్పుడు తాము ఏం చేశామో చెప్పి ఓట్లు అడుగుతున్నామన్నారు. ఏపీలో చేపట్టి కేంద్ర ప్రాజెక్టులను గురించి, కొత్త వర్సిటీలు, ఐఐటీల గురించి వివరించారు. ఈ సందర్భంగా దివంగత ఎన్టీఆర్‌ను కూడా మోదీ స్మరించుకున్నారు. ఏపీ అంటే ఎన్టీఆర్ గుర్తుకొచ్చేవారని, రాముడంటే.. ఎన్టీఆర్ అని పేర్కొన్నారు.

వచ్చేది డబులింజన్ సర్కారే: చంద్రబాబు

రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలోకి రావడం ఖాయమని, సైకో జగన్ ఇంటికి పోవడం తథ్యమని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి 160 అసెంబ్లీ స్థానాల్లో, పాతికకు పాతిక లోక్‌సభ స్థానాల్లో ఘనవిజయం సాధించబోతోందన్నారు. వైసీపీ ఎన్ని వందల కోట్లు ఖర్చుపెట్టినా ప్రయోజనం లేదని, జగన్ సీన్ అయిపోయిందని తేల్చిచెప్పారు.

నవ్య | చిత్రజ్యోతి




వీళ్లిద్దరిలో ఎవరు?

కన్నడ సూపర్‌స్టార్ యశ్ నటిస్తున్న 'టాక్సిక్' సినిమా గురించి రోజుకో వార్త వినిపిస్తోంది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపుదిద్దుకొనే ఈ చిత్రం జూన్‌లో సెట్స్ పైకి వెళ్లనుంది. సినిమాలో హీరో చెల్లెలు పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉండడంతో ఆ పాత్రకు ఎవరిని ఎంపిక చేయాలా అనే విషయంపై ఇంకా ఓ నిర్ణయానికి రాలేకపోతున్నారు దర్శకనిర్మాతలు. నయనతార ఆ పాత్ర పోషించనున్నారని వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు ఇంకో పేరు వినిపిస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకొనే పాన్ ఇండియా సినిమా కనుక చెల్లెలు పాత్రకు నయనతార కాకుండా కృతి సనన్‌ను తీసుకుంటే ఎలా ఉంటుందా అనే కొత్త ఆలోచన మొదలైనట్లు తెలుస్తోంది. నయనతార సౌత్ వరకూ ఓకే కానీ బాలీవుడ్‌లోని టాప్ హీరోయిన్లలో కృతి ఒకరు కనుక ఆమెను తీసుకుంటే సినిమాకు మరింత ప్లస్ అవవచ్చు అని ఆలోచిస్తున్నట్లు సమాచారం. నయతార, కృతి.. వీరిద్దరిలో ఎవరు అనే విషయం త్వరలోనే తేలిపోతుందని అంటున్నారు. ఇక యశ్ సరసన కియారా నటిస్తున్న సంగతి తెలిసిందే.

మంచి చిత్రాన్ని అందించాలని...



తమిళంలో చిన్న చిత్రంగా విడుదలై విమర్శకుల ప్రశంసలతో పాటూ పెద్ద విజయాన్ని అందుకున్న చిత్రం 'రంగోలి'ని తెలుగులో 'సత్య'గా డబ్ చేశారు. హమరేశ్, ప్రార్థన సందీప్ హీరో హీరోయిన్లుగా నటించారు. ఆడుకాలం మురుగదాస్, సాయిశ్రీ, అక్షయ కీలక పాత్రలు పోషించారు. వాలి మోహన్ దాస్ దర్శకత్వం వహించారు. తెలుగు వర్షన్‌కు శివ మల్లాల నిర్మాత. ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కిన 'సత్య' ఈ నెల 10న తెలుగులో విడుదల అవుతోంది. సోమవారం ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ వేడుకలో 8 మంది దర్శకులు కలసి ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత శివ మల్లాల మాట్లాడుతూ "నిర్మాతగా ఒక ప్రేక్షకులకు ఒక మంచి చిత్రాన్ని అందించాలని ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నా" అని చెప్పారు. దర్శకుడు వాలి మోహన్ దాస్ మాట్లాడుతూ "కుటుంబం కథా చిత్రంగా వస్తున్న 'సత్య'ను తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి" అని కోరారు.



దేవర... ఎన్టీఆర్‌కు స్పెషల్

'ఆర్ఆర్ఆర్' తర్వాత వస్తున్న జూనియర్ ఎన్టీఆర్ చిత్రం కావడంపై 'దేవర పార్ట్ వన్' మీద భారీ అంచనాలు ఉన్నాయి. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా అక్టోబర్ 10న విడుదల కానుంది. ఇటీవల ఎన్టీఆర్ 'అభిమానులు కాలర్ ఎగరేసుకునేలా చిత్రం ఉంటుంది' అని కామెంట్ చేసి అభిమానుల్లో జోష్ పెంచారు. తాజాగా ఓ సినిమా ప్రమోషన్‌లో పాల్గొన్న దర్శకుడు కొరటాల శివ మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌కు, ఆయన అభిమానులకు ఈ సినిమా కచ్చితంగా ప్రత్యేకంగా ఉంటుంది. త్వరలో అప్‌డేట్స్ వస్తాయి' అన్నారు. ఈ నెల 20 ఎన్టీఆర్ బర్త్‌డే కావడంతో ఆ రోజు 'దేవర చిత్రం నుంచి సర్‌ప్రైజ్ ఉంటుందని అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు. 'దేవర' చిత్రం షూటింగ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరుగుతోంది. ఎన్టీఆర్ మాత్రం ముంబైలో 'వార్ 2' షూటింగ్‌లో ఉన్నారు.

ఇలాంటి పరిస్థితి మరెవ్వరికీ రాకూడదు



'హుషారు', 'జాంబీ రెడ్డి', 'రావణాసుర' వంటి చిత్రాలతో గుర్తింపు పొందారు దక్షా నగార్కర్. తొమ్మిదేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నా దక్షా నటించింది కేవలం ఐదు చిత్రాలు మాత్రమే. ఇటీవలే ఆమె కొన్ని అనారోగ్య సమస్యలతో హాస్పిటల్‌లో చికిత్స తీసుకున్నారు. కోలుకున్నాక ఈ విషయమై ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. "గడిచిన కొద్ది రోజులు నరకప్రాయంగా తోచాయి. ఇలా ఆస్పత్రి బెడ్‌లో చికిత్స పొందుతూ ఉండటం ఎంతో బాధాకరం. నా వెన్నెముకకు ఇప్పటికే రెండు సార్లు మత్తు మందు ఇచ్చారు. ఇలాంటి పరిస్థితి మరెవ్వరికీ రాకూడదు. ఈ పరిస్థితుల నుంచి కోలుకోవడం ఎంతో కష్టంగా ఉన్నా.. కుటుంబ సభ్యుల అభిమానం, కేరింగ్ ఆరోగ్యాన్ని మెల్లిమెల్లిగా కుదుటపడేలా చేస్తున్నాయి. వారు కురిపించిన ప్రేమ వల్ల ఎంతటి నొప్పినైనా భరించే శక్తి వచ్చింది. కంటికి కనిపించని గాయాలను మాయం చేసే అద్భుత గుణం ప్రేమకు ఉంది. కుటుంబ సభ్యుల ప్రేమ ఈ విషయాన్ని రుజువు చేసింది. నేను అందరికీ చెప్పేదొక్కటే.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి. అలాగే మీ చుట్టూ పాజిటివ్ వైబ్స్‌ను పెంచే రిలేషన్స్‌తో ఎక్కువ సమయం గడపండి" అని పేర్కొన్నారు.



తెలుగు, తమిళంలో అగ్ర హీరోల చిత్రాల్లో నటించి వరుస విజయాలు అందుకున్న నటి జ్యోతిక. కెరీర్ పీక్ టైమ్‌లోనే నటుడు సూర్యని పెళ్లి చేసుకుని సినిమాల్లో నటించడం తగ్గించారు. అప్పుడప్పుడు నటనా ప్రాధాన్యమున్న పాత్రలతో ప్రేక్షకులను పలకరించే ఆమె.. బాలీవుడ్ చిత్రం శ్రీకాంత్ బొల్లా బయోపిక్ 'శ్రీకాంత్'లో కీలక పాత్రను పోషించారు. ఈ నెల 10న ఈ సినిమా విడుదలవుతున్న సందర్భంగా జ్యోతిక మీడియాతో ముచ్చటించారు.

ఆ విషయంలో మార్పు రావాలి

"నాకు వాస్తవానికి దగ్గరగా ఉండే పాత్రల్లో నటించడం ఇష్టం. ఇందులో నేను టీచర్‌గా నటించాను. ఒక ఫ్రెండ్‌గా, తల్లిగా, టీచర్‌గా శ్రీకాంత్ పాత్ర అనుకున్నది చేయడానికి నేను సహకరిస్తాను. నా కెరీర్‌లో నేను చేసిన పాత్రల్లో హృదయానికి బాగా చేరువైన రోల్ ఇది. పుట్టుకతోనే అంధుడిగా పుట్టిన శ్రీకాంత్ అనే ఒక సాధారణ వ్యక్తి, వ్యవస్థగా మారడమే ఈ సినిమా కథాంశం. విద్యార్థిగా, వ్యాపార వేత్తగా శ్రీకాంత్ జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లకు ఏ విధంగా సమాధానం చెప్పాడో సినిమాలో ఆసక్తికరంగా చూపించాం. ఈ బయోపిక్‌లో రాజ్‌కుమార్ రావు నటన అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. పాత్ర కోసం ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ నిజంగా అద్భుతం. ఈ సినిమా సెట్స్‌కు అప్పుడప్పుడు 'శ్రీకాంత్' మూవీ రియల్ లైఫ్ క్యారెక్టర్ శ్రీకాంత్ బొల్లా వచ్చేవారు. తెలుగువాడైన శ్రీకాంత్ బొల్లా జీవితం నిజంగా ఒక ఇన్స్పిరేషనల్ జర్నీ. ఈ సినిమా విద్యార్థులకు కష్టపడితే జీవితంలో ఏదైనా సాధించవచ్చనే నమ్మకాన్ని కల్పిస్తుంది. అలాగే, ఇందులోని సన్నివేశాలు యూత్‌ను, కుటుంబాలను విపరీతంగా ఆకట్టుకుంటాయి. ఇక, ఎక్కడచూసినా సినిమాల్లో మహిళా సాధికారత గురించి చర్చ నడుస్తోంది. ఆ విషయంలో మార్పు రావాలి. ప్రత్యేకించి ఉమెన్ ఓరియెంటెడ్ చిత్రాలు తీయక్కర్లేదు. కథలోనే మహిళలకు సమాన అవకాశం ఉన్న పాత్రలు సృష్టిస్తే సరిపోతుంది" అని చెప్పారు.



అబ్ కీ బార్?

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ కోవర్టులు ఉన్నారు



» మా అభ్యర్థుల గెలుపు కోసం పనిచేస్తున్నారు: మల్లారెడ్డి

సికింద్రాబాద్/బోయినపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో తమ పార్టీకి చెందిన కోవర్టులు ఉన్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆ కోవర్టులంతా బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసమే పనిచేస్తున్నారని, రానున్న రోజుల్లో వారే కాంగ్రెస్ కొంప ముంచుతారని వ్యాఖ్యానించారు. చాలామంది కార్పొరేటర్లను తానే కాంగ్రెస్‌లోకి పంపానన్నారు. మల్కాజిగిరి ఎంపీగా రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా నివేదిత గెలుపు తథ్యమన్నారు. త్వరలో రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎదురులేని శక్తిగా రాబోతోందన్నారు.



ఖమ్మం నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్న పొంగులేటి, చిత్రంలో భట్టి

బీజేపీకి బీటీమ్‌గా బీఆర్ఎస్

» బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తారు: పొంగులేటి

» అబద్ధాల బీఆర్ఎస్ అడ్రస్.. ఇక గల్లంతే: భట్టి విక్రమార్క

బోనకల్, మే 6: బీజేపీకి బీటీమ్‌గా బీఆర్ఎస్ పని చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా బోనకల్‌లో సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లో మంత్రి పొంగులేటి మాట్లాడారు. బీఆర్ఎస్ నిర్వాకం కారణంగా రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను భట్టి విక్రమార్క గాడిలో పెడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని, ఇక ఆ పార్టీ అడ్రస్ గల్లంతేనని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సోయి లేకుండా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ కారు స్టీరింగ్ ఒకరు, టైర్లను మరొకరు ఊడదీసుకొని తలో దిక్కు ఎత్తుకెళ్లారని, ఇక ఆ కారు గ్యారేజీలో శాశ్వతంగా ఉంటుందని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలతోపాటు రైతుల రుణమాఫీని ఆగస్టు 15లోగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. చేస్తామని హామీ ఇచ్చారు.

రేవంత్‌లా రాహుల్‌వీ అబద్ధాలే : హరీశ్



నర్సాపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కాకున్నా అమలవుతున్నట్లు ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ అబద్ధాలాడటం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. ఏ గ్రామాల్లో అమలవుతున్నాయో అక్కడ తాము ఓట్లు అడగబోమని, అమలు కానీ గ్రామాల్లో అడుగుతామని, అందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమా అని సవాల్ చేశారు. సోమవారం ఆయన నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీ అబద్ధాలకు కవల పిల్లలని విమర్శించారు.

టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా దినేశ్



పంజాగుట్ట, మే 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) లీగల్ సెల్ కన్వీనర్‌గా హైకోర్టు న్యాయవాది ఎస్. దినేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ లీగల్ సెల్, మానవ హక్కుల, ఆర్టీఐ విభాగం ఛైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దినేశ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో తనకు ఈ బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర ఛైర్మన్ పొన్నం అశోక్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేందుకు బీజేపీ కుట్రలు

» ప్రశ్నించే గొంతులను అణగదొక్కుతున్నారు: నారాయణ

కరీంనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీజేపీయేతర రాష్ట్రాల్లో ఆయా పార్టీలను చీల్చి, ప్రభుత్వాలను కూల్చేందుకు బీజేపీ కుట్రలు పన్నుతున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. తెలంగాణలో బీజేపీతో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రమాదం పొంచి ఉందని అన్నారు. మహారాష్ట్రలో మాదిరిగా ఆయా పార్టీల్లో చిచ్చు పెట్టి ప్రభుత్వాన్ని కూల్చే అవకాశం ఉందని అన్నారు. తెలంగాణలో రేవంత్‌కు ఇప్పుడే వేధింపులు మొదలయ్యాయని పేర్కొన్నారు. మూడోసారి అధికారంలోకి వస్తే బీజేపీ తప్ప ఏ పార్టీ మనుగడ సాగించ వద్దనే ఆలోచనతో మోదీ ఉన్నారని ఆరోపించారు. ప్రశ్నించే గొంతులను అణగదొక్కుతున్నారని విమర్శించారు. దేశ సంపదను కొల్లగొట్టి మోదీ దత్తపుత్రులు విదేశాలకు పారిపోయారని ధ్వజమెత్తారు. కరీంనగర్‌లో సోమవారం నారాయణ విలేకరులతో మాట్లాడారు. అయోధ్య రామ మందిరాన్ని ఆగమశాస్త్రానికి విరుద్ధంగా ప్రారంభించారని, అది అపశకునంగా మారిందని దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా చేస్తున్న ప్రచారంలో ఎక్కడా ఎన్డీఏ గ్యారెంటీ అని చెప్పడం లేదని, మోదీ గ్యారెంటీ అని వ్యక్తిగత పోకడలకు పోతున్నారని విమర్శించారు. ఇండియా కూటమి వస్తే ముస్లింలు దాడులు చేస్తారని ప్రజలను రెచ్చగొడుతున్నారని దుయ్యబట్టారు. ప్రశ్నించే వారిని సీబీఐ, ఈడీల పేరుతో వేధిస్తున్నారన్నారని, అందులో భాగంగానే ఢిల్లీ ముఖ్యమంత్రిని జైలు పాలు చేశారన్నారు. మోదీకి వత్తాసు పలికినందుకు పదేళ్లుగా జగన్ మాత్రం బెయిల్‌పైనే ఉన్నాడన్నారు.

సీఎంపై కొత్తగూడెం డీఎస్పీకి బీజేపీ ఫిర్యాదు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 6: జన జాతర సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను రెచ్చగొట్టేలా ప్రసంగించారని భద్రాద్రి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రంగాకిరణ్ కొత్తగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తాము ఖండిస్తున్నామని, ప్రజలను రెచ్చగొట్టేలా ప్రసంగించిన సీఎంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చని బీజేపీని ఓడిద్దాం

» ఓటు ద్వారా గద్దె దించుదాం: సంయుక్త కిసాన్ మోర్చా

పంజాగుట్ట, మే 6 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో రైతులు బీజేపీని ఓడించేందుకు సిద్ధం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా అఖిల భారత, రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కనీస మద్దతు ధరల చట్టం చేస్తామని, రుణమాఫీ చేస్తామని, విద్యుత్ సవరణ బిల్లును రైతులతో మాట్లాడకుండా పార్లమెంట్లో పెట్టమని, రైతులపై అక్రమ కేసులను ఎత్తివేస్తామని, ఫసల్ బీమా యోజన రైతులకు ఉపయోగపడేలా మారుస్తానని రాతపూర్వకంగా బీజేపీ హామీ ఇచ్చిందని అన్నారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్న హామీని తుంగలో తొక్కిందని విమర్శించారు. ఈ నెల 11 వరకు జిల్లాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

దేశంలో దాడులు, ఊచకోతలకు మోదీ గ్యారెంటీ

» ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో దాడులు, ఊచకోతలకు మోదీ గ్యారెంటీ ఇస్తారని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. తిరుమలై రామన్ ఆరోపించారు. సోమవారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి మోదీ ప్రచారం చేస్తున్నారన్నారు. మతపరమైన ఎజెండాతో పని చేస్తున్న బీజేపీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరుమలై రామన్ పిలుపునిచ్చారు.



హైదరాబాద్ నగరంలో సీఎం రేవంత్ రోడ్‌షోకు హాజరైన జనం

బై బై మోదీ!



కార్యకర్త బహూకరించిన గదతో సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

మోదీ హయాంలో జరిగిందని, ఆయన పాలనలో ఉద్యోగాలు రాలేదని, రైతుల ఆదాయం రెట్టింపు కాలేదని విమర్శించారు. అందుకే ఈసారి మోదీ ఓటమి ఖాయమన్నారు. సోమవారం గ్రేటర్ హైదరాబాద్‌లోని అంబర్‌పేట, ఉప్పల్, కంటోన్మెంట్, పికెట్ చౌరస్తాలలో నిర్వహించిన కాంగ్రెస్ రోడ్‌షోలలో సీఎం ప్రసంగించారు. మోదీ పదేళ్లుగా ప్రధానిగా ఉన్నా కూడా అంబర్‌పేట బ్రిడ్జిని కిషన్‌రెడ్డి ఎందుకు పూర్తి చేయించలేదని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరంలో ఎన్నో అభివృద్ధి పనులు కాంగ్రెస్ హయాంలోనే జరిగాయని, అంబర్‌పేటలోని బతుకమ్మకుంటను కబ్జాదారులు అక్రమించి అమ్ముకుంటుంటే కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు అడ్డుకున్నారని గుర్తు చేశారు. అంబర్‌పేట నియోజకవర్గంలో బతుకమ్మ పండుగ వేడుకలను బతుకమ్మ కుంటలోనే ఏర్పాటు చేసే బాధ్యత తనదని హామీనిచ్చారు. బీజేపోళ్లు మెడ మీద వేలాడే కత్తిలాంటోళ్లని, బీజేపీకి పడే ప్రతీ ఓటు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు రద్దుకు పోటుగా తయారవుతాయని హెచ్చరించారు. రిజర్వేషన్లు పెంచి పేదలను డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లుగా చేయాలని తాము చూస్తున్నామని, వాటిని దొంగ దెబ్బతీయాలని మోదీ కుట్ర పన్నుతున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందుకనే ఈ ఎన్నికల్లో 400 సీట్లు కావాలని పిలుపునిస్తున్నారని, ఇది గుర్తించిన బీసీ, ఎస్సీ, ఎస్టీలు మోదీని గద్దె దించటానికి సిద్ధమయ్యారన్నారు.

బీఆర్ఎస్ గురించి మాట్లాడటం దండగ

'బీఆర్ఎస్‌సోళ్ల గురించి మనం మాట్లాడుకునుడే దండుగ. అది సచ్చినపాము. ఇంకా ఎన్ని రోజులు తండ్రీకొడుకులు అబద్ధాలు చెబుతారు? మీ మోసాలకు కాలం చెల్లింది. మిమ్మల్ని నమ్మేవారు లేరు. బీఆర్ఎస్‌కు గతమే ఉన్నది కానీ భవిష్యత్తు లేదు' అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. పదేళ్లు ప్రజలను ముంచి, రాష్ట్రాన్ని కొల్లగొట్టి లక్ష కోట్లు దోచుకున్నారన్నారు. తాము అధికారంలోకి వచ్చి వంద రోజులు కాలేదు, అప్పుడే దిగిపో అంటున్నారని, అయ్యపేరు, తాతపేరు చెప్పి కుర్చీలో కూసోలే బిడ్డా.. కొట్లాడుకుంటూ నీలాంటోళ్లను తొక్కుకుంటూ వచ్చిన.. నువ్వో.. నీ అయ్యనో దిగమంటే దిగనీకి ఇక్కడ ఎవ్వరూ లేరు అల్లటప్పాగా అంటూ దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం ఏమీ చేయలేదని అంటున్న కేటీఆర్.. చీర కట్టుకొని బస్సు ఎక్కాలని టికెట్‌కు పైసలు అడిగితే పథకాలు అమలు కానట్టేనని పునరుద్ఘాటించారు.

రాజేందర్, కేసీఆర్ బొమ్మా బొరుసు

మల్కాజిగిరి స్థానాన్ని బీజేపీకి బీఆర్ఎస్ పార్టీ తాకట్టు పెట్టిందని, బంగ్లా ముందు దిష్టిబొమ్మలా బీఆర్ఎస్ అభ్యర్థిని పెట్టుకున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ 2001 నుంచి 2021 వరకు 20 ఏళ్లు కేసీఆర్‌తో ఒకటే కంచంలో తిని తెలంగాణను విధ్వంసం చేయలేదా? కేసీఆర్ మందేసినప్పుడల్లా కాపలా కూసుని సొల్లు మాటలు చెప్పలేదా? అని పేర్కొన్నారు. రెండేళ్ల కింద పంపకాల్లో తేడా వచ్చి విడిపోయారని, బీసీల కోసమో, ముదిరాజులను బీసీ-ఏలోకి మార్చాలనో, ఎస్సీ వర్గీకరణ కోసమో కాదని చెప్పారు. హుజూరాబాద్‌లో ఓడిపోయి ఉప్పల్‌లో తేలి మల్కాజిగిరి సొంతం అంటున్న ఈటెల రాజేందర్‌కు.. ఏవిధంగా మల్కాజిగిరి సొంతమని ప్రశ్నించారు. బీజేపీలోకి పోయి రెండేళ్లవుతున్నా మోదీ, నితిన్ గడ్కరీని పైఓవర్ పనుల గురించి అడిగినవా అని నిలదీశారు. ఈటల రాజేందర్, కేసీఆర్ వేర్వేరు కాదని, ఒకే నాణేనికి బొమ్మ బొరుసు వంటివారన్నారు. తెలంగాణకు పదేళ్లలో వందేళ్లకు సరిపడా విధ్వంసం చేశారని విమర్శించారు. కేసీఆర్ కాళేశ్వరంలో దోచుకుంటే ఈటల ఆర్థికమంత్రిగా సంతకాలు పెట్టి వేల కోట్ల బిల్లులిచ్చిండన్నారు. కరోనా సమయంలో పేదలకు వైద్యం కోసం కార్పొరేట్ కంపెనీలు వందల కోట్లు ఇస్తే వాటిని సంతోష్‌రావు దిగమింగినప్పుడు, వైద్యఆరోగ్యశాఖ మంత్రిగా రాజేందర్ సంతకాలు చేసిండని దుయ్యబట్టారు. 'కేసీఆర్ కుటుంబం లక్ష కోట్ల దోపిడీకి పాల్పడుతుంటే ఆ దొంగలకు సద్దులు మోసింది అప్పుడే మరిచిపోయావా? ధరణి ముసుగులో ఔటర్ చుట్టూరా వేలాది ఎకరాలను భూములను దొరలను అక్రమించుకుంటుంటే ఆ గడీల దగ్గర కాపలా కాసింది నువ్వు కాదా? గద్దరన్నను ఎర్రటి ఎండలో ప్రగతి భవన్ బయట నాలుగు గంటలు కూర్చోబెట్టి కేసీఆర్ అవమానించినప్పుడు నువ్వు అడిగావా?' అని విమర్శించారు. వందలాది ఎకరాలతో కూడిన కేటీఆర్ జన్వాడ ఫాంహౌస్ గురించి, గజ్వేల్‌లో కేసీఆర్ ఫాంహౌస్ గురించి ఈటల రాజేందర్.. మోదీకి, అమిత్‌షాకు ఎన్నడైనా ఫిర్యాదు చేశారా అని ప్రశ్నించారు. అలాగే, ఈటలపై కేటీఆర్ కూడా ఏనాడూ విమర్శలు చేయలేదన్నారు. వారి మధ్య చీకటి ఒప్పందం ఉందన్నారు.



ప్రియాంక ప్రచారం.. 2 రోజులు

» 10, 11 తేదీల్లో జనజాతర సభలు, రోడ్‌షోలు

» కరీంనగర్‌కు బదులుగా నర్సాపూర్‌లో 9న రాహుల్ సభ

హైదరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎన్నికల ప్రచారంపైన కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఇప్పటికే తుక్కుగూడ, నిర్మల్, ఆలంపూర్ జనజాతర సభల్లో పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేసిన ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ.. ఈ నెల 9న మరో రెండు సభల్లోనూ పాల్గొంటున్న సంగతి తెలిసిందే. ఆ రోజున సాయంత్రం 4 గంటలకు నర్సాపూర్‌లోను, 6 గంటలకు సరూర్‌నగర్ స్టేడియంలోనూ జరిగే జనజాతర సభల్లో పాల్గొననున్నారు. ముందుగా ఖరారైన షెడ్యూల్ ప్రకారం రాహుల్‌గాంధీ ఉదయం 11 గంటలకు కరీంనగర్‌లో, సాయంత్రం 6 గంటలకు సరూర్‌నగర్ స్టేడియంలలో జరిగే జనజాతర సభల్లో పాల్గొనాల్సి ఉంది. అయితే, రాహుల్ బిజీ షెడ్యూల్ కారణంగా కరీంనగర్‌లో జరగాల్సిన జనజాతర సభ రద్దయింది. దాని స్థానే సాయంత్రం 4గంటలకు నర్సాపూర్, ఆ తర్వాత సరూర్‌నగర్‌లో జరిగే జనజాతర సభకు రాహుల్‌గాంధీ హాజరవుతున్నారు. రాహుల్ వచ్చి వెళ్లిన మరుసటి రోజే ఆయన సోదరి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ప్రచారం కోసం తెలంగాణకు వస్తున్నారు. ముందుగా ఖరారైన షెడ్యూల్ ప్రకారం ఆమె పర్యటన ఒకే రోజు ఉండగా.. ఇప్పుడు రెండు రోజుల పాటు ప్రచారం చేయాలని నిర్ణయించారు. 10న ఉదయం కామారెడ్డి, మధ్యాహ్నం ఒంటిగంటకు తాండూరు జనజాతర సభల్లో, సాయంత్రం 7 గంటలకు కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, మణికొండ కార్నర్ మీటింగ్‌ల్లో పాల్గొంటారు. మరుసటి రోజు ఉదయం 10గంటలకు పటాన్‌చెరులో కార్నర్ మీటింగ్‌లోను, సాయంత్రం 3గంటలకు మక్తల్ జనజాతర సభలోనూ పాల్గొంటారు. మొత్తమ్మీద ప్రియాంకసభతో తెలంగాణలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం ముగియనుంది.

ప్రాంతీయ పార్టీల సంకీర్ణమే

(మొదటిపేజీ తరువాయి)



నిజామాబాద్ రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్

నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ చెబుతున్నట్లుగా బీజేపీకి 400 సీట్లు రావని.. 210 సీట్లు కూడా దాటవని జోస్యం చెప్పారు. కాంగ్రెస్‌కు కూడా అదే పరిస్థితి ఉందన్నారు. దేశంలో బీజేపీ హవా తగ్గిపోయిందని.. ప్రజలను మభ్యపెట్టేందుకే ప్రధాని పలు ప్రకటనలు చేస్తున్నారని కేసీఆర్ దుయ్యబట్టారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో 14 సీట్లలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే.. కేంద్రంతో పోరాడి, రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి జరిగే విధంగా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. మోదీ హయాంలో సబ్‌కా వికాస్ ఎక్కడా జరగలేదు సరికదా.. దేశం సత్తెనాశనం అయిపోయిందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు బీజేపీ హయాంలో బాగా పెరిగాయని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్రమోదీ గోదావరి నీటిని తమిళనాడుకు తీసుకువెళ్తానంటున్నారని.. అదే జరిగితే ఇక్కడ ప్రజల పరిస్థితి ఏంటని ఆందోళన వెలిబుచ్చారు. "మన గోదావరి, మన కృష్ణ నీళ్లు మనకే ఉండాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే సాధ్యమవుతుంది" అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎంపీలు గెలిచినా ఉపయోగం లేదని.. వారంతా మోదీ వద్ద చేతులు కట్టుకొని నిలబడతారే తప్ప రాష్ట్రానికి కావాల్సిన ఏ ఒక్క పనీ చేయలేరన్నారు. జిల్లాకు ఒక నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలని ప్రధానికి ఎన్నోమార్లు విజ్ఞప్తి చేసినా ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. దేశవ్యాప్తంగా 150 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఒక్కటి కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. అలాంటప్పుడు బీజేపీకి ఎందుకు ఓటు వేయాలని నిలదీశారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు కూడా ఆరు గ్యారంటీల పేరుతో అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చారని.. వచ్చాక ఒక్క గ్యారెంటీనీ అమలుచేయలేదని కేసీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో ఐదు నెలల్లోనే కరెంటు కోతలు పెరిగాయని నిప్పులు చెరిగారు. ఈ ఐదు నెలల కాలంలో రైతులకు రైతుబంధు పూర్తిస్థాయిలో ఇవ్వలేదని ఆరోపించారు. తాను రోడ్డు మీదకి వచ్చి సమావేశాల్లో పాల్గొనడంతోనే ఇప్పుడు రైతుబంధు చాలైందని కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ శక్తి, తెలంగాణ బలం బీఆర్ఎసేనని అన్నారు. ఐదు ఎకరాలకంటే ఎక్కువ ఉంటే రైతుబంధు ఇవ్వబోమని కాంగ్రెస్ నేతలు ప్రకటనలు చేస్తున్నారని.. ఎక్కువ భూమి ఉన్నోళ్లు ఏం తప్పు చేశారని ఆయన ప్రశ్నించారు. తమ హయాంలో ధాన్యం కొనుగోలు సక్రమంగా చేశామని.. ఈ ఐదు నెలల పాలనలో ఎక్కడా ధాన్యం కొనుగోలు పూర్తిస్థాయిలో జరగడం లేదని విమర్శించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రైతులకు రూ.500 బోనస్ ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అయ్యేంతవరకూ బీఆర్ఎస్ గట్టిగా కొట్లాడుతుందని పేర్కొన్నారు. దేవుడిమీద ఒట్టు పెట్టుకోవడం, కేసీఆర్‌ను తిట్టడం తప్ప రేవంత్‌కు ఏం తెలియదని కేసీఆర్ ఎద్దేవా చేశారు. తాను ప్రాణాలకు తెగించి తెలంగాణ తెచ్చానని.. పదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. తాను మోదీని అన్ని విషయాల్లో వ్యతిరేకించాను కాబట్టే తన బిడ్డ కవితను అరెస్టు చేశారని కేసీఆర్ ఆరోపించారు. అయినా.. 'కేసీఆర్ ఎప్పుడూ లొంగిపోడు. ఎవరికి లొంగడు. పోరాడుతూనే ఉంటాడు' అని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ జిల్లా ప్రజలు ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.

రోడ్‌షోలో దొంగల చేతివాటం

నిజామాబాద్ నగరంలో కేసీఆర్ సోమవారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోలో దొంగలు చేతివాటం చూపారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకుల జేబులు గుల్ల చేశారు. మొబైల్స్ తస్కరించారు. నిజామాబాద్‌జిల్లా జాగృతి మాజీ అధ్యక్షుడు అవంతిరావు సెల్‌ఫోన్, పర్సు కొట్టేశారు.

మోదీ కనుసన్నల్లో రేవంత్

» ఆరెస్సెస్ వ్యక్తి తెలంగాణ ప్రభుత్వాన్ని నడుపుతున్నాడు

» ముఖ్యమంత్రివి చిల్లర మాటలు.. ఉద్దెర పనులు

» హైదరాబాద్‌ను ఆగం చేయాలని మోదీ ప్రయత్నాలు

» రాముడికి మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం: కేటీఆర్



సిరిసిల్ల రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్

హైదరాబాద్ సిటీ/సిరిసిల్ల/శంషాబాద్/సరూర్ నగర్ మే 6(ఆంధ్రజ్యోతి): 'ఒక ఆరెస్సెస్ వ్యక్తి ఈ రోజు తెలంగాణ ప్రభుత్వాన్ని నడుపుతున్నడు. ఆయన కాంగ్రెస్, రాహుల్ గాంధీతో నడుస్తలేడు. బీజేపీ, మోదీ కనుసన్నల్లో పాలన కొనసాగిస్తున్నడ'ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ప్రధాని మోదీ సామరస్యతతో ఉండే హైదరాబాద్‌ను ఆగం చేయాలని చూస్తున్నారని, ముస్లింలను దూషిస్తున్నారని మండిపడ్డారు. సోమవారం సిరిసిల్ల, హైదరాబాద్‌లోని కొండాపూర్, శంషాబాద్, సరూర్ నగర్‌లో కేటీఆర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపడంతో ప్రజలు మోసపోయారు. మోచేతికి బెల్లంపెట్టి ఓట్లు వేయించుకొని కాంగ్రెస్ నాయకులు గద్దెనెక్కారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డివి 150 రోజులైనా చిల్లర మాటలు, ఉద్దెర పనులేన'ని విమర్శించారు. రేవంత్‌ను నమ్మితే తులం బంగారం కూడా రాదన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడే బాగున్నట్లు ప్రజలు చెప్పుకుంటున్నారన్నారు. పాలిచ్చే బర్రెను విడిచిపెట్టి పొడిచే దున్నపోతును తెచ్చుకున్నామని కాంగ్రెస్‌కు ఓటేయడంపై ప్రజలు బాధపడుతున్నారన్నారు. 10 నుంచి 12 ఎంపీ సీట్లు ఇస్తే కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసిపోయాయని రాహుల్ గాంధీ అంటున్నారని, అదే నిజమైతే తన చెల్లెలు 50రోజులుగా జైలులో ఎందుకు ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు ఉంటే రాష్ట్రం అడుక్కుతినే పరిస్థితి వస్తుందన్నారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గతంలో తన నియోజకవర్గానికి మెడికల్ కాలేజీ మంజూరు చేయించుకుంటే రేవంత్ రెడ్డి దాన్ని రద్దు చేసి, కొడంగల్‌కు పట్టుకుపోయారన్నారు. అదే నియోజకవర్గ అభివృద్ధికి నాటి సీఎం కేసీఆర్ రూ.170 కోట్లు మంజూరు చేస్తే ఆ నిధులను సైతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. బీజేపీ గత పదేళ్లలో దేశానికి చేసిందేమీ లేదని, నమో (నరేంద్ర మోదీ) అంటే నమ్మించి మోసం చేయడమన్నారు. పేదోళ్ల దగ్గర రూ.30 లక్షల కోట్లు దోచుకొని, పెద్దోళ్లు అదానీ, అంబానీలకు 14 లక్షల కోట్లు రుణమాఫీ చేశారన్నారు. మోదీ దేవుళ్ల పేరుతో ఓట్లు అడుగుతున్నారని, తాము యాదాద్రి ఆలయం నిర్మించామని దేవుళ్ల పేరుతో ఓట్లు అడిగామా? అని ప్రశ్నించారు. బీజేపీ పంచిన అక్షింతలు అయోధ్య నుంచి రాలేదని, ఇక్కడే రేషన్ బియ్యంలో పసుపు కలిపారన్నారు. 'రాముడికి మొక్కుదాం.. బీజేపీనీ తొక్కుదామ'ని అన్నారు. బీజేపీ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మతం పేరుతో రెచ్చగొట్టడం తప్ప ఒక్క మంచి పనైనా చేశాడా? అని ప్రశ్నించారు. కరీంగనగర్‌లో బీఆర్ఎస్, బీజేపీకే మాత్రమే పోటీ అన్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డి కారును ఢీకొన్న బైక్

» ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

» ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డ ఎమ్మెల్యే

తలకొండపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కారును ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి వెల్జాలలో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం ఎమ్మెల్యే తన కారులో వెల్జాల నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో తలకొండపల్లి-మిడ్జిల్ రహదారిపై రామాసిపల్లి మైసమ్మ ఆలయ సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా వచ్చిన బైక్.. ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారు (టీఎస్11 ఈవై 1899)ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న తలకొండపల్లి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన పబ్బతి నరేశ్(25) అక్కడికక్కడే మృతిచెందాడు. వెనక కూర్చున్న అదే గ్రామానికి చెందిన బైరపాక పరశురాములు(36) తీవ్రంగా గాయపడ్డాడు. కాగా, బైక్‌ను తప్పించే ప్రయత్నంలో డ్రైవర్ కారును రోడ్డు పక్కకు తిప్పాడు. ఎమ్మెల్యే సీటుబెల్ట్ పెట్టుకోవడం, డ్రైవర్ అప్రమత్తతతో కారులోని ఎయిర్ బెలూన్లు తెరుచుకున్నాయి. ఎమ్మెల్యే కసిరెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు డ్రైవర్, గన్‌మ్యాన్‌కు ఏమీ కాలేదు. ప్రమాదం అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డిని కల్వకుర్తిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న పరశురాములును వెల్దండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రమాద తీవ్రతతో ఎమ్మెల్యే కసిరెడ్డి భయాందోళనకు గురయ్యారు. కాగా ఎమ్మెల్యే కసిరెడ్డిని సీఎం రేవంత్ ఫోన్‌లో పరామర్శించారు. ఎమ్మెల్యే కారు ప్రమాదం గురించి తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున కల్వకుర్తి ఆస్పత్రికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో తుక్కుతుక్కైన బైక్



దేశంలోనే అత్యధిక మంది ఓటర్లు ఉన్న పార్లమెంట్ నియోజకవర్గం. తెలుగు రాష్ట్రాలతోపాటు ఉత్తరాది నుంచి కూడా పెద్దసంఖ్యలో ప్రజలు ఉపాధి, వ్యాపారాల నిమిత్తం వచ్చి స్థిరపడ్డ ప్రాంతం. భిన్న సామాజికవర్గాలు, సంస్కృతులతో మినీ ఇండియాను తలపించే సమాజం. ఎల్‌బీనగర్ నుంచి కూకట్‌పల్లి వరకు విస్తరించి.. ప్రత్యేకతలతో కూడిన మల్కాజిగిరిలో ఎన్నిక కూడా ప్రత్యేకమే. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మూడు ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో హోరాహోరీ పోరు సాగుతోంది.

మల్కాజిగిరి..
హోరాహోరీ

దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ స్థానంలో ప్రధాన పార్టీల ముక్కోణపు పోరు


అగ్రనేతలతో ప్రచారంలోనూ పోటాపోటీ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి

మోదీ రోడ్‌షోతో బీజేపీలో జోష్.. అన్నీ సెగ్మెంట్లలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే

ప్రతిష్ఠాత్మక పోరులో ఎవరి ధీమా వారిదే









(ఆంధ్రజ్యోతి, హైదరాబాద్ సిటీ)

తమ సిటింగ్ స్థానమని అధికార కాంగ్రెస్, ఎమ్మెల్యేలంతా తమ వాళ్లేనని బీఆర్‌ఎస్, ప్రధాని మోదీ ఇమేజ్ కలిసివస్తుందని బీజేపీ.. ఇలా ఎవరికి వారు మల్కాజిగిరిలో గెలుపు తమదేనన్న ధీమాతో ఉన్నారు. పునర్విభజనలో భాగంగా 2009లో మల్కాజిగిరి లోక్‌సభ స్థానం ఏర్పడింది. కాంగ్రెస్ తరఫున సర్వే సత్యనారాయణ గెలిచారు. 2014లో చామకూర మల్లారెడ్డి (టీడీపీ) విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో ఈ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కాగా, ఇప్పటివరకు ఇక్కడ బోణీ కొట్టని బీజేపీ, బీఆర్‌ఎస్.. ఈసారి ఎలాగైనా గెలవాలని సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు సెగ్మెంట్లనూ బీఆర్‌ఎస్సే గెలుచుకున్నా.. గత ఎన్నికల్లో ఎదురైన అనుభవం ఆ పార్టీని వెంటాడుతోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి పరిధిలోని అన్ని సెగ్మెంట్లూ గులాబీ ఖాతాలోకే చేరినా.. 2019 లోక్ సభ ఎన్నికల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుమారు 11 వేల ఓట్లతో బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డిపై గెలుపొందారు. అయితే, ప్రస్తుతం బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తాను లోకల్ అని, మిగిలిన అభ్యర్థులు నాన్ లోకల్ అని స్థానికతను తెరపైకి తెచ్చారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు దీనిని తిప్పికొట్టే ప్రయత్నం చేస్తున్నారు.

ఈటల రాజేందర్ అభ్యర్థి కావడంతో..


బీజేపీ తరఫున ఈటల రాజేందర్ పోటీ చేస్తుండడం ఆ పార్టీకి ప్లస్ పాయింట్‌గా మారింది. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి ఈటల బీఆర్‌ఎస్‌లో ఉండడంతో పాటు, మంత్రిగానూ పనిచేశారు. ఈటల నియోజకవర్గం హుజూరాబాద్.. కరీంనగర్ లోక్‌సభ స్థానం పరిధిలో ఉంది. అక్కడ బండి సంజయ్ ఎంపీగా ఉండడంతో ఈటల మల్కాజిగిరికి వచ్చారు. శామీర్‌పేటలో ఉంటున్నానని, అంతకు ముందు అల్వాల్‌లో పదేళ్లకుపైగా నివసించానని, ఇవి మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలోనివేనని చెబుతున్నారు. కాగా, నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బీజేపీకి పట్టుండడం, కొన్నిచోట్ల బీఆర్‌ఎస్‌లో తన వెంట ఉన్న అనుచరులు, కులసంఘాల నేతల పరిచయాలు కలిసివచ్చే అంశాలుగా భావిస్తున్నారు. ఈటలకు మద్దతుగా ప్రధాని మోదీ రోడ్ షో నిర్వహించారు. కొన్ని సెగ్మెంట్లలోనే పార్టీ బలంగా ఉన్నా.. దేశంలో మోదీ గాలి వీస్తోందని, అదే తమను గెలిపిస్తుందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

ఎమ్మెల్యేల బలంతో గెలుస్తామని..

రాగిడి లక్ష్మారెడ్డి ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన నాయకుడు. ఉమ్మడి వరంగల్ జిల్లా భూపాలపల్లికి చెందిన రాగిడి.. మూడు దశాబ్దాల క్రితం నగరానికి వచ్చి స్థిరపడ్డారు. రెండున్నర దశాబ్దాలు కాంగ్రెస్‌లో ఉన్నా ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం రాకపోవడంతో గులాబీ గూటికి చేరారు. తల్లి మధురమ్మ పేరిట మధుర చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 7 శాసనసభ స్థానాల్లోనూ బీఆర్‌ఎస్ భారీ మెజారిటీతో గెలవడం తనకు కలిసి వస్తుందని విశ్వాసంతో ఉన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత ఆకస్మిక మరణంతో ఆ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతోంది. ఇతర నియోజకవర్గాల్లో ఒకరిద్దరు మినహా మిగతా ఎమ్మెల్యేలు రాగిడికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే, ఉప్పల్, మల్కాజిగిరి, ఎల్‌బీనగర్ వినహా ఇతర అసెంబ్లీ సెగ్మెంట్ల ప్రజలతో పెద్దగా పరిచయం లేకపోవడం రాగిడికి కొంత ప్రతికూలంగా మారే అవకాశముందని అంటున్నారు. లోక్‌సభ ఎన్నికలు జాతీయ పార్టీల మధ్య అన్న అభిప్రాయం నెలకొన్న నేపథ్యంలో స్థానిక పార్టీగా ప్రజలను ఆయన ఎంతమేరకు ఒప్పించి ఆదరణ పొందుతారో చూడాల్సి ఉంది.

సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు జడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేసిన పట్నం సునీతారెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. ఆమె భర్త, బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన మహేందర్‌రెడ్డికి ఉమ్మడి జిల్లా పరిధిలో వివిధ పార్టీల నేతలతో సత్సంబంధాలున్నాయి. చేవెళ్లలో పోటీ చేయాలని భావించినా, అధిష్ఠానం నిర్ణయంతో మల్కాజిగిరి బరిలోకి దిగారు. పార్టీ అధికారంలో ఉండడం, సిటింగ్ స్థానం కావడం తమకు సానుకూలాంశమని భావిస్తున్నారు. 2019లో ఇక్కడినుంచి గెలిచిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో.. అభ్యర్థి గెలుపుపై పట్టుదలగా ఉన్నారు. పలుమార్లు పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి నివేదికలు తెప్పించుకొని నేతలను అప్రమత్తం చేస్తున్నారు. అయితే, కేడర్‌ను సమన్వయం చేసే పరిస్థితి లేకపోవడం కొంత ప్రతికూలంగా మారుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పట్నం కుటుంబం.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన వారైనప్పటికీ మల్కాజిగిరి రాజకీయంగా వారికి కొంతమేరకు కొత్త. దీనిని అధిగమించేందుకు వారు ప్రయత్నం చేస్తున్నారు.



2019 లోక్‌సభ ఎన్నికల్లో..

పార్టీ	అభ్యర్థి	ఓట్లు
కాంగ్రెస్	ఎనుముల రేవంత్‌రెడ్డి	6,03,748
బీఆర్‌ఎస్	మర్రి రాజశేఖర్‌రెడ్డి	5,92,829
బీజేపీ	ఎన్ రాంచందర్ రావు	3,94,282

పురుషులు	19,45,624
మహిళలు	18,33,430
ఇతరులు	1399
మొత్తం ఓటర్లు	16,40,755

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఏ సెగ్మెంట్ ఎవరికి!?

బీఆర్‌ఎస్
- ఎల్‌బీనగర్
- ఉప్పల్, మల్కాజ్‌గిరి
- మేడ్చల్, కుత్బుల్లాపూర్
- కూకట్‌పల్లి, కంటోన్మెంట్



2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికెన్ని ఓట్లు!?

- బీఆర్‌ఎస్: 9,38,064
- కాంగ్రెస్: 6,02,914
- బీజేపీ: 4,26,510 (కూకట్‌పల్లిలో పొత్తులో భాగంగా జనసేన ఓట్లతో కలిపి)



ఆ మూడు స్థానాలపై
కాంగ్రెస్ నజర్

- సికింద్రాబాద్, మల్కాజిగిరి, మహబూబ్‌నగర్ బాధ్యత రేవంత్ సన్నిహితుడికి
- నేతలు, కార్యకర్తల నడుమ సమన్వయ సాధన.. క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆరా
- అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తర తెలంగాణ, రాజధాని శివారు జిల్లాల్లో గెలుపునకు కృషి



హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో కీలకంగా ఉన్న సికింద్రాబాద్, మల్కాజిగిరి ఎంపీ స్థానాలను.. వాటితోపాటు మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ అడుగులేస్తోంది. అందులో భాగంగా.. అసెంబ్లీ ఎన్నికల్లో పలు నియోజకవర్గాల్లో గెలుపునకు దోహదపడిన తన అత్యంత సన్నిహితుణ్ని సీఎం రేవంత్ రెడ్డి రంగంలోకి దింపారు. వారం రోజులుగా ఆయన ఆయా నియోజకవర్గాల అభ్యర్థులతో పాటు ముఖ్య నేతలను సమన్వయం చేస్తూ.. అంతా తానై ప్రచారాన్ని ఉధృతం చేశారు. పార్టీకి గంపగుత్తగా ఓట్లు పడే బూత్‌లను గుర్తించి వాటిపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించి పార్టీ విజయానికి ఆయన కృషి చేస్తున్నట్లు తెలిసింది. ఈ మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లో సికింద్రాబాద్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో.. కాంగ్రెస్ ఒక్కచోట కూడా గెలవలేదు. సాక్షాత్తూ రేవంత్ రెడ్డి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలోనూ అదే పరిస్థితి. ఆ పరిధిలోని ఏడు అసెంబ్లీ సీట్లలోనూ కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్‌లో ఓడిన రేవంత్ రెడ్డిని.. ప్రశ్నించే గొంతుకగా గుర్తించిన మల్కాజిగిరి ప్రజలు 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయన్ను తమ ప్రతినిధిగా ఎన్నుకున్నారు. ఎంపీగా గెలిపించారు. ఆ మల్కాజిగిరి స్థానమే తాను రాష్ట్ర ముఖ్యమంత్రిగా కావడానికి దోహదపడిందని పలు సందర్భాల్లో రేవంత్ రెడ్డి సైతం ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఈ రెండు చోట్లా పోటీ హోరాహోరీగా ఉంది. ఇక.. తన సొంత నియోజకవర్గం ఉన్న మహబూబ్‌నగర్ పార్లమెంటు స్థానంలోనూ ప్రత్యర్థి అభ్యర్థి బలంగా పావులు కదుపుతున్న నేపథ్యంలో.. సీఎం రేవంత్ ఈ మూడు స్థానాలనూ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. అవి ఏమాత్రం చేజారకుండా.. ట్రబుల్ షూటర్ అయిన తన సన్నిహితుడికి బాధ్యత అప్పగించినట్లు తెలిసింది. గత ఎంపీ ఎన్నికల్లోనూ, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆయన పార్టీ తరఫున కీలకంగా పనిచేశారని.. ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు, నగర శివారు జిల్లాలోనూ పలు అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకునేందుకు దోహద పడ్డారని సమాచారం.

అలిగినవారిని బుజ్జగిస్తూ..

సికింద్రాబాద్, మల్కాజిగిరి ఎంపీ స్థానాల పరిధిలో అభ్యర్థులు ఖరారు అయిన తర్వాత.. కొందరు కాంగ్రెస్ నేతలు తమకు సీటు దక్కలేదని అలకబూనారు. దీనికితోడు.. ఆ రెండుచోట్లా కాంగ్రెస్ అభ్యర్థులు దానం నాగేందర్, పట్నం సునీత మహేందర్ రెడ్డి మొన్నటి వరకూ వేరే పార్టీలో ఉన్నారు. దీంతో.. వారికి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులతో సమన్వయం లేదు. వారితో కొందరు కలిసిపోతున్నా.. మరికొందరు సహకరించే పరిస్థితి లేదు. అలాంటిచోట్ల సీఎం సన్నిహితుడు వారి మధ్య సమన్వయం కుదిర్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఉదాహరణకు.. ఖైరతాబాద్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం జరిగినప్పుడు.. మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసిన పీజేఆర్ కూతురు విజయారెడ్డికి సమాచారం ఇవ్వలేదు. ఇది పార్టీలో విభేదాలకు అద్దం పట్టే ఘటన. ఈ నేపథ్యంలో.. సదరు ట్రబుల్ షూటర్.. విజయా రెడ్డి, దానం నాగేందర్ మధ్య సమన్వయం కుదిర్చి, ఇద్దరూ కలిసే లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కొనే విధంగా సర్దుబాటు చేసినట్లు తెలిసింది. అదేవిధంగా బొంతు రామ్మోహన్‌ను ప్రచారంలో భాగం చేయడంలో కూడా ఆయన కీలకంగా వ్యవహరించినట్లు తెలిసింది. అలాగే.. నియోజకవర్గాల వారీగా బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాలు జరిపి క్షేత్రస్థాయి పరిస్థితుల గురించి తెలుసుకున్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో బూత్‌ల వారిగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలకు వచ్చిన ఓట్ల గురించి.. కష్టపడితే ఓట్లు వచ్చేందుకు ఉన్న అవకాశాలున్న ప్రాంతాల గురించి ఆయన ఆరా తీస్తునట్లు తెలిసింది. అధికంగా పోలింగ్ జరిగే కాలనీలు, బస్తీలలో బూత్‌ల వారిగా ఓట్లు వేయించే ఇతర పార్టీల కార్యకర్తలనూ కాంగ్రెస్‌లో చేర్చుకోవడం, వారికి స్థానికంగా బాధ్యతలు అప్పగించడం వంటి చర్యలను ఆయన తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

లోక్‌సభ ఎన్నికల లెక్క వేరు!

అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా పార్లమెంటు ఎన్నికల ఫలితాలు

- 2018లో అధికారంలోకి బీఆర్‌ఎస్
- 2019లో పార్లమెంటు ఎన్నికల్లో దక్కని ఆ స్థాయి ఫలితాలు
- ఐదు నెలల వ్యవధిలోనే భారీ తేడా
- జాతీయ పార్టీల వైపు ఓటర్ల మొగ్గు
- బీఆర్‌ఎస్ పట్ల ఈసారీ.. అదే ధోరణి అంటున్న సర్వేలు
- వాస్తవ ఫలితం ఎలా ఉండేనో?



(ఆంధ్రజ్యోతి, సెంట్రల్ డెస్క్)

తెలంగాణ ఓటర్లు శాసనసభ ఎన్నికల్లో ఒక రకంగా, పార్లమెంటు ఎన్నికల విషయంలో మరోలా స్పందిస్తున్నారా? ఎమ్మెల్యేలుగా ఒక పార్టీ అభ్యర్థులను గెలిపిస్తూ.. ఎంపీలుగా మరో పార్టీవైపు మొగ్గుతున్నారా? అంటే.. గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఫలితాలను బట్టి చూస్తే ఇది నిజమేననిపిస్తోంది. 2018లో జరిగిన ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో నాటి అధికార పార్టీ అయిన బీఆర్‌ఎస్ 88 ఎమ్మెల్యే సీట్లను గెలుచుకుని వరుసగా రెండోసారి రాష్ట్రంలో అధికారంలోకి రావడం తెలిసిందే. కానీ, ఆ వెంటనే జరిగిన 2019 పార్లమెంటు ఎన్నికల్లో కారు స్పీడుకు బ్రేకులు పడ్డాయి. రాష్ట్రంలోని మొత్తం 17 ఎంపీ స్థానాలకుగాను బీఆర్‌ఎస్ 9 మాత్రమే దక్కించుకోగలిగింది. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన సీట్లు, ఓట్లను చూసి.. పార్లమెంటు ఎన్నికల్లోనూ తమదే హవా అని గులాబీ నేతలు భావించారు. ఇతర పార్టీల నుంచి గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు సైతం అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో 17 పార్లమెంటు స్థానాల్లో తమ మిత్రపక్షంగా పేర్కొన్న ఎంఐఎంకు ఒక స్థానం పోను 16 ఎంపీ సీట్లను తామే గెలుచుకుంటామని ప్రకటించారు. 'సారు.. కారు.. పదహారు' నినాదంతో పార్లమెంటు ఎన్నికలకు వెళ్లారు. కానీ, వారి అంచనాలు తలకిందులై తొమ్మిది స్థానాలకే పరిమితమయ్యారు. అనూహ్యంగా జాతీయ పార్టీలైన బీజేపీ నాలుగు, కాంగ్రెస్ మూడు స్థానాలను దక్కించుకున్నాయి.

అత్యధిక ఓట్లు వచ్చిన ఎంపీ స్థానాల్లోనూ ఓటమి

2018 శాసనసభ ఎన్నికల్లో 15 పార్లమెంటు స్థానాల పరిధిలో మెజారిటీ ఓట్లను బీఆర్‌ఎస్సే సాధించింది. కొన్ని ఎంపీ స్థానాల పరిధిలో మెజారిటీ అసెంబ్లీ సీట్లను కోల్పోయినా.. ఓట్లపరంగా మాత్రం గులాబీ పార్టీకే ఆధిక్యం దక్కింది. కానీ, 2019 పార్లమెంటు ఎన్నికలు వచ్చేటప్పటికి ఆ ఆధిక్యాన్ని బీఆర్‌ఎస్ నిలబెట్టుకోలేకపోయింది. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, సికింద్రాబాద్ పార్లమెంటు స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన బీఆర్‌ఎస్.. పార్లమెంటు ఎన్నికలు వచ్చేటప్పటికి చతికిలబడింది. ఈ స్థానాలను అనూహ్య రీతిలో బీజేపీ దక్కించుకుంది. ఇక నల్లగొండ, భువనగిరి, మల్కాజిగిరి ఎంపీ స్థానాల పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ ఓట్లలో కారుదే పైచేయి అయినా.. ఈ సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అంటే.. శాసనసభ ఎన్నికలు జరిగిన ఐదు నెలల వ్యవధిలోనే ఓటర్లు భిన్నమైన తీర్పునిచ్చారు. రాష్ట్రంలో అధికార పార్టీగా ఉన్నా కూడా బీఆర్‌ఎస్‌ను కాదని.. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓటర్లు మద్దతు పలికారు. ఇందుకు పలు కారణాలను విశ్లేషకులు ఉదహరించారు. రాష్ట్రంలో రెండోసారి అధికారంలోకి రావడం, అది కూడా 2014 కన్నా ఎక్కువ సీట్లు గెలుచుకోవడంతో బీఆర్‌ఎస్ నాయకత్వం అతివిశ్వాసానికి పోయిందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

గతం కన్నా బలహీనంగా బీఆర్‌ఎస్..!

గత పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే.. ఈసారి బీఆర్‌ఎస్ బలహీనపడిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ తరఫున 39 మంది ఎమ్మెల్యేలు గెలిచిన నేపథ్యంలో ఆ నిష్పత్తి ప్రకారం 5 నుంచి 6 ఎంపీ సీట్లను ఆ పార్టీ గెలుచుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు.. ఓట్లపరంగా కూడా 7 పార్లమెంటు స్థానాల పరిధిలో బీఆర్‌ఎస్‌కు ఆధిక్యం లభించింది. కానీ, తాజా ఎన్నికల్లో ఆ పరిస్థితులు లేవని పలు సర్వేలు చెబుతున్నాయి. ఏబీపీ సీ ఓటరు, ఇండియా టీవీ సీఎన్‌ఎక్స్, న్యూస్ 18 వంటి సంస్థలు.. తాము నిర్వహించిన ఒపీనియన్ పోల్‌లో కేసీఆర్ పార్టీకి ఒకటి, రెండు ఎంపీ సీట్లు మాత్రమే వస్తాయని వెల్లడైనట్లు తెలిపాయి. రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో ఆ పార్టీ నేతలు కాంగ్రెస్‌లోకి క్యూ కట్టడం, ఎంపీ అభ్యర్థులుగా ఎంపిక చేసినవారు సైతం ఇతర పార్టీల్లోకి వెళ్లిపోవడం వంటివి బీఆర్‌ఎస్ బలహీనపడిన విషయాన్ని స్పష్టం చేస్తోందని పేర్కొన్నాయి. అయితే సర్వేల నివేదికలు ఎలా ఉన్నా.. వాస్తవ పరిస్థితులు ఎలా ఉంటాయో తేలాలంటే మాత్రం జూన్ 4 దాకా వేచి చూడాల్సిందే.

పార్లమెంటు స్థానాల పరిధిలో ఫలితాలు ఇలా

	2018 అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించిన పార్టీ	2019 పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చిన ఓట్లు	2019 పార్లమెంటు ఎన్నికల్లో గెలిచిన పార్టీ సాధించిన ఓట్లు	2023అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించిన పార్టీ
ఆదిలాబాద్	బీఆర్‌ఎస్ - 514706	318701	బీజేపీ - 377194	బీఆర్‌ఎస్ - 465476
కరీంనగర్	బీఆర్‌ఎస్ - 692256	408768	బీజేపీ - 498276	బీఆర్‌ఎస్ - 517601
నిజామాబాద్	బీఆర్‌ఎస్ - 569406	408947	బీజేపీ 480584	బీఆర్‌ఎస్ - 417315
మల్కాజిగిరి	బీఆర్‌ఎస్ - 827127	592829	కాంగ్రెస్ - 603748	బీఆర్‌ఎస్ - 938064
సికింద్రాబాద్	బీఆర్‌ఎస్ - 429390	322666	బీజేపీ - 384780	బీఆర్‌ఎస్ - 67368
నల్లగొండ	బీఆర్‌ఎస్ - 606215	500346	కాంగ్రెస్ - 526028	కాంగ్రెస్ - 766059
భువనగిరి	బీఆర్‌ఎస్ - 595501	527576	కాంగ్రెస్ - 532795	కాంగ్రెస్ - 817279
మహబూబాబాద్	కాంగ్రెస్ - 498549	315446	బీఆర్‌ఎస్ - 462109	కాంగ్రెస్ - 685897
పెద్దపల్లి	బీఆర్‌ఎస్ - 463506	441321	బీఆర్‌ఎస్ - 441321	కాంగ్రెస్ - 682033
జహీరాబాద్	బీఆర్‌ఎస్ - 576433	434244	బీఆర్‌ఎస్ - 434244	కాంగ్రెస్ - 5,43,817
మెదక్	బీఆర్‌ఎస్ - 739830	596048	బీఆర్‌ఎస్ - 596048	బీఆర్‌ఎస్ - 668955
హైదరాబాద్	ఎంఐఎం - 495992	517471	ఎంఐఎం - 517471	ఎంఐఎం - 425476
చేవెళ్ల	బీఆర్‌ఎస్ - 649291	528010	బీఆర్‌ఎస్ - 528010	బీఆర్‌ఎస్ - 707456
మహబూబ్‌నగర్	బీఆర్‌ఎస్ - 577576	411402	బీఆర్‌ఎస్ - 411402	కాంగ్రెస్ - 611514
నాగర్ కర్నూల్	బీఆర్‌ఎస్ - 635415	499672	బీఆర్‌ఎస్ - 499672	కాంగ్రెస్ - 637872
వరంగల్	బీఆర్‌ఎస్ - 671766	612498	బీఆర్‌ఎస్ - 612498	కాంగ్రెస్ - 661545
ఖమ్మం	బీఆర్‌ఎస్ - 518194	567459	బీఆర్‌ఎస్ - 567459	కాంగ్రెస్ - 732293



గురువుగారూ.. బాగున్నారా!

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సోమవారం.. తనకు ఇంటర్మీడియట్‌లో పాఠాలు చెప్పిన గురువును కలుసుకున్నారు. ఆదివారం జగిత్యాలలో బస్సుయాత్ర ముగించుకొని అక్కడే రాత్రి బస చేసిన కేసీఆర్.. సోమవారం నిజామాబాద్ బస్సుయాత్రకు బయలుదేరుతూ తన గురువు, రిటైర్డ్ లెక్చరర్, చరిత్రకారుడు, ప్రముఖ కవి జైశెట్టి రమణయ్య ఇంటికి వెళ్లారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న రమణయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కొద్దిసేపు వారి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. రమణయ్యకు కొన్ని పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ కళాశాలలో కేసీఆర్ ఇంటర్ చదివిన నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. - ఆంధ్రజ్యోతి, జగిత్యాల

వెరీ గుడ్డు ఎవరో..
గాడిద గుడ్డు ఎవరికో!

- రాష్ట్రంలో 'గాడిద గుడ్డు' కేంద్రంగా ప్రచారం
- ముఖ్యనేతల నుంచి ద్వితీయ శ్రేణి కేడర్ దాకా 'గుడ్డు' జపమే



హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఇప్పుడు 'గాడిద గుడ్డు' బాగా పాపులర్ అయింది. ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో 'గుడ్డు' చుట్టూ రాజకీయం జరుగుతోంది. ఈ ఎన్నికల ప్రచారంలోనే తెలంగాణలో చిత్రవిచిత్ర పదాలు, వ్యవహారాలు చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. ఏ అంశంపై మాట్లాడినా, ఏ చర్చ జరిగినా.. అటు తిరిగి, ఇటు తిరిగి చివరకు 'గాడిద గుడ్డు'కే లంకె పెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధుల్లో తెలంగాణకు ఏమీ ఇవ్వలేదని, కేవలం "గాడిద గుడ్డు"నే ఇచ్చిందంటూ ఓ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడంతో ఈ గుడ్డు వ్యవహారం మొదలైంది. అది ఇప్పుడు ఎంతవరకూ వెళ్లిందంటే.. ప్రధాన రాజకీయ పార్టీలు నిర్వహించే బహిరంగ సభలు, సమావేశాలు, కార్నర్ మీటింగ్‌లలో మాట్లాడే నాయకులంతా 'గాడిద గుడ్డు' పదంతోనే ప్రసంగాన్ని మొదలుపెడుతున్నారు. దానితోనే ముగిస్తున్నారు. అన్ని పార్టీల ముఖ్యనేతలందరూ ఈ పదాన్ని విరివిగా వాడుతుండడంతో ద్వితీయ శ్రేణి కేడర్ కూడా ఇదే పదాన్ని జపిస్తున్నారు. మరోవైపు గుడ్డునే ప్రధాన అంశంగా చేసుకుని సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. వెరసి ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అన్ని పార్టీలు 'గాడిద గుడ్డు' కేంద్రంగానే ప్రచారం నిర్వహిస్తున్నాయి. దీంతో జనం కూడా దీనిపై చర్చించుకుంటున్నారు. పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినపుడు టీచర్లు ఇచ్చే వెరీగుడ్డు అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఛలోక్తులు విసురుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మే 13న జరగబోయే పోలింగ్‌లో "వెరీగుడ్డు" ఎవరో, 'గాడిద గుడ్డు' ఎవరికో తేలుతుందంటున్నారు.



హిందువులకు రేవంత్ క్షమాపణ చెప్పాలి: లక్ష్మణ్



హిందూ సమాజానికి సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. హిందూ దేవుళ్లను కించపరిచేలా రేవంత్ వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. పవిత్రమైన అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యమని ప్రకటించడం భావ్యమా..? అని నిలదీశారు. బీసీలకు రిజర్వేషన్లపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అనుసరిస్తోందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక గాడిద గుడ్డు చూపుతున్నారని రేవంత్‌ను విమర్శించారు.

అద్దంకిపై చర్యలు తీసుకోండి:బీజేపీ

హైదరాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యంతర వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు మాధవి, రామారావు తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం సీఈవో వికాస్‌రాజ్‌ను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు. ప్రధాని మోదీని అసభ్యకర పదజాలంతో దూషించారని, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కించపరిచేలా మాట్లాడారని తెలిపారు.

'సైబర్ ఫోరెన్సిక్'కు అమిత్ షా ఫేక్ వీడియో

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఫేక్ వీడియో వ్యవహారంలో సాంకేతిక అంశాలపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. వీడియో మార్ఫింగ్‌పై సాంకేతిక అంశాలను నిగ్గు తేల్చేందుకు సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఫోరెన్సిక్ నివేదిక ఈ కేసులో అత్యంత కీలకంగా మారనుంది. తొలుత ఈ వీడియో ఎవరి ఖాతా నుంచి అప్‌లోడ్ అయ్యిందనేదానిపై దిగ్గజ మైక్రోబ్లాగింగ్ సంస్థ ఎక్స్ నుంచి సేకరించారు. కాగా.. ఫేక్ వీడియో వ్యవహారంపై హైదరాబాద్ పోలీసులూ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఐదుగురిని అరెస్టు చేయగా.. కేసు వివరాలను ఢిల్లీ పోలీసులకు అందజేసినట్లు హైదరాబాద్ సీపీ శ్రీనివా‌స్‌రెడ్డి తెలిపారు.

హిందూయిజం పేరుతో హిందువులకే ద్రోహం

- పార్లమెంటు ఎన్నికల్లో మోదీకి గుణపాఠం చెప్పాలి
- హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్

బర్కత్‌పుర, మే 6 (ఆంధ్రజ్యోతి): నిరంకుశంగా వ్యవహరిస్తున్న ప్రధాని మోదీకి రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు సరైన గుణపాఠం చెప్పాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్ర కుమార్ పిలుపునిచ్చారు. బీజేపీని, బీఆర్ఎస్‌ను ఓడించి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ఆయన కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమికి ఓటు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికలు 2024-రాజ్యాంగ పరిరక్షణ అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ, రాజ్యాంగ వ్యవస్థలను బీజేపీ ప్రభుత్వం నాశనం చేస్తోందని ఆరోపించారు. హిందూయిజం పేరుతో హిందువులకే బీజేపీ ప్రభుత్వం ద్రోహం చేస్తోందని విమర్శించారు. ప్రొఫెసర్ పీ.ఎల్. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, బీజేపీని ఓడిస్తేనే రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవచ్చని అన్నారు. దేశానికి మోదీ చేసిందేమీ లేదని, మరోసారి ఆయన అధికారంలోకి వస్తే అన్ని వ్యవస్థలు సర్వనాశనం అవుతాయని అన్నారు.

కాంగ్రెస్‌పై కుట్ర చేస్తే బీజేపీకి సమాధే: చనగాని

హైదరాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి):సీఎం రేవంత్‌రెడ్డిపై కుట్రలు చేయాలని చూస్తే మోదీ, అమిత్‌షాలను హైదరాబాద్‌లో అడుగు పెట్టనీయబోమని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ హెచ్చరించారు. దేశాన్ని పదేళ్లు పాలించిన మోదీ.. తెలంగాణకు ఏం చేశారని నిలదీశారు. రాష్ట్రంలో బీజేపీ మత రాజకీయాలకు తావు లేదని, కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనపై కుట్రలు చేస్తే బీజేపీకి రాష్ట్రంలో సమాధి కడతామని పేర్కొన్నారు.

గల్ఫ్ కార్మిక ద్రోహి అరవింద్... కాంగ్రెస్ చార్జిషీట్

హైదరాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ బీజేపీ అభ్యర్థి, ఎంపీ ధర్మపురి అరవింద్‌పై 'గల్ఫ్ కార్మిక ద్రోహి.. గప్పాల అరవింద్' పేరిట టీపీసీసీ ఎన్నారై సెల్ చార్జిషీటు విడుదల చేసింది. సోమవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి, టీపీసీసీ ఎన్నారై సెల్ నేతలు భీంరెడ్డి, దేవేందర్‌రెడ్డి ఆ చార్జిషీట్‌ను విడుదల చేశారు. గల్ఫ్ కార్మికుల కనీస వేతనాలను తగ్గిస్తూ 2020లో కేంద్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేస్తే ప్రభుత్వానికి కనీసం వినతిపత్రం ఎందుకు ఇవ్వలేదని అందులో నిలదీశారు. హైదరాబాద్‌లో సౌదీ అరేబియా, కువైట్ దేశాల కాన్సులేట్‌ల ఏర్పాటు కోసం కేంద్రానికి లేఖ కూడా రాయడం చేతగాని అజ్ఞాని అని ప్రవాసి భారతీయ బీమా యోజన' లో సహజ మరణాన్ని చేర్చకుండా తప్పించుకు తిరుగుతున్న గల్ఫ్ ద్రోహి అని అరవింద్‌ను విమర్శించారు.

తెలంగాణలో కాంగ్రెస్‌కు 10-12 సీట్లు: ఐవోసీ

హైదరాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 10 నుంచి 12 సీట్లు గెలుచుకోనుందని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్(ఐవోసీ) కార్యదర్శి ఆరతి కృష్ణన్ అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకోసం ఐవోసీ పని చేసిందని, లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను గెలిపించేందుకే తాము వచ్చామని ఐవోసీ ప్రతినిధి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మత విద్వేశాలను రెచ్చగొట్టి బీజేపీ లబ్ధి పొందాలని చూస్తోందని ఏఐసీసీ నేత ఖలీల్ ఉర్ రెహమాన్ అన్నారు. ఆ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా ఈసారి గెలిచేది కాంగ్రెస్సేనని, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని ఆయన అన్నారు.

ఏ అధికారంతో ఢిల్లీ పోలీసులు వచ్చారు

- రేణుకా చౌదరి

హైదరాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పోలీసులు ఏ అధికారంతో తెలంగాణలో దిగారని కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి ప్రశ్నించారు. ఏ హక్కుతో గాంధీభవన్‌కు వచ్చి తమ వారిపై కేసులు పెడుతున్నారని నిలదీశారు. తెలంగాణ తడాఖా ఏంటో చూపించాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. బీజేపీ వారికి దమ్ముంటే ప్రజ్వల్ రేవణ్ణను పట్టుకోవాలని ఆమె అన్నారు. రేవణ్ణను బలపరిస్తే తనను బలపర్చినట్లేనంటూ ప్రధాని మోదీ సిగ్గులేకుండా మాట్లాడుతున్నారన్నారు.



చౌటుప్పల్ బీజేపీ జనసభకు హాజరైన కార్యకర్తలు, నాయకులు, అభిమానులు

మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

మైనారిటీ రిజర్వేషన్లను రద్దు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని తెలిపారు. కర్ణాటకలో బీజేపీ సర్కారు ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేసిందని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ముస్లిం లీగ్, తబ్లీగీ జమాత్ ఎజెండాను అనుసరిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రాముడికి, సనాతన ధర్మానికి వ్యతిరేకమని విమర్శించారు. కాంగ్రెస్ జమానాలో అవినీతి, పాలసీలు తయారు చేయలేని అచేతనమైన పాలన కొనసాగిందని విమర్శించారు. మోదీ పాలనతో దేశం స్వయం సమృద్ధిని సాధించి ప్రపంచంలోనే అగ్రగామిగా రూపొందిందని పేర్కొన్నారు. 2014లో ప్రపంచ జీడీపీలో 11వ స్థానంలో ఉన్న దేశాన్ని మోదీ సర్కారు ఐదో స్థానంలోకి తీసుకువచ్చిందన్నారు. ఫార్మా రంగంలో ప్రపంచంలోనే 2వ స్థానంలో ఉన్న భారత్.. నాణ్యమైన మందులను చౌక ధరకే అందిస్తోందని నడ్డా పేర్కొన్నారు.

పార్టీ ముఖ్య నేతలతో నడ్డా సమీక్ష

వచ్చే ఐదు రోజులు అప్రమత్తంగా ఉండాలని ఎక్కడ లోపాలు ఉన్నా సరిద్దుకోవాలని జేపీ నడ్డా రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలకు సూచించారు. ప్రత్యర్థులు ఓటర్లకు ఇచ్చే ప్రలోభాలపై ఎక్కడికక్కడే స్పందించాలని అన్నారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో నడ్డా సమీక్ష నిర్వహించారు. 17 పార్లమెంట్ సెగ్మెంట్ల వారీగా కొన



నల్లగొండ జిల్లా కేంద్రంలోని జన సభలో కరవాలం చూపుతున్న నడ్డా

సాగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

12 స్థానాల్లో గెలవబోతున్నాం..?: బీఎల్ సంతోష్

రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతారని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతుంటే ప్రజలెవరూ నమ్మడం లేదని బీజేపీ జాతీయ సంఘటన కార్యదర్శి బీఎల్ సంతోష్ అన్నారు. మూడోసారి మోదీ ప్రధాని అవుతున్నారని, ఐదు రోజులు కష్టపడి పనిచేస్తే రాబోయే ఐదేళ్లు మనవేనని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర శక్తికేంద్రాల ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో సంతోష్ మాట్లాడారు. రాష్ట్రంలో 12 ఎంపీ స్థానాలను గెలువబోతున్నామని చెప్పారు.

బీజేపీ ప్రచారానికి కాకతీయ వారసుడు కమలచంద్ర

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఐదు రాష్ట్రాల్లో స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరిస్తున్న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రాజు, కాకతీయ రాజవంశం 22వ వారసుడు కమలచంద్ర భంజ్‌దేవ్ బీజేపీ తరఫున ప్రచారం చేసేందుకు ఖమ్మం వచ్చారు. ఖమ్మం అభ్యర్థి తాండ్ర వినోదరావుతో ఉన్న స్నేహాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన విజయం కోసం ఐదు రోజుల పాటు నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం కమలచంద్ర హైదరాబాద్ నుంచి ఖమ్మం వస్తూ మార్గమధ్యంలో ఖమ్మం జిల్లా కూసుమంచిలో ఆగారు. అక్కడ కాకతీయు కాలంలో నిర్మించిన పురాతన శివాలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

దేశ భవిత కోసం మోదీ పోరాటం

- ప్రధాని కావాలని రాహుల్ గాంధీ ఆరాటం
- బీజేపీ ఏలుబడిలో ఉగ్రవాదులపై ఉక్కుపాదం
- మోదీ సుపరిపాలన వల్లే అది సాధ్యం: కిషన్‌రెడ్డి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ తోడు దొంగలు: పుష్కర్ సింగ్



రోడ్‌షోలో కిషన్ రెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): ప్రధాని మోదీ దేశ భవిష్యత్ కోసం పని చేస్తుంటే, రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పని చేస్తున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన మోదీకి పేదల కష్టాలు తెలుసని.. అందుకే దేశ వ్యాప్తంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. 13 కోట్ల పేద కుటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించి వారి ఆత్మగౌరవాన్ని కాపాడారని పేర్కొన్నారు. సోమవారం ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని కమీష్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన యువ సమ్మేళనంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేశంలో పాకిస్తాన్ ఉగ్రవాదుల అరాచకాలు విపరీతంగా ఉండేవని, అనేక మంది దేశ పౌరులను హత్య చేశారని తెలిపారు. ప్రస్తుతం దేశంలో ఆ పరిస్థితి లేదని, మోదీ సుపరిపాలన వల్లే అది సాధ్యమైందని అన్నారు. ఉక్రెయిన్‌లో యుద్ధం జరుగుతున్న సమయంలో 25వేల మంది భారత పౌరులు ఆ దేశంలో చిక్కుకుంటే.. యుద్ధాన్ని ఆపి వారిని స్వదేశానికి తీసుకువచ్చేందుకు ప్రధాని మోదీ ఎంతో కృషిచేశారని కొనియాడారు. నగరంలో గతంలో 35 శాతం ఓటింగ్ మాత్రమే జరిగేదని ఈసారి ఓటింగ్ శాతాన్ని పెద్ద ఎత్తున పెంచాలన్నారు. అందుకు యువత సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. మరోసారి తనను ఎంపీగా గెలిపించాలని కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో సాయంత్రం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే పాల్గొన్నారు. సనత్‌నగర్ పోలీసు స్టేషన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ.. స్వామి థియేటర్, బేగంపేట విమానాశ్రయం, జేమ్స్ స్ట్రీట్, ముషీరాబాద్ ఎక్స్ రోడ్ మీదుగా బాపునగర్ వరకు సాగింది. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను తొలగిస్తామని ప్రధాని మోదీ అనలేదని, మతపరమైన రిజర్వేషన్లు వద్దు అని మాత్రమే అన్నారని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తోడు దొంగలని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి ధ్వజమెత్తారు. కేసీఆర్ కుటుంబం అవినీతికి పాల్పడిందని, ఆయన కూతురు జైల్లో ఉందని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలపై కేసులు ఉన్నాయని వారు బెయిల్‌పై బయట ఉన్నారని పేర్కొన్నారు. మహబూబాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్‌కు మద్దతుగా వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం నిర్వహించిన జన సభలోనూ పుష్కర్‌సింగ్ ధామి మాట్లాడారు.కాంగ్రెస్.. అవినీతి, కుంభకోణాల పార్టీ అని ప్రజలు ఆ పార్టీని నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవు

- పార్టీలకు ఎన్నికల కమిషన్ హెచ్చరిక

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి) : సోషల్‌మీడియాను దుర్వినియోగం చేయొద్దని, ఎన్నికల సమయంలో తప్పుడు ప్రచారాలు చేస్తున్న రాజకీయ పార్టీలపై చర్యలు తప్పవని ఎన్నికల సంఘం (ఈసీఐ) హెచ్చరించింది. ఈ మేరకు అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులు, ఇతర ప్రతినిధులకు సూచనలు చేస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. సోషల్ మీడియా వేదికను బాధ్యతాయుతంగా ఉపయోగించాలని, వీటి వినియోగంలో నైతికత పాటిస్తూ.. రాజకీయ పార్టీలు ప్రచారం చేసుకోవాలని పేర్కొంది. సామాజిక మాధ్యమాలను తప్పుడు ప్రచారాలకు ఉపయోగించడం ఎన్నికల కోడ్‌కు విరుద్ధమని తెలిపింది. ప్రజలను తప్పుదోవ పట్టించే అసత్య ప్రచారాలను, రెచ్చగొట్టే వ్యాఖ్యలను పోస్టు చేయడం తగదని సూచించింది. క్షేత్రస్థాయిలో ప్రజలు చెబుతున్న అభిప్రాయాలను సైతం కొందరు సోషల్ మీడియాలో తారుమారు చేస్తున్నారని వెల్లడించింది. ఆయా రాజకీయ పార్టీలు, వారికి సంబంధించిన ప్రతినిధులు సోషల్ మీడియా ద్వారా ఇటువంటి తప్పుడు ప్రచారం, అనైతిక చర్యలకు పాల్పడితే వారిపై సెక్షన్ 66సీ, 66డీ ఐటీ ఆక్ట్, సెక్షన్ 123(4) ఆర్‌పీ ఆక్ట్ (1951), 171జీ, 465, 469, 505 ఐపీసీ సెక్షన్ల కింద కఠిన చర్యలు తీసుకుంటామని ఈసీఐ హెచ్చరించింది.

సంజయ్ యూత్ ఐకాన్

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్న అన్యాయంపై ఉద్యమిస్తున్నారని అన్నారు. కుటుంబ పాలనకు, అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని చెప్పారు. ప్రజా సమస్యలపై ఎలుగెత్తుతున్న పోరాటయోధుడని కొనియాడారు. ప్రజా సమస్యలపై ఉద్యమించినందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం సంజయ్‌ని అవమానించిందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా ఆయన్ను ఇబ్బంది పెడుతోందని పేర్కొన్నారు. సంజయ్ నిర్వహించిన ప్రజా సంగ్రామ యాత్రలో తానూ పాల్గొన్నానని, మండే ఎండను సైతం లెక్కచేయకుండా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్న తీరు అభినందనీయమని ప్రశంసించారు. సంజయ్ పాదయాత్రను ఆదర్శంగా తీసుకోవాలని ప్రధాని మోదీ తమకు పిలుపునిచ్చారని చెప్పారు. బీఆర్ఎస్ అవినీతిపై పోరాటం చేసినందుకు ఆయన్ను నాటి ప్రభుత్వం అనేకసార్లు జైలుకు పంపిందని గుర్తు చేశారు. ఆయన సేవలను గుర్తించిన జాతీయ నాయకత్వం, జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిందని తెలిపారు. దక్షిణ భారతాన పార్టీని ఆయన మరింత బలోపేతం చేస్తారన్న విశ్వాసం తనకు ఉందని చెప్పారు. సంజయ్ కేంద్రం నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చారని



జమ్మికుంటలో మాట్లాడుతున్న తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై

తెలిపారు. కరీంనగర్ ప్రజలు ఆయనకు చరిత్రాత్మక విజయాన్ని అందిస్తారన్న విశ్వాసం ఉందని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ నియోజకవర్గంలో పోలైన ఓట్లలో 60 శాతం ఓట్లు సంజయ్‌కి పడేలా ఇంటింటికీ తిరిగి గెలిపించాలని యువతను కోరారు.

రిజర్వేషన్లకు మోదీ అనుకూలం: సంజయ్

తాము పువ్వు గుర్తుకు ఓటేయాలని తిరుగుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం గాడిద గుడ్డు గుర్తు పట్టుకుని తిరుగుతున్నాడని.. కాబట్టి కాంగ్రెస్‌కు ఓటేయాలనుకునే వాళ్లు బ్యాలెట్‌లో గాడిద గుడ్డు గుర్తు ఉంటేనే ఓటేయాలని బండి సంజయ్ చెప్పారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. మహిళలకు నెలకు రూ.2,500, రైతు భరోసా కింద రూ.15వేలు, స్థలం ఉంటే ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి మాట తప్పారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులను జనం తిడుతున్నారని.. ఆ చర్చను పక్కదారి పట్టించేందుకు రేవంత్‌రెడ్డి గాడిద గుడ్డు గుర్తు ఎత్తుకున్నారని విమర్శించారు. భారతదేశ సింగమలై.. మన అన్నామలై.. అని ప్రశంసించారు. ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి బీజేపీలో చేరి ప్రజా సమస్యలపై యుద్ధం చేస్తున్న నేత అని కొనియాడారు. కాగా, రిజర్వేషన్లు రద్దు చేయబోమని బీజేపీ కార్యకర్తలతో సంజయ్ ప్రమాణం చేయించారు. సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో నియోజకవర్గ స్థాయి బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడారు. రిజర్వేషన్లు రద్దు చేస్తామన్న వారిని చెప్పులు, చీపుర్లతో తరిమి కొట్టాలని అన్నారు. ప్రధాని మోదీ రిజర్వేషన్లకు అనుకూలంగా ఉన్నారని తెలిపారు.

రైతుభరోసా డబ్బులొచ్చాయ్!

- ఐదెకరాలకు మించి భూమి ఉన్న రైతులకు నిధుల విడుదల

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా పెండింగ్‌లో ఉన్న రైతుభరోసా డబ్బులు వచ్చేశాయి. ఐదెకరాలకు మించి భూమి ఉన్న రైతులకు నిధులు విడుదల చేశారు. సోమవారం రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,423 కోట్లు ఆర్థికశాఖ జమచేసింది. ఇదివరకు ఐదెకరాల్లోపు భూమి ఉన్న అన్నదాతలకు రైతుభరోసా సాయం అందించారు. ఇప్పుడు అంతకు మించి భూమి ఉన్న రైతులకు కూడా ప్రభుత్వం చెల్లించింది. రైతుభరోసా డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమకాగానే రైతుల సెల్‌ఫోన్లకు సందేశాలు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 68.99 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలుండగా.. ధరణి రికార్డుల ప్రకారం 1.52 కోట్ల ఎకరాల భూమి ఉంది. ఈమేరకు రూ.7,625 కోట్లు అవసరం. అయితే ఐదెకరాల వరకు భూమి ఉన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే రూ.5,202 కోట్లు విడుదల చేసింది. ఐదెకరాలకు మించి భూమి ఉన్న రైతులకు రూ.2,423 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా ఈనెల 8 వరకు రైతుభరోసా బకాయిలు చెల్లిస్తామని సీఎం రేవంత్ ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో సోమవారం రూ.2,423 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో మొత్తం 1.52 కోట్ల ఎకరాలకు రూ.7,625 కోట్లు రైతుభరోసా పథకంలో చెల్లించినట్లయింది. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.5వేల చొప్పున చెల్లించింది. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి ఎకరానికి రూ.7,500 చొప్పున రేవంత్ సర్కారు ఇవ్వబోతోంది.

ప్రైవేటు 'కీ'లతో నీట్ విద్యార్థుల కుస్తీ

- ర్యాంకులు, సీట్లపై అంచనాలు
- ఏ కోటాలో సీటు వస్తుందనే లెక్కలు
- రాష్ట్రంలో మొత్తం 8,540 వైద్య సీట్లు
- కొత్తగా 9 కాలేజీలు అందుబాటులోకి వస్తే మరో 450

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నీట్-యూజీ పరీక్ష ముగిసింది. పరీక్ష రాసిన విద్యార్థులంతా ప్రైవేటు కోచింగ్ సంస్థలు, విద్యా సంస్థలు విడుదల చేసిన 'కీ'ని పట్టుకొని తమకు ఎన్ని మార్కులు వస్తాయి.. ఎంత ర్యాంకు వస్తుంది.. ఏ కోటాలో సీటు లభిస్తుందనే దానిపై అంచనాలు వేస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా సుమారు 80 వేల మంది విద్యార్థులు నీట్-యూజీ పరీక్షకు హాజరయ్యారు. నీట్ ఆలిండియా స్థాయి పరీక్ష ర్యాంకులను కూడా ఆలిండియా స్థాయిలోనే ప్రకటిస్తారు. ఆ ర్యాంకుల ఆధారంగానే కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తారు. మొత్తం మూడు కోటాల్లో.. కన్వీనర్ కోటా(ఏ-కేటగిరి), యాజమాన్య కోటా(బీ-కేటగిరి), ఎన్ఆర్ఐ కోటా(సీ-కేటగిరి) సీట్లు ఉంటాయి. ప్రభుత్వ కాలేజీల్లో కేవలం కన్వీనర్ కోటానే ఉంటుంది. కన్వీనర్ కోటాలో సీటు వస్తే సర్కారీ కాలేజీల్లో ఏడాదికి రూ.10వేలు, ప్రైవేటులో అయితే రూ.60 వేలు ఫీజు కింద చెల్లించాలి. ప్రైవేటులో బీ-కేటగిరీ కింద అయితే ఏడాదికి రూ.11.25 లక్షలు, సీ-కేటగిరీ కింద రూ.25 లక్షల వరకు(కాలేజీని బట్టి) ఫీజు ఉంటుంది. గతేడాది, రాష్ట్రంలో గరిష్ఠంగా 2,45,043 ర్యాంకు వచ్చిన ఎస్సీ విద్యార్థికి కన్వీనర్ కోటాలో సీటు వచ్చింది. ఓపెన్ కేటగిరీలో 452 మార్కులు సాధించిన(1,60,822 ర్యాంకు) విద్యార్థికి ప్రైవేటు మెడికల్ కాలేజీలో కన్వీనర్ కోటాలో సీటు లభించింది. ఇక, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో బీ-కేటగిరీలో గరిష్ఠంగా 4,69,431 ర్యాంకు, సీ-కేటగిరీలో గరిష్ఠంగా 12,15,627 ర్యాంకు వచ్చిన విద్యార్థులకు సీట్లు లభించాయి. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు కలిపి మొత్తం 56 మెడికల్ కాలేజీలున్నాయి. ఇందులో 28 ప్రభుత్వ కాలేజీల్లో 3,890 కన్వీనర్ సీట్లు, ప్రైవేటు కాలేజీల్లో మరో 2,325 కన్వీనర్ సీట్లు ఉన్నాయి. బీ, సీ కేటగిరీలను కూడా కలుపుకొంటే మొత్తం 8,540 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది మరో 9 ప్రభుత్వ కాలేజీలు అందుబాటులోకి వస్తే.. ఒక్కో దాంట్లో 50 సీట్ల చొప్పున 450 ఎంబీబీఎస్ సీట్లు పెరుగుతాయి.

గతేడాది కన్వీనర్ కోటా సీట్లు లభించిన గరిష్ఠ ర్యాంకులు

కేటగిరీ	మార్కులు	ర్యాంకు
ఓపెన్	452	1,60,822
బీసీ ఏ	382	2,58,239
బీసీ బీ	436	1,82,756
బీసీ సీ	379	2,66,945
బీసీ డీ	440	1,75,555
బీసీ ఈ	434	1,82,725
ఎస్టీ	400	2,30,180
ఎస్సీ	390	2,45,043

రూ.15.81 కోట్ల పంట నష్టపరిహారం విడుదల

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపరిహారం నిధులను సోమవారం విడుదల చేసింది. వడగండ్లతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల చొప్పున విడుదల చేయగా ఆ మేరకు బాధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. 15,814 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా పంట నష్టపరిహారం కింద రూ.15.81 కోట్లు విడుదల చేశారు. రాష్ట్రంలో గత మార్చి 16 నుంచి 24వరకు వడగండ్ల వానలు కురిశాయి. కామారెడ్డి జిల్లాలో 9,107మంది రైతులకు చెందిన 10,328.04 ఎకరాలు, నిజామాబాద్ జిల్లాలో 1,809 మంది అన్నదాతలకు చెందిన 1,652.25 ఎకరాలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1,036 మంది రైతులకు చెందిన 1,014.06 ఎకరాలు, సిద్దిపేటలో 793 మంది అన్నదాతలకు చెందిన రూ.746.30 ఎకరాలు, మెదక్‌లో 957మంది రైతులకు చెందిన 714.17 ఎకరాలు, ఆదిలాబాద్‌లో 370 మంది రైతులకు చెందిన 545.09 ఎకరాలు, నిర్మల్‌లో 519 మంది రైతులకు చెందిన 332.17 ఎకరాలు, మంచిర్యాలలో 376 మంది రైతులకు చెందిన 244.01 ఎకరాలు, కరీంనగర్‌లో 160 మంది అన్నదాతలకు చెందిన 160.10 ఎకరాలు, సంగారెడ్డిలో 119 మంది రైతులకు చెందిన 76.04 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మొత్తం 15,246 మంది రైతులు వడగండ్ల వానతో పంటలు కోల్పోయారు. ఈ నష్టంపై వ్యవసాయశాఖ అధికారులు ఎన్యుమరేషన్ చేసి.. బిల్లులను ఆర్థికశాఖకు పంపారు. అయితే లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం రూ.15.81 కోట్లు విడుదల చేసింది. రెండు, మూడు రోజుల్లో పంట నష్టపరిహారం పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించగా.. సోమవారం రైతుల ఖాతాల్లో నిధులు జమయ్యాయి.

ఫోన్ ట్యాపింగ్ కేసు.. కుట్రదారుల పాత్ర తేలాల్సి ఉంది

- ఎవరి పాత్ర బయటపడితే.. వారిని అరెస్టు చేస్తాం
- ప్రభాకర్‌రావుపై రెడ్‌కార్నర్ నోటీసుకు రంగం సిద్ధం
- హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌ట్యాపింగ్ కేసులో కుట్రదారుల పాత్ర ఇంకా తేలాల్సి ఉందని హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటి వరకు పోలీసు అధికారులకు సంబంధించిన సంబంధాలు బయటపడ్డాయని వివరించారు. ఈ అంశంపై సోమవారం విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. కేసు దర్యాప్తు పురోగతిని వివరించారు. అరెస్టులు కేవలం పోలీసు అధికారుల వరకేనా? లేక రాజకీయ నాయకుల అరెస్టులు కూడా ఉంటాయా? అని విలేకరుల ప్రశ్నించగా.. చాలా సున్నితమైన కేసు కావడంతో వ్యవస్థీకృతంగా దర్యాప్తు సాగుతోందని శ్రీనివాస్‌రెడ్డి సమాధానమిచ్చారు. "ఒక్కో అంకాన్ని దాటుతూ ముందుకు సాగుతున్నాం. ఇప్పటికి కేసుతో ప్రత్యక్షంగా సంబంధం ఉన్న నిందితులను అరెస్టు చేశాం. సాధారణంగా తొలుత కేసుతో ప్రత్యక్షంగా సంబంధం ఉన్నవారు అరెస్టవుతారు. ఆ తర్వాత కుట్రదారుల పాత్ర తేలుతుంది. ఎవరిపాత్ర తేలితే.. వారిని అరెస్టు చేస్తాం. కేసు నుంచి బయటపడేందుకు నిందితులు అన్ని ప్రయత్నాలు చేశారు. ఆధారాలను ధ్వంసం చేశారు. అయినా.. మేము ఆధారాలను సేకరించి ముందుకు సాగుతున్నాం" అని వివరించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏ1గా ఉన్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుపై రెడ్‌కార్నర్ నోటీసు గురించి విలేకరులు అడగ్గా.. "చట్టపరంగా దర్యాప్తు చేస్తున్నాం. న్యాయస్థానం అనుమతులు తీసుకుంటున్నాం. తొలుత అరెస్టు వారెంటు జారీ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత రెడ్‌కార్నర్ నోటీసుకు వెళ్లాలి. ఆ ప్రక్రియ కొనసాగుతోంది" అని పేర్కొన్నారు. ప్రభాకర్‌రావును భారత్‌కు రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.

నల్సార్ వర్సిటీలో ఎల్ఎల్ఎం

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లాకు చెందిన నేషనల్ అకాడమీ ఆఫ్ లీగల్ స్టడీస్, న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్(ఐఐసీఏ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఎల్ఎల్ఎం(ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ లాస్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ఇది ఫుల్ టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీని వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 66 సీట్లు ఉన్నాయి. తెలంగాణ విద్యార్థుల కోసం 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. మిగిలిన 75 శాతం సీట్లను ఆలిండియా కోటా కింద భర్తీ చేస్తారు. ఆన్‌లైన్ ఎగ్జామినేషన్, ఆన్‌లైన్ పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.



ప్రోగ్రామ్ వివరాలు: మొదటి ఏడాది నల్సార్ యూనివర్సిటీలో రెండో ఏడాది ఐఐసీఏలో చదవాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా మొదటి ఏడాది లీగల్ కాన్సెప్ట్‌లు, ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ లాస్‌లకు సంబంధించి కోర్సు వర్క్‌లు, సెమినార్లు, గెస్ట్ లెక్చర్లు, ఇంటరాక్టివ్ డిస్కషన్స్ నిర్వహిస్తారు. లీగల్ ప్రొఫెషనల్స్, ఇండస్ట్రీ నిపుణులతో కేస్ స్టడీస్ సెషన్స్ ఉంటాయి. రెండో ఏడాది స్పెషలైజేషన్ కోర్సులు, ప్రాక్టికల్ అప్లికేషన్స్ రీసెర్చ్ ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, కస్టమైజ్డ్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 54 క్రెడిట్లు నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ లేదా ఏదేని బ్యాచిలర్ డిగ్రీ ఇన్ లా పూర్తిచేసి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఇది ఆబ్జెక్టివ్ ఎగ్జామ్. ఇందులో అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. లా ఆఫ్ కాంట్రాక్ట్, సేల్ ఆఫ్ గూడ్స్ యాక్ట్, ప్రాపర్టీ లా, కంపెనీ లా, ట్యాక్స్ లా, సెబీ అండ్ క్యాపిటల్ మార్కెట్స్, కార్పొరేట్ ఫైనాన్స్ అండ్ ఐబీసీ కోడ్ అంశాలకు సంబంధించి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు. మొత్తం మార్కులు 100.

వెయిటేజీ: ఎంట్రెన్స్ ఎగ్జామ్ స్కోర్‌కు 60 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 40 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.5,000; ఓబీసీ, దివ్యాంగులకు రూ.4,000; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.3,500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 15
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్:** జూన్ 23
- **ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాలు విడుదల:** జూన్ 27
- **అడ్మిషన్ ప్రాసెస్ ప్రారంభం:** జూలై 18 నుంచి
- **వెబ్‌సైట్:** www.nalsar.ac.in
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూన్ 20 నుంచి
- **ఆన్‌లైన్ పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూన్ 24
- **తుది ఫలితాలు విడుదల:** జూలై 15
- **తరగతులు ప్రారంభం:** జూలై 22 నుంచి

సీఐటీడీలో పోస్ట్ డిప్లొమా



హైదరాబాద్, బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ)- పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్(పీడీటీడీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. కౌన్సెలింగ్ సమయంలో అర్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో అప్లయ్ చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్ విధానంలో వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని పూర్తిగా నింపి నిర్దేశిత పత్రాలు జతచేసి కొరియర్/స్పీడ్ పోస్ట్ ద్వారా సంస్థకు పంపాలి. పర్సనల్‌గా కూడా సబ్మిట్ చేయవచ్చు. ఎంపికైన అభ్యర్థులు ఇతర పార్ట్ టైమ్ కోర్సులు/ఈవెనింగ్ కోర్సులు చేయడానికి అనుమతించరు. ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్‌లో భాగంగా డిజైన్ ప్రాక్టీస్, మెట్రాలజీ, జిగ్స్ అండ్ ఫిక్చర్స్, ప్రెస్ టూల్స్ మెటీరియల్స్ అండ్ హీట్ ట్రీట్‌మెంట్, ప్రాసెస్ ప్లానింగ్, టూల్ రూం ప్రాక్టీస్, గ్యాజెస్, కటింగ్ టూల్స్, మౌల్డ్స్ ఫర్ ప్లాస్టిక్స్, డై క్యాస్టింగ్ డైస్, ఫోర్జింగ్ డైస్, ఆటోమేషన్, క్యాడ్/క్యామ్(ఆటో క్యాడ్ అండ్ మాస్టర్ క్యామ్) అంశాలు బోధిస్తారు.

- ప్రతి రోజూ ఉదయం తొమ్మిది గంటల నలభై అయిదు నిమిషాల నుంచి సాయంత్రం అయిదున్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. అభ్యర్థులకు కనీసం 85 శాతం అటెండెన్స్ తప్పనిసరి. నిర్దేశించిన మేరకు అసైన్‌మెంట్స్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ చివరలో ఫైనల్ ఎగ్జామ్ ఉంటుంది.

అర్హత: డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 27 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్: ఈ పరీక్షలో మొత్తం 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. డిప్లొమా(మెకానికల్ ఇంజనీరింగ్/టూల్, డై అండ్ మౌల్డ్ మేకింగ్)కు సంబంధించిన మూడేళ్ల సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం గంటన్నర.

- **కోర్సు ఫీజు:** సెల్ఫ్ స్పాన్సర్డ్ అభ్యర్థులకు సెమిస్టర్‌కు రూ.25,000; ఇండస్ట్రీ స్పాన్సర్డ్ అభ్యర్థులకు సెమిస్టర్‌కు రూ.35,000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.700; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.350
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూన్ 30
- **ఎగ్జామ్ సెంటర్:** డిప్లొమా బ్లాక్, సీఐటీడీ, బాలానగర్, హైదరాబాద్ - 500037
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 12
- **చిరునామా:** ప్రిన్సిపాల్ డైరెక్టర్, సీఐటీడీ, బాలానగర్, హైదరాబాద్ - 500037
- **వెబ్‌సైట్:** citdindia.org

ఐఐటీ మద్రాస్‌లో బీఎస్ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్



మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)- బీఎస్ ఇన్ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారు. ఇప్పటికే వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్, ఉద్యోగార్థులకు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది. క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు ఇంజనీరింగ్ అర్హత లేకున్నా ప్రోగ్రామర్లుగా, డేటా సైంటిస్టులుగా రాణించవచ్చు.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి. ఇందులో నాలుగు దశలు ఉన్నాయి. అవి ఫౌండేషన్ లెవెల్, డిప్లొమా లెవెల్, బీఎస్సీ డిగ్రీ లెవెల్, బీఎస్ లెవెల్.

- రెగ్యులర్ ఎంట్రీ విధానంలో దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు అసైన్‌మెంట్స్ స్కోర్, క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ఫౌండేషన్ లెవెల్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ ఇస్తారు. దీనిని పూర్తిచేసిన తరవాత డిప్లొమా లెవెల్ ప్రోగ్రామ్‌లో ఆ తరవాత బీఎస్సీలో, తరవాత బీఎస్‌లో అడ్మిషన్ లభిస్తుంది.
- ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024కు అర్హత పొందిన వారికి ఫౌండేషన్ లెవెల్ ప్రోగ్రామ్‌లో నేరుగా అడ్మిషన్ ఇస్తారు.
- ప్రోగ్రామ్ నుంచి ఏ దశలోనైనా అభ్యర్థులు నిష్క్రమించే వీలుంది. పూర్తిచేసిన కోర్సులకు సంబంధించి సంస్థ సర్టిఫికెట్ ప్రదానం చేస్తుంది.
- ఫౌండేషన్ లెవెల్లో ఎనిమిది కోర్సులు ఉంటాయి. 32 క్రెడిట్లు నిర్దేశించారు.
- డిప్లొమా లెవెల్లో ఆరు థియరీ కోర్సులు, రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. 27 క్రెడిట్లు నిర్దేశించారు. ఈ లెవెల్లో ప్రోగ్రామింగ్, డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లు ఉంటాయి. వీటిలో ఏదైనా ఒకదాన్ని లేదా రెంటినీ ఎంచుకోవచ్చు.
- బీఎస్సీ, బీఎస్ లెవెల్లో ఒక్కోదానికి 28 క్రెడిట్స్ నిర్దేశించారు.
- లెవెల్ వారీగా నిర్దేశించిన ఒక్కో అంతర్గత కోర్సు 12 వారాలు ఉంటుంది. ప్రతి వారం వీడియో క్లాసులు, అసైన్‌మెంట్స్ ఉంటాయి. మంత్లీ క్విజ్‌లు, ఎండ్ టర్మ్ ఎగ్జామ్‌లు కూడా నిర్వహిస్తారు.

అర్హత: ఇంగ్లీష్, మేథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.

- నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే రెండేళ్ల జాయింట్ సర్వీసెస్ వింగ్ ఫైనల్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు; మూడేళ్ల డిప్లొమా పూర్తిచేసినవారు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్(జీసీఈ) అడ్వాన్స్‌డ్ లెవెల్ ఉత్తీర్ణులు; కనీసం అయిదు సబ్జెక్టులతో ఎన్ఐఓఎస్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

క్వాలిఫయర్ ఎగ్జామ్: రెగ్యులర్ ఎంట్రీ విధానంలో దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు మొదట నెల రోజులు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లీష్, మేథమెటిక్స్ ఫర్ డేటా సైన్స్, స్టాటిస్టిక్స్ ఫర్ డేటా సైన్స్, కంప్యూటేషనల్ థింకింగ్ అంశాలపై తరగతులు ఉంటాయి. ఒక్కో అంశంపై వారానికి 2 నుంచి 3 గంటల వీడియో కంటెంట్ పంపుతారు. అభ్యర్థులకు ఇచ్చిన అసైన్‌మెంట్లను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి ఆన్‌లైన్‌లో పంపాలి. వీటికి మార్కులు ఉంటాయి. మొదటి మూడు అసైన్‌మెంట్లలో కనీసం రెంటిలో 40 శాతం స్కోర్ సాధించినవారిని క్వాలిఫయర్ ఎగ్జామ్‌కు అనుమతిస్తారు. రిజర్వ్‌డు వర్గాలకు 30 శాతం వస్తే చాలు.

- పరీక్ష సమయం 3 గంటలు ఉంటుంది. అంటే ఒక్కో సబ్జెక్టుకు 45 నిమిషాలు ఇస్తారు. ఒక్కోదానిలో కనీసం 40 శాతం చొప్పున మొత్తమ్మీద 50 శాతం మార్కులు రావాలి. ఈ ఎగ్జామ్ రిజల్ట్ వ్యాలిడిటీ ఏడాది లేదా మూడు టర్మ్‌ల వరకు ఉంటుంది

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000; జనరల్ కేటగిరీ దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన దివ్యాంగులకు రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 26
- **క్వాలిఫయర్ ఫేజ్ ప్రారంభం:** మే 31 నుంచి
- **క్వాలిఫయర్ ఎగ్జామ్ తేదీ:** జూలై 7
- **ఫలితాలు విడుదల:** జూలై 12
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** జూలై 17 నుంచి 18 వరకు
- **వెబ్‌సైట్:** study.iitm.ac.in

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

భారత్ - చైనా సంబంధాలు

శనివారం (మే 5) నాటి తరువాయి..

- చైనా నుంచి నేపాల్ మీదుగా బంగ్లాదేశ్‌ను తద్వారా బంగాళాఖాతాన్ని అతి త్వరగా చేరుకోవచ్చు. అయితే మధ్యలో భారతదేశానికి చెందిన ఒక అతి చిన్న కారిడార్ సిలిగురి కారిడార్(చికెన్ నెక్ కారిడార్) ఉంది. ఇది భారతదేశంలో ఈశాన్య రాష్ట్రాలను అనుసంధానిస్తుంది. ఈ చికెన్ నెక్ కారిడార్‌ను ఆక్రమించాలని ఎప్పటి నుంచో చైనా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే చికెన్ నెక్ కారిడార్‌కు ఇరువైపుల ఉన్న నేపాల్, బంగ్లాదేశ్‌లో పటిష్ట స్థావరాలు ఏర్పాటు చేస్తోంది. ఈ చర్య భారత భౌగోళిక భద్రతకు ముప్పు కలిగించే అంశమే.
- అంతేకాక దశాబ్ద కాలంగా నేపాల్‌లో చైనా విస్తృతంగా పెట్టుబడులు పెడుతూ వస్తోంది. ముఖ్యంగా హైడ్రో పవర్ ప్లాంట్స్ సిమెంట్ ఫ్యాక్టరీలు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలైన్ ప్రాజెక్టుల వంటి వాటిలో స్థానిక సంపన్న, రాజకీయ వర్గాల వారికి భాగస్వామ్యం కల్పిస్తోంది. వారిని తనకు అనుకూలంగా మార్చుకుని భారత వ్యతిరేక భావనను పెంపొందించేందుకు చైనా ప్రయత్నిస్తోంది.
- నేపాల్-భారత్ మధ్య ఉన్న చిరకాలమైత్రి వల్ల ఓపెన్ బోర్డర్స్ ద్వారా ప్రజల రాకపోకల్లో స్వేచ్ఛ ఉంది. అయితే ప్రస్తుతం నేపాల్‌ను తనవైపు తిప్పుకోవడానికి నిధులు గుమ్మరిస్తున్న చైనా... దాని అంతిమ వ్యూహం మాత్రం భారత్‌కు నేపాల్‌ను దూరం చేయడమే. భారత్-నేపాల్ మధ్య గల కాలాపానీ, సుస్తా ప్రాంతాల భౌగోళిక హక్కుల వివాదం, నేపాల్ రాజ్యాంగ రచన సమయంలో ఇరుదేశాల మధ్య కలిగిన అభిప్రాయ భేదాలు వంటి చిన్నాచితక వివాదాలు ఇరు దేశాల మధ్య స్పర్థను కలిగించడం చైనాకు కలిసి వచ్చింది.
- అదేవిధంగా శ్రీలంకలో సివిల్ వార్ సందర్భంగా ప్రపంచ దేశాలన్నీ నిరసన వ్యక్తం చేశాయి. అయితే శ్రీలంకకు చైనా మాత్రం భారీ ఎత్తున ఆయుధాలు సరఫరా చేసింది. ఐక్యరాజ్యసమితిలో సివిల్‌వార్‌కు వ్యతిరేకంగా/మానవ హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా ప్రతిపాదించిన తీర్మానాన్ని సైతం చైనా తన వీటో అధికారంతో అడ్డుకుంది. తద్వారా అక్కడి సైనిక ప్రభుత్వానికి దగ్గరైంది. శ్రీలంకలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెట్టుబడుల సహాయం పేరుతో భారీస్థాయిలో రుణాలను అత్యధిక వడ్డీరేట్లకు(6.9%) కుమ్మరించింది. ప్రపంచబ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ వంటి రుణ వితరణ సంస్థల వడ్డీరేట్ల(2.5% - 3%)తో పోల్చితే ఇది చాలా ఎక్కువ. ఈవిధంగా శ్రీలంకకు వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో దాదాపు 30% చైనా నుంచే. అలా శ్రీలంక ఆర్థికవ్యవస్థ చైనా నియంత్రణలోకి వెళ్లిపోయింది. శ్రీలంక ఆర్థిక పరిస్థితి క్షీణత దృష్ట్యా రెవెన్యూ ఆదాయంలో 83% అప్పుల చెల్లింపునకే పోతున్నాయి. దానిలో 25% విదేశీ అప్పులకు సంబంధించిన చెల్లింపులే ఉండటం గమనార్హం. ఈవిధంగా శ్రీలంకను అప్పుల ఉచ్చులోకి చైనా నెట్టేసింది. శ్రీలంక నిర్మించిన హంబిన్‌తోట నౌకాశ్రయానికి అవసరానికి మించి చైనా అప్పు ఇచ్చింది. ఆ అప్పును ఈక్విటీగా మార్చడం ద్వారా, శ్రీలంక నుంచి 99 ఏళ్లకు లీజును చైనా హస్తగతం చేసుకుంది. అంతర్జాతీయ నౌకాయానంలో హిందూ మహాసముద్ర ప్రాంతంలో అత్యంత కీలక స్థావరం ఇది. చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇన్షియేటివ్‌లో కీలకమైన ఈ పోర్టు నిర్మాణానికి చైనా 85 శాతం నిధులు సమకూర్చింది. గూఢచర్య నౌకలకు ఈ ప్రాంతంలో ఆశ్రయమివ్వడానికి, సైనిక మోహరింపునకు కూడా ఈ నౌకాశ్రయాన్ని చైనా వినియోగిస్తోంది. ఫలితంగా భారత నౌకా రవాణాకు, దేశభద్రతకు ప్రమాదం ఏర్పడుతోంది.
- అదేవిధంగా భారత్‌తో సముద్ర సరిహద్దును పంచుకుంటున్న మరో చిరకాల మిత్రదేశమైన మాల్దీవులు ఇప్పుడు ఒక్కసారిగా భారత్ వ్యతిరేక ధోరణిని అనుసరిస్తూ 'ఇండియా అవుట్' నినాదం అందిపుచ్చుకోవడానికి కూడా చైనానే కారణం. ఇటీవల భారత వ్యతిరేక అజెండాతో ఎన్నికల్లో గెలుపొంది, ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన మొహ్మద్ మొయిజ్జు రానురానూ భారత్ వ్యతిరేక ధోరణిని తీవ్రం చేస్తూ చైనాకు దగ్గరవడం ప్రస్ఫుటంగా కనిపిస్తూనే ఉంది. భారత విపత్తు, మానవతా సహాయ దళాలను దేశం విడిచి వెళ్లాలని ఆదేశించిన మొయిజ్జు వెనువెంటనే చైనాతో సైనిక రక్షణ సహకార ఒప్పందం చేసుకోవడం, చైనా గూఢచార నౌక షియాంగ్ యాంగ్ హాంగ్-3 సముద్ర సర్వే నెపంతో మాల్దీవుల ప్రాదేశిక జలాల్లో తిష్టవేయడం వంటి అనేక సంఘటనలు భారత వ్యతిరేక వైఖరిని చాటి చెబుతూనే ఉన్నాయి. దీనంతటికీ కారణం చైనా నుంచి మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టు పెట్టుబడులు కుమ్మరించడమే అన్నది జగమెరిగిన సత్యం. మాల్దీవుల అప్పుల్లో 60% చైనా ద్వారా లభించినవే. మాల్దీవుల జాతీయాదాయంలో 31%గా ఉంది.



- ఈవిధంగా భారత్ సరిహద్దు దేశాలైన శ్రీలంక, పాకిస్థాన్, మాల్దీవులు తీవ్రంగా అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో వాటి ఆర్థిక, రాజకీయ నిర్ణయాల్లో చైనా నేరుగా జోక్యం చేసుకోగలుగుతోంది. తన వ్యూహాత్మక ప్రయోజనాల కోసం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 97 దేశాలపై చైనా తన అప్పుల వల విసిరిందని ప్రపంచబ్యాంకు నుంచి సేకరించిన గణాంకాల ద్వారా ఫోర్బ్స్ సంస్థ ఒక నివేదికలో వెల్లడించింది. ఈవిధంగా చైనా తన ప్రపంచ వాణిజ్యం, అమెరికాకు దీటుగా ఎదగడం, వ్యూహాత్మక స్థావరాలను ఏర్పర్చుకొనే నిమిత్తం బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ రూపంలో అప్పుల వల విసురుతూ నయావలసవాదానికి తెరలేపింది.
- అదేవిధంగా తనకు పక్కలో బల్లెంలా ఉన్న భారత్‌ను పనిలో పనిగా ఇదే వ్యూహంతో అష్టదిగ్బంధనం చేయడానికి ఇరుగుపొరుగు దేశాల్లో పాగా వేస్తోంది. ఈవిధంగా కుయుక్తులతో చొచ్చుకువస్తున్న చైనాను నిలువరించాలంటే అంతర్జాతీయంగా కదలిక రావాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా మిలిటరీ జుంటా పాలనలో ఉన్న మయన్మార్, పాకిస్థాన్, శ్రీలంక వంటి దేశాలకు ఆయుధాలు, నిధులు సరఫరా చేసే చైనాకు అట్టి పాలన వ్యవస్థలు మన్నినంత కాలం ఢోకా ఉండదు. ఆ దేశాలను తన చదరంగంలో పావులుగా మార్చుకోగలదు. కాబట్టి ఆ దేశాల్లో ప్రజాస్వామ్య ప్రభుత్వాల ఏర్పాటుకు అంతర్జాతీయ కృషి జరగాలి. చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇన్షియేటివ్, స్ట్రింగ్ ఆఫ్ పెర్ల్స్ పాలసీలకు దీటుగా అంతర్జాతీయ సమాజం ప్రత్యామ్నాయాలను తీసుకురావాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా చైనాను నిలువరించగలం.
- అదేవిధంగా భారత్ కూడా తన ఇరుగుపొరుగు దేశాలతో మరింత వ్యూహాత్మకంగా మెలగడం, అంతర్జాతీయ మద్దతు పొందడం, స్థానిక భాగస్వామ్య కూటములను బలోపేతం చేసుకోవడం ద్వారా చైనాకు అడ్డుకట్ట వేయవచ్చు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

హాయ్ బుజ్జీ

భయంలేని జింక పిల్ల భయపడిన సింహరాజు



అనగనగా ఓ అడవి. దగ్గర్లోనే ఒక గ్రామం ఉంది. ఆ గ్రామంలోని ఒక రైతు చేలోకి జింకలొచ్చేవి. వాటిని ఏమీ అనేవాడు కాదు. ఆ రైతు గుడిసెలోకి కూడా జింకలు వెళ్లి పడుకునేవి. ఒక రోజు రాత్రి జింకపిల్ల విపరీతంగా ఏడుస్తోంది. వాళ్ల అమ్మ జింకపిల్ల ఏడ్వొద్దని కథలు చెబుతోంది. అయినా ఏడుపు ఆపలేదు ఆ జింకపిల్ల. అంతలోనే ఆ గుడిసె దగ్గరకొచ్చి ఓ సింహం బయట పొంచి ఉంది. బయటికి వస్తూనే జింక గొంతు కొరికేద్దామా? అన్నట్టు సింహం ఎదురు చూస్తోంది. 'అదిగో ఎలుగు బంటి వస్తోంది' అంటూ పిల్లతో అన్నది జింక. జింకపిల్ల భయపడలేదు. అదిగో.. హైనా వచ్చె అన్నది. అయినా జింక భయపడలేదు. అదిగో సింహం వచ్చింది. తింటుంది అని చెప్పినా జింకపిల్ల ఏడుపు ఆపలేదు. 'అదిగో అఫ్లాతూన్ వచ్చాడు' అంటూనే జింకపిల్ల ఏడుపు ఆపింది. సైలెంట్ అయింది. ఇది విన్న సింహం వెనక్కి పరిగెత్తింది. ఆ చీకట్లో ఒక వ్యక్తికి ఢీ కొట్టింది. అది సింహమనే విషయం తెలీక దాని మెడను ఆ వ్యక్తి గట్టిగా పట్టుకున్నాడు. అఫ్లాతూన్ గాడు చంపేస్తాడేమోనని ఆ సింహం పరిగెడుతోంది. కిందపడితే.. ఇదేదో తింటుందని ఆ వ్యక్తి అలానే సింహాన్ని పట్టుకున్నాడు. కొంచెం దూరం వెళ్లాక సింహం గొంతు విడిచేశాడు ఆ వ్యక్తి. కిందపడిపోయాడు. అఫ్లాతూన్ వస్తాడేమోననే భయంతో సింహం గుండె వేగంగా కొట్టుకుంటోంది. వాడేమైనా చంపేస్తాడేమోనని వణుకుతోంది.

వాస్తవానికి అఫ్లాతూన్ అంటే బాక్సర్ అని అర్థం. అయితే అదో భయంకరమైన జంతువు అని సింహం అనుకుంది. దాని బారిన నుండి తప్పించుకున్నాని సంబరపడిపోయింది.

నీతి- నువ్వు మెదడులో ఏమనుకుంటే అదే జరుగుతుంది.




పదాలు కనుక్కోండి

BIKE
CONTAINER
ELECTROCAR
FOREST
MOUNTAINS
PLANET
PLANT
SORTING
SUN
TREE

C	O	N	S	O	R	T	I
L	E	T	B	I	K	E	N
E	C	A	I	N	E	R	G
T	T	R	O	C	A	R	N
P	R	P	L	M	O	S	U
L	F	E	A	N	U	N	S
A	O	R	E	E	T	T	N
N	T	E	S	T		A	I




సరైన నీడ ఏది?



10 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 300

6	3				8		4	7
								3
		9	3					6
	2			9				4
3			1		4			2
8				3			1	
9					7	4		
1								
2	6		9				5	8

సుడోకు - 299 సమాధానం

5	1	3	7	2	4	9	6	8
7	6	8	5	9	3	4	1	2
2	4	9	1	8	6	7	3	5
3	7	6	2	5	1	8	9	4
8	9	2	4	3	7	1	5	6
1	5	4	9	6	8	3	2	7
6	8	1	3	7	2	5	4	9
4	2	5	8	1	9	6	7	3
9	3	7	6	4	5	2	8	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.